
కౌలాలంపూర్‌లో శనివారం సినీతారల వేడుకలో సూపర్‌స్టార్ రజనీకాంత్, కమల్‌హాసన్

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 60 • సంచిక: 363 • ఆదివారం 7 జనవరి 2018 • విజయవాడ ✻ పేజీలు: 14 • వెల: 6.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, తిథి: బహుళ షష్ఠి రా. 9.40 వరకు, అనంతరం సప్తమి; నక్షత్రం: పుబ్బ ఉ. 7.04 వరకు, అనంతరం ఉత్తర తె. 6.30 వరకు; అమృతకాలం: రా. 11.40 నుండి 1.15 వరకు; వర్జ్యం: మ. 2.06 నుండి 3.40 వరకు, దుర్ముహూర్తం: సా. 4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు

హామీలన్నీ అమలు చేశాకే ఓట్లడుగుతాం

• ఆర్థిక లోటు ఉన్నా ఇచ్చిన హామీలన్నీ తీరుస్తాం • మార్చి నుంచి పెళ్లి కానుక పథకం తెస్తున్నాం • డిసెంబరుకల్లా ఇంటింటికీ కుళాయి ఇస్తాం • మార్చికల్లా మరో 16 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు • తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో మంత్రి నారా లోకేష్


తూ.గో జిల్లా పండూరులో మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్

కాకినాడ, ప్రభ న్యూస్ బ్యూరో: నిర్దేశిత పనులన్నింటినీ పూర్తి చేసిన తర్వాతే తాము ఓట్లు అడుగుతామంటూ గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. గతెన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని కాలపరిమితిలోగా నూరు శాతం అమలు చేసి తీరుతామన్నారు. మార్చి నుంచి పెళ్ళికానుక పథకాన్ని అమల్లోకి తెస్తున్నామన్నారు. 2018 చివరినాటికి గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి కల్పిస్తామన్నారు. 157పంచాయతీల్లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే 14వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను సిసి రోడ్లుగా మార్చామన్నారు. గ్రామాల్లో 4200అంగన్‌వాడీ భవనాల్ని నిర్మించామన్నారు. శనివారం తూర్పుగోదావరి జిల్లాలో లోకేష్ విస్తృతంగా పర్యటించారు. ఉదయం పండూరులో మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. అచ్చంపేటలో ఘనవ్యర్థపదార్థాల నిర్వహణ, సంపద కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పెద్దాపురంలో నిర్మాణంలో ఉన్న అందరికీ ఇళ్ళు ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. అక్కడే అపర్ణటైల్స్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. జగ్గంపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం ప్రత్తిపాడులో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఆర్థిక లోటున్నప్పటికీ ఇచ్చిన హామీల్లో వెనక్కితగ్గేదిలేదన్నారు. ఒకేసారి పింఛన్ మొత్తాన్ని ఐదురెట్లకు పెంచడంపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడున్నారన్నారు. ఇప్పటికే డ్వాక్రా మహిళలకు వారి ఖాతాల్లో ఆరేసివేల చొప్పున జమ చేశామన్నారు. రైతుల రుణమాఫీ ఒక కొలిక్కొస్తోందన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆదాయం తెలంగాణాకెళ్ళగా అప్పులు మాత్రం మనకు మిగిల్చారని ⇨ 2వ పేజీలో...


నెల్లూరు జిల్లా బలిజపాళెం అంగన్‌వాడీ చిన్నారితో చంద్రబాబు

"జన్మభూమితో గ్రామాల రూపు రేఖలు మారుతున్నాయి. కనీస మౌలిక వసతులు సమకూరుతున్నాయి. ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తిగా ఉన్నారు. జన్మభూమికి స్పందన బాగుంది. తొలి రోజు మూడు లక్షల మంది వచ్చారు. నాలుగో రోజు ఆరున్నర లక్షల మంది హాజరయ్యారు. అర్జీలను ఆన్‌లైన్ చేయడంలోనే వెనకబడుతున్నారు."

\- టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

కరెంట్ చార్జీలు తగ్గిస్తాం

• అమరావతిని ప్రజా దేవాలయంలా అభివృద్ధి చేస్తా
• మనల్ని అవమానించిన వాళ్లు కుళ్లి కుళ్లి ఏడ్వాలి
• కోడూరుపాడు జన్మభూమి సభలో సీఎం చంద్రబాబు

నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో: రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో ముందుకు నడిపించేందుకు వినూత్న రీతిలో సరికొత్త విధానాలను అనుసరిస్తూ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ అన్ని సమస్యలను అధిగమించుకుంటూ ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నాం... అందులో భాగంగానే విద్యుత్ ఉత్పాదనారంగంలో స్టోరేజి వ్యవస్థను మరింత పటిష్టం చేయబోతున్నాం... ఫలితంగా కరెంటు చార్జీలు తగ్గించే ప్రయత్నం కూడా చేయబోతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం ఆయన ఐదవ విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని కోడూరుపాడులో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మహిళలనుద్దేశించి సుదీర్ఘంగా ప్రసంగించారు. అంతకుముందు ఆయన వివిధ శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించి, జన్మభూమి గ్రామసభనుద్దేశించి మాట్లాడుతూ కొంతమంది పనిగట్టుకుని తమను విమర్శిస్తున్నారని, మరికొందరు అవమానిస్తున్నారని, ⇨ 2వ పేజీలో...

మూడున్నరేళ్లు జైలు



నేరాలు తేలకుండానే నేతలు జైళ్లకా!

• కింది కోర్టుల్లో తీర్పులు.. పై కోర్టుల్లో తల్లకిందులు
• రాజకీయ నేతలకు అప్పటికే భారీ నష్టం

గృహ నిర్బంధమే సబబైన చర్య

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్‌పై నమోదైన దాణా కుంభకోణానికి సంబంధించి వ్యాజ్యాలు పూర్తయి నేరం రుజువైన క్షణం నుంచి చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో దేశంలో పేరొందిన పాలకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ వేత్తలకు సంబంధించి శిక్షల అమలు చర్చనీయాంశంగా మారింది. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రభుత్వ ఖజానాకు నష్టం కలుగజేశారని, లేదా కాంట్రాక్టులు, ఇతర ప్రయోజనాలు కల్పించి అందుకు బదులుగా ఆర్థికలాభం పొందారంటూ నాలుగు దశాబ్దాల్లో పలువురిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలా ఆరోపణలు రాగానే ప్రాథమిక ⇨ 3వ పేజీలో...



అప్పన్న స్వామికి హృదయ లక్ష్మీ హారం

• బరువు : 721 గ్రాములు
• ఖరీదు: రూ. 31 లక్షలు

సింహాచలం(విశాఖపట్నం), ప్రభ న్యూస్ బ్యూరో: సింహాచలం శ్రీ వరాహాలక్ష్మీనృసింహస్వామిపై ఉన్న భక్తిశ్రద్ధలతో గోపాలపట్నం కొత్తపాలెం ప్రాంతానికి చెందిన దొడ్డికిరణ్, లక్ష్మీ దంపతులు శనివారం సింహాద్రి నాదుడికి హృదయలక్ష్మి హారం సమర్పించారు. ఈ హారం ⇨ 7వ పేజీలో...

దుర్గ గుడి ఈవో బదలీ


• క్షుద్ర పూజలు జరగలేదని నివేదికలు?
• మరింత లోతుగా విచారణకు నిర్ణయం
• అందుకే ఈవో సూర్యకుమారికి స్థాన చలనం
• మంత్రి మాణిక్యాలరావు వెల్లడి 7 లో





12న ఢిల్లీకి సీఎం

• ప్రధాని మోడీతో ప్రత్యేక భేటీకి ఏర్పాట్లు
• పోలవరం, విభజన అంశాలపై చర్చ
• ఎజెండాపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
• 9, 10 షెడ్యూల్ సమస్యలపైనా దృష్టి 9 లో



రాహుల్‌పై హక్కుల నోటీస్ లోక్‌సభకు

• ఉల్లంఘన జరిగినట్టు నిర్ధారణ • స్పీకర్‌కు పంపిన రాజ్యసభ చైర్మన్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిపై వచ్చిన సభాహక్కుల నోటీసును రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు పంపించినట్టు సంబంధిత వర్గాలు శనివారం వెల్లడించాయి. రాహుల్ లోక్‌సభ సభ్యుడు కావడంతో సభా హక్కుల ఉల్లంఘన జరిగిందని తేలినందునే మున్ముందు చర్య కోసం చైర్మన్ నోటీసును స్పీకర్‌కు పంపించారని తెలిపాయి. బీజేపీ వృద్ధ నేత ఎల్.కె. అద్వానీ అధ్యక్షతన లోక్‌సభ ఎథిక్స్ కమిటీ వద్ద సైతం రాహుల్‌పై ఒక ఫిర్యాదు నమోదైంది. రాజ్యసభ అధికారాన్ని, దాని నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చేసిన ట్వీట్‌పై బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు భూపేందర్ యాదవ్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. సభా నేత, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేరును జైట్‌లై గా వక్రీకరిస్తూ ట్వీట్ చేయడం ద్వారా రాహుల్ గాంధీ సభా హక్కుల ఉల్లంఘనకు ⇨ 7వ పేజీలో...

ఉమ్మడి హైకోర్టు విభజనకు 3 కమిటీలు



• ఫిబ్రవరిలో క్షేత్రస్థాయి పరిశీలనలు
• ఏప్రిల్ చివరికల్లా భవనం సిద్ధం
• వేసవి సెలవుల్లో సామగ్రి తరలింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉమ్మడి హైకోర్టును విభజించేందుకు , అమరావతిలో ఏపీ హైకోర్టును తాత్కాలిక భవనంలో ప్రారంభించేందుకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ మూడు కమిటీలను ఏర్పాటు చేశారు. ఏపీ సర్కారు ప్రతిపాదించిన భవనాల పరిశీలన కమిటీ, ఉద్యోగుల విభజనకమిటీ, రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు మరో కమిటీని ఏర్పాటు చేశారు. ఉమ్మడి హైకోర్టు ఉద్యోగుల కమిటీలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ సురేశ్ కుమార్ కైత్ , జస్టిస్ ఏ.రాజశేఖర్ రెడ్డి, జస్టిస్ ఏ. శంకరనారాయణ, జస్టిస్ షమీమ్ అక్తర్, ఉన్నారు. భవనాల కమిటీలో జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, జస్టిస్ఏవీ.శేషసాయి, జస్టిస్ టి.సునీల్ చౌదరి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి ఉన్నారు. ఇక రికార్డుల డిజిటలైజేషన్ కమిటీలో జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్, జస్టిస్ పి.నవీన్ రావు, జస్టిస్ ఎస్వీ.భట్, జస్టిస్ యు. దుర్గాప్రసాదరావు ఉన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు వేర్వేరుగా హైకోర్టులు వచ్చే జూన్ 2 వ తేదీ ⇨ 7వ పేజీలో...

బడ్జెట్ తీరు మారాలి!

• క్షేత్రస్థాయి సమస్యలే ఆలంబన కావాలి
• ప్రజల ఆకాంక్షలకే అద్దం పట్టాలి



(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి :)

గతకొన్నేళ్ళుగా బడ్జెట్ రూపకల్పనలో ప్రాదేశిక ఆదేశాలు మరుగునపడ్డాయి. పాలకుల ప్రయోజనాలు, ఇష్టాఇష్టాలకే ప్రాధాన్యత పెరిగింది. అందుకు భిన్నంగా ఇప్పుడు ఒక్కో రాష్ట్రం తీరుమార్చుకుంటున్నాయి. నిర్దేశిత లక్ష్యాలకనుగుణంగా బడ్జెట్ రూపకల్పనకు సమాయత్తమౌతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇదే దిశలో అడుగులు వేస్తున్నది. తద్వారా ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తున్న సంకేతాలు పంపుతున్నాయి. బడ్జెట్ అంటే ఒక ఏడాదిలో సమకూరే ఆదాయం, జరపాల్సిన కేటాయింపుల చిట్టాపద్దులు. ఇవి ప్రజల అవసరాలు, ఆకాంక్షలే ప్రాధాన్యతాంశాలుగా జరగాలి. ఈ లక్ష్యంతోనే ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థల్తో పాటు అన్ని పాలనారంగాల్లోనూ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సంప్రదాయంగా మారింది. భారత్‌లో కొంతకాలం క్రితం వరకు ప్రతిఏటా ఆరుమాసాల ముందునుంచే ప్రాధాన్యతాంశాల గుర్తింపు ప్రక్రియ మొదలయ్యేది. అది కూడా క్షేత్రస్థాయి నుంచి అవసరాల్ని ఎంపిక చేసేవారు. అంచెలవారీగా ఈ డిమాండ్ రాష్ట్రానికి, కేంద్రానికి చేరేది. అందుబాటులో ఉన్న నిధులు, అవసరాల ప్రాధాన్యతల ప్రాతిపదికన కేటాయింపులు ⇨ 3వ పేజీలో...

ఔరా..!



కరెంటు చార్జీలు తగ్గిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అటువంటివారందరూ కుళ్ళికుళ్ళి ఏడ్చేలా నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తానని శపథం చేశారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రజా ఆశీస్సులతో అమరావతిని ప్రజా దేవాలయంగా తయారుచేస్తానన్నారు. అలాగే ప్రతి పేదవాడికి స్వంతఇంటికల నెరవేర్చే దిశగా ఇప్పటికే నాణ్యమైన ఇళ్ళ నిర్మాణాన్ని చేపట్టామని, రాష్ట్రవ్యాప్తంగా 19 లక్షల ఇళ్ళ నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అందులో పట్టణ ప్రాంతాల్లో 6 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో 13 లక్షల ఇళ్ళు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకోసం నిర్మించిన రాజీవ్ స్వగృహ లాంటి నాసిరకం ఇళ్ళు నిర్మించడంతో ప్రస్తుతం అనేకమంది పేదలు ఆ ఇళ్ళలో ఉండలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకు భిన్నంగా పేదవాడి స్వప్నానికి దగ్గరగా తమ ఇళ్ళ నిర్మాణం ఉంటుందన్నారు. జన్మభూమి స్ఫూర్తితో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా చేపడుతున్నామన్నారు. పట్టణ ప్రాంతాలకు ధీటుగా పల్లెలను అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమన్నారు. అందుకోసం జన్మభూమి కార్యక్రమాన్ని ఒక వేదికగా చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించేందుకు రెండు టీములను కూడా ఏర్పాటుచేశామన్నారు. 9 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో 9 విభాగాలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టిసారించి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పడినప్పుడే ఆ ప్రాంతం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే గ్రామీణ ప్రాంతాల్లో అన్ని సదుపాయాలకు యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో భవనాన్ని కట్టించేందుకు నిధులను కూడా కేటాయించడం జరిగిందన్నారు. ప్రత్యేకించి మహిళా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలోను అంగన్‌వాడికి స్వంత భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 4,132 భవనాలు నిర్మించామన్నారు. అలాగే కాన్వెంట్ విద్యకు దీటుగా అంగన్‌వాడి కేంద్రాల్లో ఆంగ్ల బోధన అందిస్తున్నామన్నారు. అలాగే 594 స్త్రీశక్తి భవనాలను నిర్మించి మహిళలకు ఓ కొత్త వేదికను ఏర్పాటు చేశామన్నారు. దీంతో గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం శక్తితో ముందుకు సాగుతూ ప్రభుత్వానికి ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వారి సేవలను ఆయన కొనియాడారు.

పోలవరంపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో సాగు, తాగునీటి కొరతను పూర్తిస్థాయిలో అధిగమించేందుకు కొన్ని ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. అందులో భాగంగానే నదుల అనుసంధానానికి పెద్ద ఎత్తున ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో చెరువుల అనుసంధానాన్ని కూడా చేపట్టడంతో పాటు గోదావరి, పెన్నా నది అనుసంధానం పనులను ఇప్పటికే ప్రారంభించామన్నారు. అలాగే వంశధార-నాగావళి, గోదావరి-కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేస్తానన్నారు. వాటితో పాటు వర్షపు నీటిని వృధా కానీకుండా గ్రామీణ ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు, ఫాం పాండ్స్ నిర్మిస్తున్నామన్నారు. అలాగే రాష్ట్రరైతాంగానికి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన పోలవరం ప్రాజెక్టుపై కూడా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకుందన్నారు.

ఫిబ్రవరిలో మూడో విడత పారిశ్రామిక సదస్సు

రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే పలువురు పారిశ్రామికవేత్తలతో రెండు విడతలుగా ప్రత్యేక సదస్సును నిర్వహించామన్నారు. అదే తరహాలో ఫిబ్రవరి మొదటివారంలో మూడో విడత పారిశ్రామిక సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు 973 మంది పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు.



ఆ పరిశ్రమలు ఏర్పాటైతే రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గతంలో ఏర్పాటుచేసిన సదస్సుల వల్ల 11 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో పరిశ్రమలు పెట్టేందుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. విశాఖ, చెన్నై కారిడార్‌గా అభివృద్ధి చేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామని తద్వారా మరికొన్ని పరిశ్రమలు కూడా వచ్చే అవకాశముందన్నారు.

2029 నాటికి ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్‌ను నెం.1 రాష్ట్రంగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నాన న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు బొల్లినేని రామారావు, పాశం సునీల్ కుమార్, పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణ రెడ్డి, బీద రవిచంద్ర, మాజీ మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, ఆదాల ప్రభాకర్ రెడ్డి, పరసారత్నం, తాళ్లపాక రమేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు, మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, విజయడెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేశాకే ఓట్లడుగుతాం

(మొదటిపేజీ తరువాయి)

లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ లోటు బడ్జెట్‌లోనే సతమతమౌతోందన్నారు. సిద్ధాంత ప్రాతిపదిక లేని విభజన వల్ల రాష్ట్రంపై భారం పెరిగిందన్నారు. రావాల్సిన ఆదాయానికి అప్పటి కేంద్రప్రభుత్వమే గండికొట్టిందన్నారు. విభజనలో స్పష్టమైన విధానాన్ని పాటించలేదన్నారు. అయినప్పటికీ బాబు అవిరళ కృషి కారణంగా ఏపీ తిరిగి ఆర్థికంగా కోలుకుంటోందన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రమాణాలు గల పాలనా వ్యవస్థను సీఎంఇక్కడ ప్రవేశపెట్టారన్నారు. పాలనలో పూర్తిపారదర్శకత అమలౌతోందన్నారు.

ఉత్పత్తవుతున్న ఫోన్లలో 20 శాతం ఇక్కడే

దేశంలో ఉత్పత్తవుతున్న ప్రతి పది మొబైల్ ఫోన్లలో రెండు ఆంధ్రప్రదేశ్ లోనే తయారౌతున్నాయని లోకేష్ పేర్కొన్నారు. పెద్దాపురంలో అపర్ణటైల్స్ ఫ్యాక్టరీ ప్రారంభం అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్ చక్కని అవకాశం కల్పిస్తోందన్నారు. అందుకే ఈజ్ ఆఫ్ డూయింగ్ లో రాష్ట్రం ప్రథమ స్థానాన్ని సాధించిందన్నారు. అనుమతుల మంజూరును వేగవంతం చేశామన్నారు. అవసరమైన విద్యుత్, ఇతర సదుపాయాల్ని కల్పిస్తున్నామన్నారు. పెట్టుబడి రాయితీ కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ఐటి హబ్‌గా మారుతోందన్నారు. ఇప్పటికే అంతర్జాతీయ ఐటి సంస్థలకు ఇష్టమైన కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిందన్నారు. పారిశ్రామికీకరణతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు.

పల్లె సేవే పరమాత్మ సేవ

దేశాభివృద్ధిలో పల్లెలే పట్టుగొమ్మలని లోకేష్ చెప్పారు. పల్లెకు సేవ చేస్తే పరమాత్మునికి చేసినట్లేనన్నారు. గ్రామీణాభివృద్ధి మంత్రిగా వ్యవహరించడం తన పూర్వ జన్మసుకృతంగా చెప్పారు. కన్నతల్లి వంటి గ్రామాల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా దేశానికే మనగ్రామాల్ని రోల్ మోడల్స్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో 27లక్షల వ్యక్తిగత మరుగు దొడ్లను నిర్మించామన్నారు. మార్చి చివరినాటికి మరో 16 లక్షలు నిర్మిస్తామని, గ్రామాల్లో నిరంతర విద్యుత్‌నందిస్తున్నామని, త్వరలోనే ఫైబర్‌గ్రిడ్‌ను గ్రామాలకు అందుబాటులోకి తెస్తామన్నారు. దీంతో ఇక్కడ్నుంచే ఎక్కడో విదేశాల్లో లేదా భారతీయ నగరాల్లో ఉన్న తమ బంధువులు, స్నేహితుల్తో వీడియోకాల్స్ మాట్లాడుకునే సౌకర్యం కలుగుతుందన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు... సెన్సర్లతో అనుసంధానం



రక్షిత మంచినీటి సరఫరా పథకం ఫేజ్-2ను ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గల ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను సెన్సర్ వ్యవస్థతో అనుసంధానిస్తున్నట్లు మంత్రి లోకేష్ వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తయితే అమరావతి నుంచే గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల వారీగా నాణ్యతా పర్యవేక్షణకు వీలేర్పడుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి రక్షిత తాగునీటి సరఫరాకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇందుకోసం 22వేల కోట్లతో బృహత్తర ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. 2019నాటికి అన్ని గ్రామాలకు రక్షిత తాగునీటిని అందుబాటులో ఉంచుతామన్నారు. వీటితో పాటు 30ఏళ్ళ క్రితం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులను 45కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని పండూరు గ్రామంలో 15కోట్ల నాబార్డ్ నిధుల్తో నిర్మించిన సమగ్ర రక్షిత మంచినీటి పథకం రెండో దశను లోకేష్ శనివారం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా పిఠాపురం బ్రాంచ్ కెనాల్ నుంచి గోదావరి జలాల్ని నియోజకవర్గ పరిధిలోని సూర్యారావుపేట, తదితర గ్రామాల్లోని 16ఆవాశాలకు రక్షిత తాగునీటి సరఫరా చేపడతారు. ఈ సందర్భగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ స్వతంత్రమొచ్చి 70ఏళ్ళుగడిచినా ఇంకా పలు గ్రామాలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరికీ రక్షిత తాగునీటి కల్పనకు తాము దృడసంకల్పంతో ఉన్నామన్నారు. 2019నాటికి రాష్ట్రంలోని అన్ని ఆవాసాల ప్రజలకు తాగునీటిని అందుబాటులోకి తెస్తామన్నారు. మొదటిదశ స్పెషల్‌ప్యాకేజీ కింద ఇప్పటికే 10వేల కోట్లు ఖర్చుచేశామన్నారు. వివిధ దశల్లో ఉన్న 240తాగునీటి పథకాల్ని మార్చినాటికి పూర్తి చేస్తామన్నారు. డిసెంబర్ నాటికి అన్ని ఆవాసాల సమస్యల్ని సమగ్రంగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్‌పి తోట నరసింహం, జడ్‌పి ఛైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్, ఎమ్మెల్సీలు చిక్కాల రామచంద్రరావు, రవికిరణ్‌వర్మ, ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీ సత్యనారాయణమూర్తి, కలెక్టర్ కార్తికేయమిశ్రా, ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకరరావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజేశ్వరరావు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ అప్పారావు, డిఇ వెంకట్రావు, ఎమ్‌పిపి పుల్లా సుధాచంది, జడ్‌పిటిసి కె సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి వేదికగా చిన్నారులతో సీఎం

- ముఖ్యమంత్రిని ఆకట్టుకున్న పిల్లల ప్రసంగం
- బాబు అడిగిన ప్రశ్నలకు చిటికెలో సమాధానం చెప్పిన అంగన్‌వాడీ విద్యార్థులు
- వారి మేథాశక్తికి మెచ్చి భవనానికి చంద్రబాబు రూ.20 లక్షలు మంజూరు
- టీచర్‌కి రూ.25 వేలు పారితోషికం

నెల్లూరు, ప్రభన్యూస్ బ్యూరో: జన్మభూమి- మా ఊరు వేదికపై అంగన్‌వాడి చిన్నారులు, మున్సిపల్ కాలేజి విద్యార్థులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సరదాగా గడిపారు. క్షణం తీరిక లేకుండా ఎప్పుడూ బిజీ షెడ్యూల్‌తో ఉండే ఆయన శనివారం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాలోని కోడూరుపాడులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో చిన్నారుల ప్రసంగానికి, కాలేజి విద్యార్థుల దీనగాథకు చలించి వారిపై ప్రశంసల జల్లుతో పాటు ఆర్థికపరమైన వరాలు కూడా కురిపించారు. జన్మభూమి గ్రామ సభలో పాల్గొనేందుకు 2.10 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్న ఆయన 20 నిమిషాలపాటు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం 2.30 గంటలకు సభా వేదికపైకి చేరుకుని ప్రజలనుద్దేశించి సుదీర్ఘంగా గంట 20 నిమిషాల పాటు ప్రసంగించారు. జన్మభూమి కార్యక్రమం ఉద్దేశం, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించిన ఆయన బలిజపాళెం అంగన్‌వాడి చిన్నారులతో కొంతసేపు ముచ్చటించారు. ఆయన 3 నుంచి 5 ఏళ్లల్లోపు వయసు కలిగిన చిన్నారులతో మన జాతీయ జెండాను ఎవరు రూపొందించారు, జాతీయ గీతం ఏమిటి, భారతదేశ మొదటి ప్రధాని ఎవరు, జాతీయ గీతాన్ని ఎవరు రచించారు, అడవులు ఎక్కువగా ఉండే రాష్ట్రం ఏది, భారతదేశ మొట్ట మొదటి రాష్ట్రపతి ఎవరు అంటూ ఆ చిన్నారులను ప్రశ్నల మీద ప్రశ్నలు వేశారు. ఆయన అడిగిన అన్ని ప్రశ్నలకు చిటికెలోనే ఆ చిన్నారులు సమాధానం చెప్పి ముఖ్యమంత్రితో పాటు సభికులను ఆశ్చర్య పరిచారు. దీంతో వారి ముద్దుముద్దు సమాధానాలకు ముగ్ధులైన సీఎం ఆ చిన్నారులను భుజంపై ఎత్తుకుని అభినందించి అంత చిన్న వయసులోనే వారి మేధాశక్తికి మరింత పదును పెడుతున్న అంగన్ వాడి టీచర్‌ను వేదికపై పిలిచి ప్రత్యేకంగా అభినందించారు. అంత టితో ఆగకుండా మీకు ఏం కావాలంటూ ఆ చిన్నారులను ప్రశ్నించడంతో అక్కడే ఉన్న టీచర్ తమకు సరైన భవనం లేదని చెప్పింది. దీంతో ఆయన బలిజపాళెం అంగన్‌వాడి కేంద్రాన్ని ఆదర్శకేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.20లక్షలను ప్రకటించారు. అదేవిధంగా అంగన్‌వాడి టీచర్ పనితీరును ప్రశంసిస్తూ ప్రభుత్వం తరపున రూ.25 వేల పారితోషకాన్ని ఇస్తామన్నారు.



బలిజపాళెం అంగన్‌వాడి చిన్నారులతో ముచ్చటిస్తున్న బాబు


విద్యార్థుల దీనగాథతో చలించిపోయిన సీఎం

నెల్లూరు మున్సిపల్ కాలేజి విద్యార్థులతో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు. వారిలో తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంకు చెందిన దళిత బాలిక శిరీష మాట్లాడుతూ తన కుటుంబ ఆర్థిక స్థితిగతులను వివరించింది. తాను 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించినా ఉన్నత చదువులు చదువుకోలేక బాధ పడుతున్న సమయంలో రాష్ట్రపురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరు వీఆర్ కళాశాలలో పేద విద్యార్థుల కోసం మున్సిపల్ కాలేజిని కొత్తగా ప్రారంభించారని తెలిసి కాలేజీలో చేరానన్నారు. డాక్టర్ కావాలన్న తన కోరిక నెరవేర్చుకునేందుకు ఇది ఒక వేదిక అని ఇదే తరహాలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మున్సిపల్ కాలేజిలు ఏర్పాటుచేస్తే నాలాంటి ఎందరో పేద విద్యార్థులకు కొత్త వెలుగు చూపిన వారవుతారని ఆ విద్యార్థి తన జీవితంలో ఎదుర్కొన్న కొన్ని సంఘటనలను ముఖ్యమంత్రికి వివరించింది. మరో ఇద్దరు విద్యార్థులు కూడా ఇదే తరహాలో వారి దీనగాథ వివరించారు. దీంతో వారి పరిస్థితి విని చలించిన సీఎం వారి పేరుమీద రూ.50 వేలు ఫిక్సిడ్ డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చారు.

జన్మభూమితో మారుతున్న గ్రామాల రూపురేఖలు

- ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో సంతృప్తి
- వినూత్న ఆలోచనలతో అన్నీ సాధ్యమే
- విద్యుత్, మౌలిక వసతుల్లో అగ్రగామిగా నిలవాలి: టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: జన్మభూమి- మా ఊరు కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని, కనీస మౌలిక వసతులైన రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం సమకూరుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల పట్ల ప్రజల నుంచి పూర్తి స్థాయి సంతృప్తి వ్యక్తమవుతోందని మూడున్నరేళ్ల నిరంతర శ్రమకు ఫలితాలు అన్నిచోట్ల కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం ముఖ్యమంత్రి ఉండవల్లిలోని తన నివాసం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులతో 5వ రోజు జన్మభూమి-మా ఊరు కార్యక్రమంపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారన్నారు. వారిలో సానుకూలత, స్పష్టత పెరిగిందని ఇది మంచి పరిణామంగా అభివర్ణించారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో తొలి రోజు మూడు లక్షల మంది ప్రజలు పాల్గొంటే నాల్గవ రోజు 6.54 లక్షల మంది హాజరయ్యారని, మిగిలిన రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తి కనిపించాలని ఆకాంక్షించారు. గత నాలుగు రోజుల్లో 4,68,063 అర్జీలు వచ్చాయని వాటిలో 1,52,444 ఫిర్యాదులు ఆన్‌లైన్ చేయడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో 85 శాతం ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరిచారని మిగిలిన జిల్లాలు కూడా అదే విధంగా పనిచేయాలని ఆదేశించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును రియల్ టైమ్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వ్యవస్థల సామర్థ్యం పెంపు, ప్రజా భాగస్వామ్యం ఒక డెడ్లీ కాంబినేషన్ అని ఎంతమందికి వీలైతే అంతమందికి న్యాయం చేయాలని అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి సూచించారు. సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారమే ప్రజా సంతృప్తికి కొలమానమని చెప్పారు. గ్రామసభల్లో ఇప్పటి వరకు 34,060 పశు వైద్య శిబిరాలు నిర్వహించి 6,24,000 పశువులకు చికిత్సలు అందించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వైద్య శిబిరాల వల్ల రైతులకు, పశు పోషకులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేసి ప్రజల ఆదరాభిమానాలు పొందాలని మార్గదర్శకం చేశారు. వైద్య శిబిరాల నిర్వహణతో సరిపెట్టుకోకుండా గ్రామాల్లో ఏ వ్యాధి తీవ్రత అధికంగా ఉందో పరిశీలించడంతో పాటు దానికి కారణాలు అన్వేషించాలని సూచించారు. వ్యాధుల సమూల నిర్మూలనకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమర్థత, తెలివితేటలు, బాధ్యతాయుతంగా పనిచేయడంతో పాటు వినూత్న ఆలోచనలతో ఊహించని ఫలితాలు వస్తాయని ఏది అసాధ్యం కానిది ఉండదని దీనికి ప్రత్యక్ష ఉదాహరణ నరేగా కన్వెర్జెన్సీనే అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నరేగాలో కన్వర్జెన్సీ తీసుకువచ్చామని తద్వారా 22 శాఖల్లో అద్భుత ఫలితాలు సాధించగలిగామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో స్థిరాస్తులు సృష్టించగలిగామని అన్నారు. వినూత్నంగా ఆలోచిస్తే అసాధ్యాలను సైతం సుసాధ్యం చేయవచ్చని తెలిపారు.



విద్యుత్, మౌలిక వసతుల కల్పనలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలవాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 100 శాతం గృహాల విద్యుద్దీకరణ పూర్తయిన మూడో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. 8,500 మెగా వాట్ల విద్యుత్‌ను అదనంగా ఉత్పత్తి చేశామని, దీనిలో 5000 మెగా వాట్ల సౌర, పవన విద్యుత్ ఉందని చెప్పారు. ప్రపంచంలోని అతిపెద్ద సోలార్ పార్క్‌ను కర్నూలులో నెలకొల్పిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. రైతులపై విద్యుత్ ఛార్జీల భారం పడకుండా సోలార్ ఎనర్జీ పంపు సెట్లను ఇస్తున్నామన్నారు. లక్ష పంపు సెట్లను పంపిణీ చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, పది వేల పంపుసెట్లు విద్యుత్, 25 వేల సోలార్ పంప్‌సెట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ట్రాన్స్‌మిషన్ లాసెస్‌ను 9.7 శాతం తగ్గించామని దీనిని ఆరు శాతానికి తీసుకురావాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతితో రాయలసీమ జిల్లాలకు రోడ్డు కనెక్టివిటీ పెంచుతున్నామని, అవుటర్ రింగ్‌రోడ్డు నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఓర్వకల్లు, దగదర్తి విమానాశ్రయాలు 2019 నాటికి పూర్తయి అందుబాటులోకి వస్తాయన్నారు. భోగాపురం విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే లక్ష ఫైబర్ గ్రిడ్ కనెక్షన్లు ఇచ్చామని మరో కోటి కనెక్షన్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

4వ రోజు జన్మభూమిపై ప్రజాభిప్రాయం

నాలుగో రోజు జన్మభూమి-మా ఊరు కార్యక్రమంపై ప్రభుత్వం సేకరించిన ప్రజాభిప్రాయాన్ని ముఖ్యమంత్రి ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరించారు. జన్మభూమిలో అధికారులు పాల్గొన్నారా అన్న ప్రశ్నకు 95 శాతం మంది హాజరయ్యారని, 5 శాతం మంది లేదని జవాబిచ్చినట్లు తెలిపారు. సమస్యలపై అధికారులు స్పందిస్తున్న తీరుపై 73 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా 27 శాతం మంది బాగాలేదని చెప్పారన్నారు. గ్రామసభల్లో చర్చిస్తున్న అంశం 87 శాతం అర్థమైందని, 13 శాతం అర్థం కాలేదని తెలిపారన్నారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ప్రయోజనకరంగా ఉందన్న ప్రశ్నకు 86 శాతం మంది అవునని, 14 శాతం మంది లేదని జవాబిచ్చారని ముఖ్యమంత్రి వివరించారు. ఫించన్ల పంపిణీపై 69 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా 31 శాతం మంది అసంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. రేషన్ కార్డుల మంజూరుపై 67 శాతం మంది ఇచ్చారని, 33 శాతం మంది లేదని చెప్పినట్లు వెల్లడించారు. చంద్రన్న బీమాపై 71 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా, 29 శాతం బాగాలేదని జవాబిచ్చినట్లు వివరించారు. వైద్య శిబిరాల నిర్వహణపై 56 శాతం మంది సంతృప్తి, 44 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. పశు వైద్య శిబిరాలపై 48 శాతం మంది బాగాలేదని చెప్పారని, తెలిపారు. జన్మభూమి కమిటీల భాగస్వామ్యంపై వేసిన ప్రశ్నకు 61 శాతం మంది బాగుందని, 17 శాతం మంది బాగాలేదని, 22 శాతం జరగలేదని చెప్పారన్నారు. అర్జీల పరిష్కారంపై కేవలం 50 శాతం మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారని సీఎం తెలిపారు. సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు మరింత చొరవ చూపి ప్రజా సంతృప్తి స్థాయిని పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు.

4వ రోజు టాప్‌టెన్ మండలాలు, గ్రామాలు ఇవే...

ఆచంట, ముమ్మిడివరం, పెద్దాపురం, రాజోలు, వెలిగోడు, చాగల్లు, తణుకు, అనపర్తి, రాయవరం, కొండాపురం, బి.కొత్తకోట, ములకల చెరువు, లక్ష్మీ నరసంపేట, బ్రహ్మంగారి మఠం మండలాలు 4వ రోజు ముందున్నాయని అన్నారు. వాటి స్థాయికి మిగిలిన మండలాలు కూడా చేరాలని పరస్పరం పోటీపడాలని అన్నారు. నిడదవోలు, గరిసపూడి, కశింకోట, కలిగిరి, బొమ్మన కొండూరు, రాచర్ల, సంతమాగులూరు, తంగెడమల్లి, గ్రామాలు 4వ రోజు జన్మభూమిలో ముందున్నాయని తెలిపారు. మిగిలిన గ్రామాలు కూడా ఒకదానితో మరొకటి పోటీపడాలని అన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ప్రణాళికా శాఖ, విద్యుత్, ఐటి, రియల్ టైం గవర్నెన్స్ శాఖల అధికారులు సంజయ్ గుప్తా, అజయ్‌జైన్, విజయానంద్, అహ్మద్ బాబు తదితరులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్దిష్ట లక్ష్యాలను చేరడమే జన్మభూమి-మాఊరు లక్ష్యం

- ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్



అమరావతి, ఆంధ్రప్రభ: జన్మభూమి కార్యక్రమంలో అర్జీలు స్వీకరించడమే కాకుండా నిర్ధిష్ట లక్ష్యాలను చేరుకోవడానికి సమాలోచనలు, చర్చలు జరగాలన్నదే ప్రభుత్వ విధానమని ఏపీ ప్రభుత్వ కమ్యూనికేషన్ సలహాదారు, పరకాల ప్రభాకర్ తెలిపారు. శనివారం స్థానిక ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో గల మీడియా పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు డాక్టర్పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ ఈ నెల 2, 3, 4, 5 తేదీలలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో 5, 24, 370 మంది నుంచి వినతులు వచ్చాయని, ఈ నాలుగు రోజులలో 27,14,685 మంది పాల్గొన్నారని తెలిపారు. జన్మభూమి- మా ఊరు కార్యక్రమాలలో 89,897 మందికి రేషన్ కార్డులు ఈ నాలుగు రోజులలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. కొత్తగా అర్హులైన వారికి 50,585 కొత్త పెన్షన్లు మంజూరు చేశామన్నారు. ఈ నాలుగు రోజుల పాటు 8,704 హెల్త్ క్యాంపులు నిర్వహించగా, ఇందులో 5,25,969 మంది రోగులను పరీక్షించామన్నారు. కంటి సమస్యలపై పరీక్షించి 19,751 మందికి కళ్ళజోళ్ల పంపిణీ చేశామన్నారు. యాక్టివిటీస్ బిలో కళా ప్రదర్శనలు, వక్తృత్వం, ఆటల పోటీలు, వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న వారికి పురస్కారాలు అందించామన్నారు. ఈ పోటీలలో 83,463 మంది పాల్గొన్నారన్నారు. నిన్న ఒక్కరోజే వినతులు 1,41,755 మంది నుంచి వచ్చాయన్నారు. అత్యధికంగా చిత్తూరు జిల్లా నుంచి 17,955, అత్యల్పం శ్రీకాకుళం జిల్లా నుంచి 3,595 వచ్చాయని, 8,27,902 మంది ప్రజలు పాల్గొన్నారన్నారు. రేషన్ కార్డులు 22,541 కార్డులు పంపిణీ చేశారని, అత్యధికంగా కర్నూలు నుంచి 3,008 మంది, శ్రీకాకుళంనుంచి అత్యల్పంగా 668 మంది పాల్గొన్నారన్నారు. రేషన్ కార్డులు 13,984 మందికి మంజూరు చేయగా అత్యధికంగా పశ్చిమ గోదావరిలో 3,792, అత్యల్పంగా విజయగరంలో 64 ఇచ్చారన్నారు. పనిముట్లు అత్యధికంగా 5,008 మందికి విజయనగరంలో ఇవ్వగా, తక్కువగా పశ్చిమ గోదావరిలో 5 ఇవ్వడం జరిగిందన్నారు. హెల్త్ క్యాంపులు తూర్పుగోదావరిలో అత్యధికంగా 209కాగా అత్యల్పంగా విశాఖలో 131 నిర్వహిచారన్నారు. హెల్త్ క్యాంపులలో నమోదు చేసుకున్న రోగుల సంఖ్య 1,37,399కాగా కళ్ళజోడ్ల పంపిణీ 5,173 మందికి పంపిణీ చేయడం జరిగిందన్నారు. యాక్టివిటీ-బిలో 22,228 పురస్కారాలు అందజేయగా అత్యధికంగా గుంటూరు జిల్లా నుంచి 4,865 అత్యల్పంగా విశాఖపట్నం జిల్లా నుంచి 512 అందించడం జరిగిందన్నారు. 6వ తేదీ శనివారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం కింద సాయంత్రం 5 గంటల వరకు వచ్చిన సమాచారం ప్రకారం ఇప్పటి వరకు 50,217 వినతులు రాగా, 2,47,697 మంది ప్రజలు పాల్గొన్నారన్నారు. రేషన్ కార్డులు 9,225 మందికి పంపిణీ చేశామని, పెన్షన్లు 5,207 మందికి కొత్తగా మంజూరు చేశామన్నారు. పనిముట్లు 825, హెల్త్ క్యాంపులు 700 నిర్వహించగా, అందులో రోగులు 49,600 మంది నమోదు చేసుకున్నారన్నారు.

4వ విడత జన్మభూమి, 5వ విడత జన్మభూమికి ఉన్న పోలికలివే...

4వ విడత జన్మభూమిలో మొదటి 1,07,000 మంది పాల్గొనగా, 5వ విడత జన్మభూమిలో మొదటి రోజు 67,795 మంది పాల్గొన్నారు. 4వ విడత జన్మభూమి 2వ రోజు 2,00,000 మంది నమోదు కాగా, 5వ విడత జన్మభూమి 2వ రోజు 1,65,000 మంది, 4వ విడత జన్మభూమి 3వ రోజు 1,92,000, 5వ విడత జన్మభూమి 3వ రోజు 1,45,000, 4వ విడత జన్మభూమి 4వ రోజు2,27,000 మంది, 5వ విడత జన్మభూమి 4వ రోజు 1,41,000 మంది పాల్గొన్నారన్నారు. రేషన్‌కార్డుల పంపిణీలో 4వ విడత జన్మభూమి మొదటి రోజు 50,603, 5వ విడత జన్మభూమి మొదటి రోజు 14 వేలు, 4వ విడత జన్మభూమి రెండవ రోజు 24 వేలు, 5వ విడత జన్మభూమి రెండవ రోజు 28 వేలు, 4వ విడత జన్మభూమి 3వ రోజు 63 వేలు, 5వ విడత జన్మభూమి 3వ రోజు 21 వేలు, 4వ విడత జన్మభూమి 4వ రోజు 73 వేలు, 5వ విడత జన్మభూమి 4వ రోజు 22 వేలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఫించన్లు 4వ విడత జన్మభూమి మొదటి రోజు 2,22,000, 5వ విడత జన్మభూమి మొదటి రోజు ఎనిమిది లక్షలు, 4వ విడత జన్మభూమి 2వ రోజు 1,90,000, 5వ విడత జన్మభూమి 2వ రోజు 16,000 మంది, 4వ విడత జన్మభూమి 3వ రోజు 1,90,000, 5వ విడత జన్మభూమి 3వ రోజు 11,000 మంది 4వ విడత జన్మభూమి 4వ రోజు 3,50,000 మంది, 5వ విడత జన్మభూమి 4వ రోజు 13,000 మంది నుంచి వినతులు వచ్చినట్లు చెప్పారు.

నేరాలు తేలకుండానే
నేతలు జైళ్ళకా!

(మొదటిపేజీ తరువాయి)

నిర్ధారణతో కూడా సంబంధం లేకుండానే వీరిపై కేసులు నమోదౌతున్నాయి. వెనువెంటనే పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టుకు అప్పగిస్తున్నారు. ఆ తర్వాత వార్ని జైళ్ళకు తరలిస్తున్నారు. అయితే ఇలాంటి కేసుల్లో నేరారోపణలు రుజువవుతున్నది అతిస్వల్పం. రుజువైన నేరాల్లో కూడా పైకోర్టులు అందుకు వ్యతిరేకంగా స్పందిస్తున్నాయి. సీబీఐ కోర్టు లేదా కిందిస్థాయి కోర్టులిచ్చిన తీర్పుల్ని హైకోర్టు, సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేస్తున్నాయి. ఈ లోగానే సదరు రాజకీయవేత్తకు జరగాల్సిన నష్టం జరుగుతోంది. కేవలం రాజకీయ ప్రయోజనాలకు గండిపడ్డమే కాకుండా వ్యక్తిగతంగా కూడా తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. నేరుగా వీరిని సాధారణ జైలు గదుల్లోకి నెట్టడం వల్ల ఏళ్ళతరబడి నేరం రుజువుకాకుండానే శిక్ష అనుభవిస్తున్నారు. ఏడు పదుల వయసు దాటిన లాలూ తన వృద్ధాప్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, జైలు గదిలో తీవ్రచలిగా ఉందంటూ న్యాయమూర్తికి తెలియజేసిన సందర్భంలో న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు కూడా పలు విమర్శలకు తావిస్తున్నాయి.

స్వతంత్రమొచ్చాక తొలినాటి పాలకులు నెహ్రూ, నందా, శాస్త్రిల కాలంలో ఎలాంటి ఆరోపణలకు గురికాలేదు. కానీ ఇందిర హయాం నుంచి పాలకులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడం మొదలైంది. స్వప్రయోజనాల కోసం ఖజానాను తాకట్టు పెట్టారన్న విమర్శలు జోరందుకున్నాయి. అప్పటి నుంచి సాక్షాత్తు ప్రధాని స్థాయిలోని వ్యక్తి నుంచి ముఖ్యమంత్రులు, ఎంపీల నుంచి ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రుల నుంచి రాష్ట్ర మంత్రులతో పాటు పలువురు రాజకీయ వేత్తలు, మాజీ పాలకులు కూడా జైలు ఊచలు లెక్కెట్టేసారు. వీరిలో అతికొద్దిమందిపైనే నేరారోపణలను కోర్టులు విశ్వసించాయి. వారికి మాత్రమే న్యాయస్థానాలు జైలు శిక్ష విధించాయి. ఈలోగా వీరు కోల్పోయిన సమయాన్ని గాని, పడ్డ ఇబ్బందులుగాని ఎవరూ జవాబుదారి కావడంలేదు. దేశవ్యాప్తంగా ప్రస్తుత, మాజీ పాలకులు, ప్రజాప్రతినిధులపై కేసులు నమోదయ్యాయి. సాక్షాత్తు ఇందిరా గాంధీని కూడా బోనెక్కించారు. మరో ప్రధాని చరణ్‌సింగ్‌కు కూడా జైలు జీవితం తప్పలేదు. తమిళ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే జయలలితను ఆరోపణల పేరిట జైల్లో నెట్టారు. దీంతో ఆమె అర్ధంతరంగా పదవి నుంచి దిగిపోవాల్సి వచ్చింది. ఆమె మూడు సార్లు జైలుకెళ్ళాల్సి వచ్చింది. ఆమెపై నమోదైన అవినీతి ఆరోపణలను బెంగళూరు హైకోర్టు ధ్రువీకరించి ఆమెకు జైలు శిక్ష విధించింది. అయితే మూడుమాసాల్లోనే ఈ తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది.

ప్రస్తుత బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్‌షా కూడా నకిలీ ఎన్‌కౌంటర్, హత్య, మోసం, అవినీతి ఆరోపణల్ని ఎదుర్కొంటున్నారు. వరుసగా ఐదుసార్లు గుజరాత్ శాసనసభకు ఎన్నికైన షా మీద కిడ్నాపింగ్, దొంగతనం కేసులు కూడా నమోదయ్యాయి. ఇప్పటికీ అవి రుజువుకాలేదు. కానీ ఇప్పటికీ ఆయన బెయిల్‌పైనే కొనసాగుతున్నారు. లాలూప్రసాద్ ఇప్పటికే పలుమార్లు జైలుకెళ్ళారు. దాణా కుంభకోణంతో పాటు పలు ఆరోపణలపై ఆయన అరెస్టయ్యారు. ఇన్నాళ్ళకు ఒక ఆరోపణ రుజువైంది. అయితే ఇదే ఆరోపణల్లో బీహార్ మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ మిశ్రాను కూడా న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది. తాజా తీర్పులో మిశ్రాకు మినహాయింపు లభించింది. ఎఐఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసి కూడా కేసులు ఎదుర్కొన్నారు. ఆయన్ను జైల్లోపెట్టారు. అయితే వెంటనే బెయిల్ లభించింది. రాజస్థాన్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ మహిపాల్ మధేర్నపై హత్య, కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. మూడేళ్ళ పాటు జైలు జీవితం తప్పలేదు. ఆ తర్వాత బెయిల్ వచ్చింది. కరుణానిధి కుమార్తె కనిమొళి దాదాపు రెండేళ్ళు జైల్లో ఉండాల్సి వచ్చింది. 2జీ కుంభకోణంలో నిఘా వర్గాల ఆరోపణల్ని కోర్టుకొట్టేయడంతో ఆమె ఈ కేసు నుంచి బయటపడ్డారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి రాజా పరిస్థితి కూడా. ఇక బీహార్‌కు చెందిన ఎంపీ పప్పుయాదవ్‌పై అక్రమ ఆయుధాలు, మర్డర్ కేసులు నమోదయ్యాయి. మరో మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప కూడా గనుల కుంభకోణంలో జైలు జీవితాన్ని అనుభవించారు. అయితే ఆయనకూ బెయిల్ లభించింది. ఎంపీలను ప్రభావితం చేశారన్న అవినీతి ఆరోపణలపై ఉత్తర్‌ప్రదేశ్ ఎంపీ అమర్‌సింగ్ కూడా ఊచలు లెక్కెట్టక తప్పలేదు. కాంగ్రెస్ రాజ్యసభసభ్యుడు రషీద్ మసూద్ కూడా ఇదే ఆరోపణలపై జైలుకెళ్ళారు. హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓంప్రకాష్ చౌతాల టీచర్ల అక్రమ నియామకాలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కొని జైలు జీవితం గడిపొచ్చారు. సుఖరాం, మధుకోడా వంటి అతికొద్ది మందిపై మాత్రమే ఈ నేరారోపణలు రుజువయ్యాయి. వారికి కోర్టులు శిక్షలు ఖరారు చేశాయి. కానీ 90శాతం మందిపై ఆరోపణలు రుజువుకాలేదు. కిందికోర్టుల్లో రుజువైనా పై కోర్టులో ఆ కేసులు నిలబడలేదు.

ప్రస్తుతం లాలూప్రసాద్ యాదవ్‌కు జైలు శిక్షపడ్డ దాణా కేసు పరిస్థితి చూస్తే 1991నుంచి 1994మధ్యలో ఈ కుంభకోణం చోటు చేసుకుంది. అప్పట్లో దీని కుట్రదారులపై విచారణకు సంబంధించిన ఫైల్‌ను ముఖ్యమంత్రి హోదాలో తనవద్దే దాచిపెట్టారన్న ఆరోపణల్ని లాలూ ఎదుర్కొన్నారు. కుంభకోణం గురించి తెలిసినప్పటికీ దోపిడీని ఆయన అడ్డుకోకపోవడం ద్వారా ఖజానాకు నష్టం కలిగించారని కేసు పెట్టారు. వాస్తవానికి ఈ కేసులో లాలూతో పాటు మరో మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ మిశ్రా, ఇంకో 18మంది నిందితులుగా ఉన్నారు. వీరితో పాటు మరో 14మందిని అంచెలవారీగా కేసులో చేర్చారు. ఈ 34మందిపై వ్యాజ్యాలు జరుగుతుండగా 11 మంది ఈ మధ్యకాలంలో మృతిచెందారు. 2013 అక్టోబర్‌లో దీనిపై తీర్పు వెలువడింది. అప్పట్లో జగన్నాథ మిశ్రాపై కూడా నేరారోపణ ఖరారైంది. తాజా తీర్పులో మిశ్రాను నిర్దోషిగా న్యాయస్థానం ప్రకటించింది. రాజీవ్‌గాంధీపై కూడా బోఫోర్స్ కేసు నమోదైంది. సుమారు 20 ఏళ్ళ పాటు ఈ కేసు గాంధీ కుటుంబాన్ని వెంటాడింది. రాజీవ్‌గాంధీ ఈ కేసు కారణంగానే పదవీచ్యుతుడయ్యారు. అయినప్పటికీ ఈ కేసు దీర్ఘకాలం సాగింది. చివరకు ఇందులో తగిన సాక్షాధారాల్లేవని న్యాయస్థానం తేల్చేసింది. కానీ ఈ కేసు నెహ్రూ, గాంధీ కుటుంబాన్ని తీవ్ర అశాంతికి లోనుచేసింది. అలాగే వీరికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రాభవాన్ని కూడా కోల్పోవాల్సి వచ్చింది. మయన్మార్ వంటి కొన్ని దేశాల్లో హౌస్ అరెస్టుల విధానం అమల్లో ఉంది. నేరారోపణ ఎదుర్కొంటున్న ఉన్నతస్థాయి వ్యక్తుల వార్ధక్యం, శారీరక దృఢత్వాన్ని దృష్టిలో పెట్టుకుని వీరు ఇంటి నుంచి కదలకుండా ప్రభుత్వం కట్టడి చేస్తుంది. తద్వారా వీరెవరూ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనే వీలుండదు. అలాగే ఇతర కార్యకలాపాలకు కూడా దూరమౌతారు. కానీ ఈ విధానం వల్ల వారికి ఆరోగ్య, ఇతర సమస్యలు తలెత్తవు. ఇక్కడ కూడా కనీసం శిక్ష తుది ఖరారయ్యే వరకు ఇలాంటి విధానాన్ని అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీ వర్శిటీ అధ్యాపకుడు ప్రొఫెసర్ సాయిబాబా 95శాతం అంగవైకల్యంతో కుర్చీలకే పరిమితమైనప్పటికీ ఆయనెప్పుడో మావోయిస్టులకు అనుకూలంగా వ్యవహరించాడని, రాజ్యానికి వ్యతిరేకంగా రచనలు చేసి యువతను రెచ్చగొట్టాడన్న ఆరోపణలపై నాగపూర్‌లోని చీకటికొట్టులో బంధించారు. ఈ చలికితాను తట్టుకోలేకపోతున్నా, చలికాలం దాటే వరకు బతుకుతానన్న ఆశలేదంటూ ఆయన తన భార్యకు రాసిన లేఖ దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. 95శాతం వికలాంగుడు, మాట్లాడలేని వ్యక్తి పలురోగాలతో తీవ్రంగా సతమతమౌతున్న విద్యాధికుడి పట్ల రాజ్యం ఇంత నిర్భయగా వ్యవహరించడం అనేక విమర్శలకు తావిచ్చింది. కోర్టుల్లో ఆరోపణలు పూర్తిస్థాయిలో రుజువుకాకముందే వృద్ధ రాజకీయ నాయకుల్ని అతిభయంకర శిక్షలకు గురిచేయడం ఒక విధంగా దేశంలో రాజకీయ కక్షసాధింపుకు దోహదపడుతుందన్న విమర్శలు కూడా లేకపోలేదు.

బడ్జెట్ తీరు మారాలి!

(మొదటిపేజీ తరువాయి)

జరిగేవి. ఇందుకోసం గ్రామస్థాయి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర పెద్దల్తో సమావేశాలు జరిగేవి. అలా జిల్లా, ఆ పై స్థాయి వరకు కొనసాగేవి. అయితే గతకొంతకాలంగా ఈ విధానం గాడితప్పింది. అధికారంలో ఉన్న పార్టీ రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా వివిధ రాష్ట్రాల్లో బడ్జెట్ రూపకల్పన మొదలైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, లేదా తదుపరి ఎన్నికల్లో ఓట్లు రాల్చే పథకాలకే కేటాయింపుల్లో ప్రాధాన్యత అధికమైంది. ఇది ప్రాంతాల వారీగా అసమతుల్యతకు కూడా దారితీసింది. దేశంలో ప్రస్తుతం దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ విభజన వాదాలుజోరందుకోవడానికి బడ్జెట్ కేటాయింపుల ప్రాతిపదికలో లోపాలు కూడా ఓ ప్రధాన కారణం.

ఏ రా ష్ట ప్రభుత్వమైనా క్షేత్రస్థాయి సమస్యలపై ఆరు మాసాల ముందునుంచే అధ్యయన ప్రక్రియ మొదలుపెడితే మెరుగైన ఫలితాలు వస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణస్థాయిలో సమస్యల్ని ఎంచి కలెక్టర్లు, ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారుల్తో సమావేశాలు నిర్వహించి శాఖల వారీగా అవసరాలు, ప్రజల ఆకాంక్షల్ని నివేదికల రూపంలో సిద్ధం చేయడం అత్యవసరం. వీటి క్రోడీకరణ అనంతరం నిధుల అందుబాటును బట్టి కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తారు. ఇదే విధానం కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాలు అమలు చేస్తే నిజమైన ప్రజాప్రయోజనాలు నెరవేరుతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇదే పంథాలో పయనించే కసరత్తులో నిమగ్నమై ఉంది. బ్రిటీష్ ఏలుబడిలో ఉండగానే భారత్‌లో వార్షిక బడ్జెట్ అమలు చేయడం మొదలైంది. 1869ఫిబ్రవరి 18న తొలిసారిగా జేమ్స్‌విల్సన్ భారత బ్రిటీష్‌ఇండో పార్లమెంట్‌కు ఈ బడ్జెట్ సమర్పించారు. అప్పట్నుంచేకేంద్ర ఆర్థికమంత్రి బడ్జెట్ కమిటీకి అధ్యక్షునిగా వ్యవహరించడం మొదలైంది. ఇదే రాష్ట్రాలకు వర్తించింది. ఒక్కో దేశంలో ఒక్కో విధంగా ఈ బడ్జెట్ ప్రతిపాదనలు అమలౌతున్నాయి.

యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇందుకోసం ప్రత్యేకంగా ట్రజరీ టీమ్ ఏర్పాటు చేస్తారు. దీనికి రాజకీయాల్తో సంబంధంఉండదు. పూర్తిగా అధికారులే ఇందులో ఉంటారు. దీనికి ఛాన్సలర్ స్థాయి అధికారి అధిపతిగా వ్యవహరిస్తారు. ఈ బృందమే ప్రజల అవసరాలు, ఆకాంక్షల్ని అధ్యయనం చేస్తుంది. వాటిని ప్రధాని కార్యాలయంతో చర్చిస్తుంది. అందుబాటులో ఉన్న నిధుల్ని బట్టి కేటాయింపులు జరుపుతుంది. ఈ బృందమే బ్రిటీష్ పార్లమెంట్‌కు బడ్జెట్‌ను సమర్పిస్తుంది. అమెరికాలో ఫెడరల్ బడ్జెట్ రూపకల్పనకు ప్రతి ఏటా అధికారుల్తో కూడిన బృందాన్ని ఏర్పాటు చేస్తుంటారు. ఫిలిప్పిన్స్‌లో అయితే వివిధ రంగాలకుచెందిన నిపుణుల్తో కూడిన బృందాన్ని నియమిస్తారు. వీరే బడ్జెట్ అకౌంట్‌బులిటీ, బడ్జెట్ ఎగ్జిక్యూషన్‌లనునిర్వహిస్తారు. ఫిలిప్పిన్స్‌లో జీరో బేస్డ్ బడ్జెట్‌ను అమలు చేస్తున్నారు. విధానం ఏదైనా అన్ని దేశాలు ప్రజావసరాలకనుగుణంగానే బడ్జెట్ రూపకల్పన చేస్తున్నాయి. గతంలో కొందరు ప్రధానులు, ముఖ్యమంత్రులు ప్రవేశపెట్టిన పార్టీల ప్రయోజనాల వారీ బడ్జెట్‌కు ఇప్పటికైనా తిలోదకాలివ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదర్శంగా భావించాలని ఉద్బోధిస్తున్నారు.

ముగిసిన విజ్ఞాన్ మహోత్సవ్

• విద్యార్థులతో కిక్కిరిసిన విజ్ఞాన్ యూనివర్శిటీ • కరణం మల్లేశ్వరి రాకతో నెలకొన్న సందడి



చేబ్రోలు, ప్రభ న్యూస్: గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూని వర్శిటీలో చివరి రోజైన శనివారం విజ్ఞాన్ మహోత్సవ్-2018 వేడుకలు అత్యంత వైభవోపేతంగా ముగిశాయి. యూనివర్శిటీ ప్రాంగణంలో జరుగుతున్న వివిధ పోటీలలో విద్యార్థులు హోరాహోరీగా తలపడ్డారు. ఆద్యాంతం ఉత్కంఠ నడుమ ఈపోటీలు జరిగాయి. విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీలను వీక్షించి ఎంజాయ్ చేశారు. వివిధ రాష్ట్రా ల నుంచి తరలివచ్చిన విద్యార్థులతో యూనివర్శిటీ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. రాజీవ్ ఖేల్ రత్న, పద్మశ్రీ అవార్డుల గ్రహీత కరణం మల్లేశ్వరి యూనివర్శిటీకి రావడంతో ఈప్రాంగణం అంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. మల్లేశ్వరి ఆసభలో ఇచ్చిన ప్రసంగం విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని రగిలించింది. అనుకున్నది సాధించాలంటే ఏకాగ్రత, పట్టుదల, కృషి వుండటమే బలహీనతలను పక్కన పెట్టడమేకాక విద్యార్థులు ముఖ్యంగా పోస్ట్‌పోనింగ్ విధానానికి స్వస్తి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం యూనివర్శిటీ వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఛాన్సలర్ రామ్మూర్తి నాయుడు, అధ్యాపక సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు.

హల్‌చల్ చేస్తున్న జనసేనాని ట్వీట్

• బాగా అనిపించే షేర్ చేసుకున్నా... • వ్యక్తిగతంగా ఓడించడం చేతగాని వాళ్లే ఇలా చేస్తారు • అభిమానుల్లో జోష్ • జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తాజా ట్వీట్



అమరావతి, ఆంధ్రప్రభ: సంచలనాలకు కీలకమైన జనసేనాని పవన్‌కల్యాణ్ తాజాగా చేసిన ట్వీట్లు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారాయి. ఆరోపణలు, ప్రత్యా రోపణలకు నిలయమైన సోషల్ మీడియా ద్వారానే జనసేనాని తాజా అంశాలపై స్పందించిన తీరు హల్‌చల్ చేస్తోంది. ''వ్యక్తిత్వంలో నన్ను ఓడించడం చేతగాని వాళ్లే .. కులం,ధనం,వర్ణం గురించి మాట్లాడతారు'' అంటూ శనివారం పవన్ ట్వీట్ చేయడం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చర్చకు దారితీసింది. ఓ సీనియర్ జర్నలిస్ట్ తనకు దీన్ని ట్వీట్ చేశారని, బాగుండడంతో దీన్ని షేర్ చేసుకోవాలనిపించిందని పవన్ పేర్కొన్నారు. కులాల పరంగా విడిపోవడం, అధికారమే పరమావధిగా సాగే రాజకీయాలు ప్రస్తుత తరుణంలో పోషిస్తున్న పాత్ర ప్రమాద ఘంటికలను మోగిస్తోందన్నారు. ఇది మన ఆర్థిక మందగమనానికి కారణం అవడమే కాక, మన సమాజానికి అత్యంతకీడును కలుగజేస్తుందని చెప్పారు. గత కొంతకాలంగా సోషల్‌మీడియాలో పవన్ కల్యాణ్ అభిమానులకు,ప్రముఖ సినీ విమర్శకుడి మధ్య విమర్శల వెల్లువ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పవన్ ఈ విధంగా ట్వీట్ చేశారంటున్నారు. పరోక్షంగా సినీ విమర్శకుడిని ఉద్దేశించే ఈ ట్వీట్ చేశారంటున్నారు. ఇదిలా ఉంటే ఆ సినీ విమర్శకుడు కూడా ఈ సందర్భంగా తీవ్రంగానే స్పందించారంటున్నారు.

అజ్ఞాతవాసి బెనిఫిట్ షోలకు ప్రభుత్వం అనుమతి

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటించిన అజ్ఞాతవాసి సినిమా ప్రత్యేక ప్రదర్శనలకు రాష్ట్రప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.ఈ నెల 10 నుంచి 17 వరకు రాత్రి 1 గంట నుంచి ఉదయం 10 గంటల వరకు ఈ బెనిఫిట్ షోలను అనుమతిస్తునట్లు శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

'అజ్ఞాతవాసి' విడుదలకు రండి : తలసానికి చిత్ర బృందం ఆహ్వానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈనెల 10న విడుదల కానున్న 'అజ్ఞాతవాసి' సినిమా కార్యక్రమానికి హాజరు కావలసిందిగా ఆ చిత్రదర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత రాధాకృష్ణలు తెలంగాణ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌ను కోరారు. ఇందుకు సంబంధించి శనివారం సచివాలయంలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ చలన చిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రామ్మోహన్‌రావు కూడా ఉన్నారు.

రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా చేస్తా

• చదువుతోనే పేదరికంపై విజయం • ఉన్నత విద్యతోనే సమాజంలో గుర్తింపు • రూ. 50 కోట్లతో విక్రమ సింహపురి యూనివర్శిటీ అభివృద్ధి • విశ్వవిద్యాలయం ప్రారంభోత్సవ సభలో సీఎం చంద్రబాబునాయుడు



నెల్లూరు (దర్గామిట్ట), ప్రభ న్యూస్: రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తయారుచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం ఆయన సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని వెంకటాచలం మండలం కాకుటూరులో నూతనంగా నిర్మించిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాన్ని జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ చదువుతోనే పేదరికంపై విజయం సాధించవచ్చన్నారు. ఉన్నత విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ప్రతి విద్యార్థి ఓ శాస్త్రవేత్తలా ఎదిగేందుకు ఇప్పటినుంచే కృషి చేయాలని ఆయన విశ్వవిద్యాలయ విద్యార్థులకు సూచించారు. ఎంత సంపద ఉన్నది అన్నది ముఖ్యం కాదని, ఎంత నాలెడ్జ్ ఉన్నది అనేదే ముఖ్యమన్నారు. నెల్లూరు జిల్లా బ్రిటీష్ కాలం నుండే అభివృద్ధి చెందిందని అన్ని సౌకర్యాలతో పెన్నా, సంగం బ్యారేజీల ద్వారా నీళ్లు వచ్చాయని తద్వారా ప్రజలు అభివృద్ధి చెందారన్నారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో అత్యధిక ఆదాయం కలిగిన వారు మన తెలుగు వారేనన్నారు. చదువు ద్వారానే అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఒక జనరేషన్ బాగా చదువుకుంటే ఆ తరువాత జనరేషన్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఎక్కడ చదువుంటుందో అక్కడ సంపద ఉంటుందన్నారు. మన విద్యా విధానాల్లో మార్పులు రావాలన్నారు. తాను విదేశాల్లోని యూనివర్శిటీలను (స్టాండ్ ఫోర్డ్ హౌస్ వార్డ్) సందర్శించినప్పుడు అక్కడ చాలా బాగా ఉందని తెలిపారు. అక్కడి విద్యార్థులు నాలుగు నెలలు క్లాస్ రూములో ఉంటే మిగతా నెలలు ఫీల్డ్‌లో ఉంటారన్నారు. ఆంధ్రప్రదేశ్ ఒక నాలెడ్జ్ హబ్‌గా తయారు కావాలన్నారు. పాత కోర్సులకు కొత్త ఓరియంటేషన్ జతపరచాలన్నారు. ఏపీలో వినూత్నమైన పద్ధతుల ద్వారా అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నామన్నారు. రాష్ట్రంలో ఆర్‌టీజీ పరిష్కార వేదిక వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. డ్రోన్స్ సర్వేలెన్స్ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మన ఇంట్లోనే కూర్చొని ఆధునిక టెక్నాలజీ ద్వారా అర్జీల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మెడికల్, ఇంజనీరింగ్ ఏ కోర్సులో విద్యను అభ్యసించే వారైనా ఐటీ రంగంలో ప్రవేశం ఉండాలన్నారు. అమేజాన్, గూగుల్ వంటి యాప్‌ల ద్వారా ప్రపంచం ముందుకుపోతోందన్నారు. త్వరలో రాష్ట్రానికి సోలార్, విండ్ ఎనర్జీలు వస్తాయని తద్వారా కరెంటు రేట్లు తగ్గుతాయన్నారు. ప్రతి విద్యార్థి వినూత్నంగా ఆలోచించి కొత్త విషయాలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిశోధనల ద్వారా మేధాశక్తిని పెంచుకోవాలన్నారు. విద్యార్థులు తమ మేధాశక్తిని ఉపయోగించి పేదవారికి సహాయ పడాలన్నారు. విద్యార్థులు చదువును ఇష్టపడి చదవాలన్నారు. ఇష్టపడి ఏ పనిచేసినా ఆనందంగా ఉంటుందన్నారు. తాను కూడా కష్టపడుతూ ఇష్టపడి పనిచేస్తాను కాబట్టే నేను చాలా ఆనందంగా ఉన్నానని, తనకు విసుగు రాదని తెలిపారు. ఎడ్యుకేషన్‌లో ఆలిండియా లెవల్‌లో మనం 2వ స్థానంలో ఉన్నామన్నారు. వరల్డ్‌లో నెంబర్-1గా ఉండాలన్నదే తన కోరిక అని ఇది ఖచ్చితంగా సాధ్యపడుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. చదువుకునే పిల్లలకు ప్రతి ఒక్కరికీ జ్ఞానభూమి క్రింద స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామని ఎవరూ కూడా ఇబ్బందిపడి చదువుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి 7వ తరగతి నుండే డిఫరెంట్‌గా ఆలోచించాలని, ప్రతి అంశాన్ని ప్రశ్నించే విధంగా ఉండాలన్నారు. అలా చేస్తే ఎలాంటి వాటినైనా సాధించవచ్చునన్నారు. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వైఫై పర్చువల్ క్లాస్ రూమ్స్ ఉండాలని దానికి సంబంధించి మంచి లెక్చరర్లను పెడతామని తెలిపారు. ప్రతి విద్యార్థి దగ్గర ఐప్యాడ్ ఉండాలని ప్రభుత్వం ప్రత్యేకించి అతితక్కువ ధరకే ఇంటర్నెట్ కనెక్షన్స్ ఇస్తోందని విద్యార్థులందరూ దానిని ఉపయోగించుకుని నాలెడ్జ్ పెంచుకోవాలన్నారు. విద్యార్థికి ఐప్యాడే ఒక పుస్తకమన్నారు. రాబోవు రోజుల్లో లాజిస్టిక్, సికార్గో, ఆటోమొబైల్ రంగం లాంటి కంపెనీలను మనం హ్యాండిల్ చేయబోతున్నామన్నారు. మీ పెద్దలు మీకోసం ఎంత కష్టపడుతున్నారో వారికోసం మీరు అంతే కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అంతకుముందు రేణిగుంట నుంచి హెలికాప్టర్‌లో కాకుటూరుకు చేరుకున్న సీఎంకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరునారాయణతో పాటు సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు, మాజీమంత్రి పరసారత్నం, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, యూనివర్శిటీ రిజిస్ట్రార్లు చంద్రయ్య, శివశంకర్, డాక్టర్ జ్యోత్స్నలత, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు, వెంకటేశ్వర డిగ్రీ కళాశాల అధి నేత సునీల్‌కుమార్, కుసుమ, రాధిక పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు ప్రత్యేక సబ్ ప్లాన్

• బాబు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? • నిజమైన ప్రేమ అంటే ఏమిటో చూపిస్తా • పాదయాత్రలో వైఎస్ జగన్



తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రత్యేకంగా సబ్ ప్లాన్‌ను అమలులోకి తీసుకువస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా శనివారం జగన్ పుంగనూరు నియోజకవర్గం పులిచర్ల మండల పరిధిలోని గొడ్లవారిపల్లె, శ్రీనివాసపురం, ముత్తుకువారిపల్లె, చల్లావారిపలలె, కల్లూరు మీదుగా సాయంత్రం వరకు 13 కిలోమీటర్ల దూరం కాలినడకన ముందుకు సాగారు. పాదయాత్రలో భాగంగా కల్లూరులో వైఎస్సార్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా అధ్యక్షతన జరిగిన ముస్లిం మైనారిటీల సమావేశంలో జగన్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని కులాల, మతాల సంక్షేమానికి పాటుపడి నాయకుడు అనే మాటకు తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతిరూపంగా నిలిస్తే వారందరినీ మోసాలను చేయడం ద్వారా నాయకుడు ఎలా ఉండకూడదో నిరూపిస్తున్నారన్నారు. ముస్లిం మైనారిటీల విషయంలో చంద్రబాబు ఎన్నికల హామీల్లోని ముస్లింలకు వడ్డీలేని ఇస్లామిక్ బ్యాంక్, కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య ఏమైందని ప్రశ్నించారు. కులాలు, మతాలపై ప్రేమ కానుకలు పంపిణీ చేయడం కాదని జగన్ అంటూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిజమైన ప్రేమ అంటే ఏమిటో చూపించే విధంగా పథకాలను అమలులోకి తెస్తామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రభుత్వ ఖర్చుతో ఎంత చదువుతానంటే చదివించే విధంగా, వైద్య ఖర్చులు రూ. వెయ్యిదాటినప్పటి నుంచి ఏ రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్స చేయించుకున్నా ఆరోగ్యశ్రీ వర్తించేలా చేస్తామన్నారు. 45 ఏళ్లు దాటినవారందరికీ పింఛన్లు రూ. 2 వేలు ఇవ్వడంతో పాటు అనంతపురంలో హామీ ఇచ్చిన విధంగా ఇమాంలకు రూ. 10 వేలు మౌజంలకు రూ. 5 వేలు చొప్పున పింఛన్లు ఇస్తామన్నారు. అన్నిటిని మించి ముస్లిం మైనారిటీల సమగ్ర సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముస్లిం మైనారిటీల సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తామని జగన్ ప్రకటించారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న దాదాపు 20 మంది ముస్లిం మైనారిటీలు తమ మనోభావాలను పంచుకుంటూ స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పొందిన లబ్ధి గురించి వివరించారు. అందుకు జగన్ ప్రతిస్పందిస్తూ తన తండ్రి అందరి సంక్షేమం విషయంలో ఒక అడుగు ముందుకు వేస్తే తాను తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండడుగులు ముందుంటానన్నారు. సమావేశం చివరగా ఖాదర్‌బాషా సామూహికంగా మత ప్రార్థనలు చేయడం ద్వారా జగన్ ముఖ్యమంత్రి కావాలని అల్లాని ప్రార్థించారు. శనివారం మండలంలో నిర్వహించిన పాదయాత్రలో భాగంగా జగన్ చల్లావారిపల్లెలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. శ్రీనివాసపురంలో పాలుపిండుతున్న పాడి రైతు శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో బేటీ అయిన జగన్ పాలధరలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో 54వ రోజైన శనివారం కార్యక్రమాలలో పుంగనూరు శాసనసభ్యుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కడప జిల్లా శాసనసభ్యుడు అంజాద్ బాషా, వైకాపా సీనియర్ నేత రహమాన్ తదితరులు పాల్గొన్నారు. ఇక 7వ తేది ఉదయం జగన్ పాదయాత్ర చంద్రగిరి, పూతలపట్టు నియోజకవర్గాల గుండా కొనసాగనున్నది.

నెలరోజుల్లో ఇన్నోవేషన్ సొసైటీ

• 11లోగా ఆర్థికేతర సమస్యలు పరిష్కారం కావాలి • అర్జీలన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి • జన్మభూమి 5వ రోజు కార్యక్రమంపై సమీక్షలో సీఎం చంద్రబాబు




అమరావతి, ఆంధ్రప్రభ: నెల రోజుల్లోగా ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీని ప్రారంభించాలని దీనికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 5వ విడత జన్మభూమి- మా ఊరు 5వ రోజు కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయని భరోసా ప్రజల్లో వచ్చిందన్నారు 4వ విడత జన్మభూమి కంటే ప్రస్తుతం నిర్వహిస్తున్న జన్మభూమిలో ఎక్కువ శాతం ప్రజలు పాల్గొనడమే దీనికి నిదర్శనమన్నారు. డిజిటల్ లీటరసీని పెద్ద ఎత్తున ప్రోత్సాహించాలని, అంతే కాకుండా అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. వీలైనన్నీ సమస్యలు జన్మభూమి గ్రామ సభలతోనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశు వైద్య శిబిరాల పట్ల రైతులు, పశు పోషకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అదే విధంగా అన్ని కార్యక్రమాలు ప్రజామోదం పొందేలా చూడాలని స్పష్టం చేశారు. నిజమైన అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమం అందాలని ప్రజలకు పథకాల వర్తింపునకు సంబంధించిన అవగాహన, చైతన్యం తీసుకురావాలని సూచించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గడిచిన 5 రోజులు వచ్చిన వినతులను, ప్రజా స్పందనను పరిశీలించారు. ప్రతి వినతి ఖచ్చితంగా ఆన్ లైన్ నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. 24 గంటల్లోగా ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో తాజా సమాచారం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. జన్మభూమి కార్యక్రమంలో చిన్నపిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని, వారి ప్రసంగాలు ముచ్చటగా ఉన్నాయన్నారు. ఈ నెల 11న జన్మభూమి కార్యక్రమం ముగుస్తుందని ఈ లోగా ఆర్థికేతర సమస్యలన్నింటీని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు వచ్చిన గణాంకాలను పరిశీలిస్తే గతేడాది కంటే ఈ ఏడాది 30 శాతం ప్రజల భాగస్వామ్యం అధికంగా ఉందని తెలిపారు. సమస్యలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు డ్వాక్రా మహిళల సహకారం తీసుకోవాలని సూచించారు. పింఛన్లు, రేషన్ కార్డుల జారీ సంబంధించిన విషయాలను ఖచ్చితంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని స్పష్టం చేశారు. ఒకే ఇంట్లో ఉంటున్నంత వరకు లబ్దిదారులను ఒకే కుటుంబంగా పరిగణించాలని తల్లిదండ్రులతో కలిసివుండి వాళ్ళను బాగా చూసుకోవాలన్న ఆలోచనను పిల్లలకు కలిగించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. పట్టణ ప్రాంతాల్లో జన్మభూమి నిర్వహణపై దృష్టిసారించాలని కోరారు. గ్రివెన్స్‌కు కూడా మండల, జిల్లా స్థాయిల్లో అవార్డులు ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, సీఎంవో ముఖ్య కార్యదర్శి సతీష్ చంద్ర, ఆర్టీజీ సీఈవో బాబు.ఎ, సీఎం అదనపు కార్యదర్శి ఎ.వి రాజమౌళి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర బ్రాండ్ అంబాసిడర్‌గా 'గజల్' తొలగింపు

ఇటీవల లైగింపు వేధింపుల వివాదంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న గజల్ శ్రీనివాస్‌ను స్వచ్ఛాంధ్ర మిషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా తొలగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 మే 28న స్వచ్ఛాంధ్ర బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించిన ప్రభుత్వం ప్రస్తుత ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

పల్లెటూరికి సేవ చేస్తే పరమాత్ముడికి సేవ చేసినట్లేనని పెద్దలు చెప్పిన మాటను అనుక్షణం గుర్తుచేసుకుంటూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా గ్రామాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర ప్రజల ముందుకు తీసుకొస్తున్నాను.



స్వాతంత్ర్యం వచ్చాక నిరుపేద గ్రామీణులకు పనిని హక్కుగా ఇచ్చిన చట్టం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం. ఏడాదికి ఒక కుటుంబానికి నైపుణ్యం అవసరం లేని పనిని వందరోజుల పాటు కల్పించడమే కాకుండా వారికి సుస్థిర ఆస్తులను ఏర్పాటు చేసి, స్థిర ఆదాయం కల్పించడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. పథకంలో ఖర్చు చేసే ప్రతి వంద రూపాయల్లో 60 రూపాయలను వేతనాలకు వెచ్చిస్తే, మిగిలిన 40 రూపాయలను గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పండ్ల తోటలు పెంపకం, తదితర మెటీరియల్ ఆధారిత పనులకోసం ఖర్చు చేసే వెసులుబాటును చట్టం ఇచ్చింది. విభజన అనంతరం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నిధులు లేవు. సమయం లేదు. అలాంటి పరిస్థితిలో రాష్ట్ర ప్రయాణం మొదలైంది. గ్రామాల సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా, పాలనాపరంగా అపార అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు అనుసంధాన ప్రక్రియకు నాంది పలికారు. ఇతర ప్రభుత్వ శాఖల అనుసంధానంతో దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను విజయవంతంగా ముందుకు తీసుకెడుతున్నాం. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, సహజ వనరులు, నీటి బడ్జెట్, నీటి పారుదల, గ్రీన్ వర్క్ వంటి పనులు చేపట్టి గతంలో ఎన్నడూ లేని విధంగా దేశానికే ఆదర్శప్రాయంగా నిలబడ్డాం.

జనవరి 1నుంచి 11వ తేదీ వరకూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమాల సందర్భంగా పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు గత మూడున్నరేళ్ళుగా సాధించిన ప్రగతి, విజయాలను మీముందుంచుతున్నాను.

గ్రామీణ మౌలిక సదుపాయాల్లో గణనీయమార్పు..

గత మూడున్నరేళ్ళలో గ్రామ పంచాయతీలను అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నాం. విభజనకు పూర్వం, ప్రస్తుతం మన గ్రామాల్లో వచ్చిన పరిస్థితుల మార్పును ఇక్కడ వివరించాల్సిన అవసరముంది. ఆర్థిక సమస్యలు, నిధుల కొరతతో ప్రభుత్వం ఇబ్బంది పడుతున్న సమయంలో అనుసంధానం గ్రామాల అభివృద్ధికి వరంగా మారింది. ఉపాధి హామీ పథకం నిధులను 22 శాఖలతో అనుసంధానం చేసి, ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో అనేక పనులు చేపట్టి పట్టణాలకు ధీటుగా గ్రామాల అభివృద్ధి చేపడుతూ దేశంలోనే ముందంజలో నిలిచాం.

పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి గ్రామ పంచాయతీ కార్యకలాపాల నిర్వహణకు ప్రతి గ్రామంలో ఆధునిక వసతులతో ఒక శాశ్వత భవనాన్ని నిర్మిస్తున్నాం. గ్రామస్తులు సమస్యలను నివేదించుకోవడానికి కానీ, ఈ నివేదనలు తీసుకోవడానికి కానీ గ్రామ సర్పంచులకు స్థిరమైన కార్యాలయాలు దశాబ్దాలుగా లేవు. ఆ లోటును భర్తీ చేయడానికి రాష్ట్ర విభజన తరవాత, 129.9 కోట్ల రూపాయల ఖర్చుతో 1628 సొంత భవనాలను నిర్మించాం. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహార సేవలు అందించడంతోపాటూ పిల్లలకు కార్పొరేట్ ప్లే స్కూల్ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. అద్దె గృహాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆరోగ్యకర వాతావరణం ఉన్న సొంత భవనాల్లోకి మారుస్తున్నాం. ఇందులో భాగంగా 2014-15 నుంచి ఇప్పటి వరకూ 70.45 కోట్ల వ్యయంతో 4,139 కేంద్రాలను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అనుసంధానంతో నిర్మించి, దేశంలోనే ముందున్నాం. మహిళాసంఘాలు సమావేశాలను నిర్వహించుకోవడానికి మండల స్థాయిలో స్త్రీశక్తి భవనాలు నిర్మిస్తున్నాం. విభజనకు పూర్వం కేవలం 31 కేంద్రాలుంటే, మా ప్రభుత్వం వచ్చాక 38.65 కోట్ల రూపాయలతో 584 భవనాలను నిర్మించాం. ఎన్నో ఏళ్ళుగా గ్రామీణ విద్యా వ్యవస్థలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లోని పాఠశాలల్లో ఆట స్థలం, మరుగు దొడ్ల నిర్మాణం చేపడుతున్నాం.

రోడ్ల నిర్మాణంలో రికార్డు

దశాబ్దాలుగా సరైన రోడ్లు లేక ప్రజలు అష్టకష్టాలూ పడ్డారు. అలాంటిది ఎవరూ కలలో కూడా ఊహించని విధంగా గ్రామీణ అంతర్గత రహదారులను సిమెంటు రోడ్లుగా మార్చాం. ఈ మూడున్నర సంవత్సరాలలో 3314.5 కోట్ల రూపాయల ఉపాధి హామీ నిధులతో దేశంలో ఎక్కడా లేని విధంగా 14,143 కిలోమీటర్లు పొడవైన సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి చరిత్ర సృష్టించాం. 2019 నాటికి అన్ని గ్రామాల్లో సిసి రోడ్లను పూర్తిచెయ్యాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వీటితో పాటు పంటపొలాలను గ్రామాలతో కలిపే దారులను గ్రావెల్ రోడ్లుగా మార్చి, వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్ళడానికి చక్కటి వసతి కల్పించాం. రాష్ట్ర విభజనకు పూర్వం 383.62 కోట్ల రూపాయల ఖర్చుతో 7672 కిలోమీటర్ల పొడవైన గ్రావెల్ రోడ్లను నిర్మిస్తే, మా ప్రభుత్వం వచ్చాక 570 కోట్ల రూపాయలు ఖర్చు చేసి, 11,401 కిలోమీటర్ల రోడ్లను నిర్మించాం. ఈ సూచికలో మనం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నామని గర్వంగా చెబుతున్నాను.

భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు సన్నాహాలు

రహదారులు నిర్మించడమే కాదు గ్రామాల్లో రహదారులపై పొంగిపొర్లే మురుగు కాల్వలు, మలేరియా, డెంగ్యూలాంటి అంటువ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్న మురుగు కాల్వల స్థానంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నాం. మొదటి దశలో భాగంగా 157 గ్రామాల్లో భూగర్భ డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే రెండేళ్ళలో 594 కోట్ల వ్యయంతో 2,376 కిలోమీటర్ల భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చెయ్యబోతున్నాం. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన స్మశానాల్లో దహన వాటికతో పాటు నీటి వసతి, నీడ సదుపాయాన్ని కల్పించి స్వర్గపురిగా తీర్చిదిద్దుతున్నాం. గ్రామీణ మౌలిక సదుపాయాల ఏర్పాటులో స్మశానాల అభివృద్ధిని కూడా చేర్చాం.

30లక్షల ఎల్ఇడి బల్బులు..

ఏళ్లతరబడి గ్రామాలు చీకట్లలో మగ్గిపోయాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో కాంతులు నింపడానికి, తక్కువ ఖర్చుతో ఎక్కువ వెలుగు, తక్కువ కరెంట్ ఖర్చు, ప్రజలకు భద్రత లక్ష్యంగా 2018 నాటికి 12,918 పంచాయతీల్లో 30 లక్షల ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చెయ్యబోతున్నాం. ఇప్పటికే నాలుగు లక్షల బల్బుల ఏర్పాటు పూర్తి అయ్యింది. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం పెంపొందించి, చెత్త నుండి సంపద సృష్టించాలి అనే ఉద్దేశంతో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను నిర్మిస్తున్నాం. ఇప్పటి వరకూ 805 కేంద్రాలు ఏర్పాటు చేశాం. 2019 నాటికి అన్ని గ్రామాల్లో వెర్మికంపోస్ట్ కేంద్రాలు ఏర్పాటు చేసి తద్వారా 300 కోట్ల ఆదాయాన్ని గ్రామ పంచాయతీలకు కల్పించాలి అని లక్ష్యంగా పెట్టుకున్నాం. మరో 4,002 కేంద్రాల నిర్మాణాన్ని 35.49 కోట్ల వ్యయంతో చేపడుతున్నాం.రాష్ట్రాన్ని మార్చి 2018 నాటికి బహిరంగ మల, మూత్ర రహిత రాష్ట్రంగా ప్రకటించనున్న తరుణంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మిస్తున్నాం. గత మూడున్నర సంవత్సరాల్లో 3,200 కోట్ల రూపాయల వ్యయంతో 27 లక్షల వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణం చేపట్టాం. 2014కు ముందు గ్రామాల్లో 35 శాతం మందికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండగా, ఇప్పుడు 80 శాతం మందికి వ్యక్తిగత మరుగుదొడ్లను ఏర్పాటు చేశాం. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమానికి సహకారం అందిస్తున్నా ప్రధాన మంత్రి మోడీ, కేంద్ర ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు. మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించి వచ్చే మార్చి నాటికి మరో 16 లక్షల మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మరుగుదొడ్ల నిర్మాణంలో దేశంలో మనం ప్రథమ స్థానంలో ఉన్నాం. ప్రభుత్వ భవనాల పైకప్పుల నుండి వచ్చే ప్రతి వర్షపు చినుకుని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేసేందుకు 2,481 ఇంకుడుగుంతలను ఏర్పాటు చేశాం. మరో 2,537 ఇంకుడు గుంతల నిర్మాణం ప్రారంభం అయ్యింది. ఇవే కాక మౌలిక సదుపా యాల ఏర్పాటులో భాగంగా గ్రామీణ సంతల నిర్వహణకు షెడ్ల నిర్మాణం, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు గిడ్డంగులు, గ్రామీణ క్రీడ లను ప్రోత్సహించేందుకు క్రీడా ప్రాంగణాలు, విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానానికి అవసరం అయిన డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు చేస్తున్నాం.

వాటర్ గ్రిడ్ పథకం...

రాష్ట్రంలో ఉన్న 12,918 పంచాయతీల్లో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించాలని తాగునీటి కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. ప్రతి వ్యక్తికి రోజుకి 70 ఎల్‌పిసిడి నీటిని అందించాలి అని ప్రణాళిక సిద్ధం చేశాం. 22 వేల కోట్ల ఖర్చుతో ఈ ప్రాజెక్ట్ చేపట్టబోతున్నాం. 2018 జూన్ నాటికి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించబోతున్నాం.

నీరే ప్రాణం... చెట్టే ఆధారం...

నీరు, గాలి, నేల, చెట్లు ప్రకృతి సిద్ధంగా లభించే సహజ వనరులు. సమస్త ప్రాణికోటి మనుగడకు ఇవే ఆధారం. వీటిని సంరక్షించుకోకపోతే ప్రాణికోటి మనుగడే కష్టంగా మారుతుంది. ప్రస్తుతం ఉన్న 10 శాతం భూగర్భ జలాలను 15 శాతానికి పెంచడం, 2019 నాటికి అడవుల విస్తీర్ణాన్ని 50 శాతానికి పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి గ్రామానికి వాటర్ బడ్జెట్ తయారుచేస్తున్నాం. పరిగెత్తే నీటిని నడిపించి, నడిచే నీటిని భూమిలోకి ఇంకేలా చెయ్యగలుగుతున్నాం. 12,918 గ్రామాలకు గాను 11,491 గ్రామాల్లో ప్రవాహ రూపంలో వృధాగా పోతున్న నీటిని ఆదా చెయ్యడానికి నీటి నిల్వ కట్టడాలను ఉపాధిహామీ, వాటర్ షెడ్ నిధులతో చేపడుతున్నాం. భూగర్భ జలాలు పెంచి అదనంగా భూమిని సాగులోకి తీసుకొచ్చేందుకు 2014 -15 నుంచి ఇప్పటివరకూ 204.11 కోట్ల ఖర్చుతో 8,943 చెక్ డ్యామ్‌లను నిర్మించాం. రైతులకు బోర్లు, బావులున్న చోట్ల 11,968 ఊట కుంటలను 114.40 కోట్ల వ్యయంతో నిర్మించాం. ముఖ్యమంత్రిగారి ప్రత్యేక దృష్టి సారించడం వలన 1,165.22 కోట్లు వెచ్చించి 4,76,659 ఫార్మ్ పాండ్స్ ఏర్పాటు చేసే ఈ సూచికలో దేశంలోని మొదటి స్థానంలో నిలిచాం. మంచినీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ఇంజెక్షన్ బోరుబావులు, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, భూసారం కొట్టుకుపోకుండా ఉండేందుకు భూసార పరిరక్షణ కట్టడాలు, కందకాలు తవ్వకం వంటి పనులు చేపడుతున్నాం. పరిసరాల పచ్చదనాన్ని పెంచి కాలుష్యాన్ని నివారించి, భావితరాలకు ఆదాయాన్ని, ఆరోగ్యాన్ని ఆస్తులుగా ఇచ్చేందుకు పండ్ల తోటల పెంపకం, రోడ్డుకు ఇరువైపులా మొక్కల పెంపకం, బోడి కొండలపై మొక్కల పెంపకంవంటి పనులు చేపడుతున్నాం. గడిచిన మూడున్నర సంవత్సరాల్లో 2,67,461 ఎకరాల్లో 408 కోట్లతో పండ్ల తోటలు వేయించి, రైతు కూలీలను యజమానులుగా మార్చాం. 2014 తరువాత 19,665 కిలోమీటర్ల పొడవైన రోడ్డుకు ఇరువైపులా 100 కోట్ల వ్యయంతో మొక్కలు నాటాం. 2,350 హెక్టార్లలో బోడికొండలపై వేలాది మొక్కలను నాటాం. పెరటి తోటల్లో భాగంగా ఇంటికి ఐదు రకాల పండ్ల మొక్కలచొప్పున 10,96,144 కుటుంబాలకు ఉచితంగా ఇచ్చాం. 2029 నాటికి రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం ఉండే విధంగా నర్సరీలు ఏర్పాటు చేస్తున్నాం. ఊరికో చెరువు అన్న భావనతో 2,368 కోట్లతో 80,773 చెరువులను బాగుచేశాం. వీటికింద వేలాది ఎకరాల భూమిని సాగులోకి తీసుకొచ్చాం.

నిధుల సమర్థ వినియోగం...

2006 -07 నుండి 2013-14 ఆర్థిక సంవత్సరాల్లో ఉపాధిహామీ పథకంలో వేతన వాటాకు అనుగుణంగా మెటీరియల్ వాటాగా 6,512 కోట్లు వినియోగించుకోవడానికి అవకాశం ఉన్నా అప్పటి పాలకుల నిర్లక్ష్యం వలన 3,296.2 కోట్లు మనం నష్టపోయాం. మా ప్రభుత్వం వచ్చిన తరువాత అందుకు భిన్నంగా గత మూడున్నరేళ్లగా తీసుకున్న చర్యల వలన మెటీరియల్ వాటాను గరిష్టంగా వినియోగించుకొని 6,216 కోట్లు మెటీరియల్ కింద ఖర్చు చేసే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం. రానున్న కాలంలో 250 మంది కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాలకు 4,300 కోట్లు ఖర్చు చేసి లింక్ రోడ్లు ఏర్పాటు చెయ్యబోతున్నాం. ఎన్టీఆర్ జలసిరి 2 కార్యక్రమంలో భాగంగా 35,000 వేల బోర్‌వెల్స్ తవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకూ 17,749 బోర్‌వెల్స్ తవ్వాం. అందులో 3644 బోర్‌వెల్స్‌కు సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేశాం. త్వరలోనే గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి ఆదేశాలతో 10 స్టార్ రేటింగ్ ఇవ్వబోతున్నాం.

1. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఏర్పాటు, 2. విద్యుత్ కనెక్షన్, 3. గ్యాస్ కనెక్షన్, 4. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు, 5. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు డంప్ యార్డుల నిర్మాణం, 6. గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, 7. ప్రతి ఇంటికి ఫైబర్ నెట్ కనెక్షన్, 8. ప్రతి కుటుంబానికి 10 వేల ఆదాయం కల్పించడం, 9. అందరికీ విద్య మరియు అనుబంధ విషయాలు, 10. ఆరోగ్యం, పౌష్టిక ఆహారం.

వీటి ఆధారంగా గ్రామాలకు ప్లాటినం, గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ రేటింగ్ ఇవ్వబోతున్నాం. 2022 నాటికి అన్ని గ్రామాలు టెన్ స్టార్ రేటింగ్ సాధించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ఇటీవల కాలంలో మిషన్ అంత్యోదయ దేశవ్యాప్తంగా 83 ఉత్తమ గ్రామాలను ప్రకటిస్తే అందులో 33 గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలే ఉత్తమ గ్రామాలుగా నిలిచాయి. అంతేకాకుండా 11 స్కోచ్ అవార్డులను పంచాయతీ రాజ్ శాఖ కైవసం చేసుకుంది.

గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి ప్రధాన కారణం అయిన ఉపాధిహామీ వేతనదారులకు, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న రాష్ట్ర ప్రజలకు, క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను అమలు చేస్తున్న అధికారులకు నా కృతజ్ఞతలు.

(నారా లోకేష్)
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ,
ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ మంత్రి,
అమరావతి, ఆంధ్రప్రదేశ్

ఢిల్లీ పిలుపు.. ఓ మెరుపు!

కొత్త సంవత్సరం మీద కోటి ఆశలు.. ఆశయాలుంటాయో లేదో చెప్పలేం గాని ఆశలు మాత్రం ఉంటాయి. జీవితంలో అనుకోని మలుపులు ఉండాలని కోరుకుంటారు. ఆ మలుపుల్లో మెరుపులే ఉండాలి గాని మరకలు ఉండకూడదనీ భావిస్తారు. 2018 సంవత్సరం మాత్రం ఎంతమందికి ఎన్నెన్ని మెరుపులు తెచ్చింది? ఎంతెంత మరకలతో మొదలైంది? ఓసారి అవలోకిస్తే ప్రారంభమే ఓ కలగాపులగపు మలుపులతో మొదలైనట్టు తోస్తుంది.

ఈ కొత్త సంవత్సరం ప్రారంభంలో ఎక్కువగా ఆనందించే నాయకుల్లో మొదటగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుణ్ణి చెప్పుకోవాలి. అవును. నిజంగా ఇది ఆయనకు ఓ శుభ ఘడియే. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయనతో కలిసి మాట్లాడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమస్యల మీద చర్చించి ఒక అవగాహనకు రావాలని సంకల్పించడం కన్నా శుభ పరిణామం చంద్రబాబుకి ఇంకేమీ ఉండదు. కొద్ది నెలలుగా వారిద్దరి మధ్యా రాజకీయ సత్సంబంధాలు సరిగా లేవని వరస సంఘటనలు తేటతెల్లం చేశాయి. ఇద్దరు రాజకీయ నేతల మధ్య సంబంధాలు అన్నివేళలా సజావుగా ఉండాలన్న నియమమేమీ లేదు. అందులోనూ భారతదేశపు ప్రజాస్వామిక వ్యవస్థలో రాజకీయ సంబంధాలు ఎప్పటికప్పుడు కొత్తకొత్త నిర్వచనాలను వాటికవే సంతరించుకుంటూ చీకటి వెలుగుల మాదిరి మారుతుంటాయి. కాని ఒక ప్రధానమంత్రి-ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మధ్య సంబంధాలు మాత్రం వ్యక్తిగతం కాదు. అవి రాజ్యాంగ చట్రానికి లోబడి నడిచేవి. పాలకులుగా ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పదవులు అవి. ఈ కోణంలో చూసినప్పుడు నిస్సందేహంగా వారిద్దరి మధ్య ఏదో తెలీని అగాధం నెలకొన్నట్టు మాత్రం అర్థమవుతున్నది. ఆ అగాధం పెద్దదా చిన్నదా అన్న మీమాంస కూడా ఉన్నది. అయితే ప్రధానమంత్రి తాజాగా తీసుకున్న నిర్ణయంతో అది చాలా చిన్న అగాధమేనని అనుకోవడానికి ఎక్కువ ఆస్కారం ఏర్పడుతున్నది. పోలవరం అంశం అటు కేంద్ర ప్రభుత్వానికి ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య దూరాన్ని పెంచిందన్న అభిప్రాయాలు వ్యాపించి ఉన్నాయి. దానికి తోడుగా కొన్ని పాత అంశాలు తోడయ్యాయి. ఏపీకి ప్రత్యేక హోదా అంశం ఈ మొత్తం సంక్షోభానికి బీజం వేసింది. ఎడ్డెం అంటే తెడ్డెం అన్నట్టు.. నువ్ తమలపాకుతో ఒకటంటే.. నేను తలుపు చెక్కతో ఒకటంటా అన్నట్టు.. అది పెరిగి పెరిగి పెద్దదైంది. ఫలితంగా ఎన్నో అపోహలు.. అపార్థాలు.. మధ్యలో పోలవరం వ్యవహారం పూర్తిగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఈ పరిణామం అగ్నికి ఆజ్యం తోడైనట్టయిందా..లేక సమస్య దూదిపింజలా తేలిపోవడానికి మలుపైందా.. అంచనా వేయడానికి చంద్రబాబుకే చాలా సమయం పట్టింది. అందుకే ఒక దశలో ఆయన నిష్ఠూరమాడేంత వరకు వెళ్లారు. మొత్తానికి కేంద్ర వైఖరితో.. ప్రత్యేకించి ప్రధాని మోడీ తన పట్ల వ్యవహరిస్తున్న తీరుతో చంద్రబాబులో అశాంతి.. అసహనం.. ఆవేదన.. ఆలోచన.. ఆవేశం.. ఆక్రోశం.. పెల్లుబికాయి. స్వతహాగా ఆచితూచి మాట్లాడటం.. ఆగి ఆగి స్పందించడం.. ఆలోచించి చర్చలు తీసుకోవడమే ఆభరణాలుగా పేరొందిన చంద్రబాబు ఈ విషయంలో యాష్టపడి.. తెల్లారేసరికి మళ్లీ సర్దుకుని తేరుకున్నారు. తనలోని రాజనీతిజ్ఞతను అవసరమైన సమయంలో అవసరమైనంత మేర ప్రయోగించి పరిస్థితి చేయి దాటి వెళ్లకుండా తనకు తానే జాగ్రత్త పడ్డారు. అంతిమంగా అదే ఆయనకు శ్రీరామరక్ష అయినట్టుంది. ప్రధాని మోడీ నుంచి సంకేతం వచ్చింది. సందేశం అందింది. నిజానికి అదీ నాటకీయంగానే జరిగింది. రాష్ట్రస్థాయిలో బీజేపీ-తెలుగుదేశం నాయకులు ఉప్పు-నిప్పు మాదిరి ప్రకటనల పోరాటంలో తలమునకలై ఉన్న తరుణంలో ఆ రెండు పార్టీల ఎంపీలు ఢిల్లీలో సరికొత్త ప్రయోగం చేశారనే చెప్పుకోవాలి. అందుకు వారిని అభినందించాల్సిందే. తమ మధ్య మనస్పర్థలు లేవని.. అవసరమైతే రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్కటవుతామని చేతల ద్వారా నిరూపించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల చివరి రోజున ప్రధానమంత్రి మోడీని కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమస్యలను ఒక చిట్టా రూపంలో సమర్పించి.. సరికొత్త లాబీయింగ్‌కు తెరతీశారు. అది సత్ఫలితాన్నే ఇచ్చింది. ప్రధానమంత్రి మోడీ కూడా ఊహకందని విధంగా స్పందించారు. అంతకుముందు వాతావరణం చూస్తే



ఆయనలా స్పందించడం నిజంగా ఏదో అదృశ్య శక్తి ఆవహించినట్టే అనుకోవాలనిపిస్తుంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకి అప్పాయింట్మెంట్ ఇవ్వడానికి ఆయనకు మనస్సు రావడం లేదని ఇన్ని నెలలుగా ఒక అభిప్రాయం ప్రచారంలో ఉంది. అలాంటిది మోడీ హృదయాంతరాల నుంచి స్పందించినట్టు అనిపించింది. రాష్ట్ర బాగోగుల బాధ్యత తనకు వదిలేయాలని ఆయన అనడం ద్వారా చాలా పెద్ద బాధ్యతను తన భుజస్కంధాల మీద వేసుకుంటున్నట్టు తనకు తానుగా అంగీకరించినట్టయింది. చంద్రబాబుని పిలిపించి మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఇంకాస్త ముందుకెళ్లి ఆయనే హామీ ఇవ్వడం.. ఆడబోయే తీర్థం ఎదురైనట్టుగానే భావించాలి. చంద్రబాబు త్వరలోనే ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీతో భేటీ అయితే... ఇదే పెద్ద విజయమవుతుంది. మోడీతో ఒకసారి భేటీ అయితే ఆ తర్వాత ఇంకొన్ని భేటీలకు అది మార్గం వేస్తుంది. తద్వారా ముందర.. వాళ్లిద్దరి మధ్య.. వాళ్లిద్దరి ప్రమేయం లేకుండానే.. వాళ్లిద్దరికీ తెలీకుండానే.. ఏర్పడిన మంచుపొగ కరిగిపోతుంది. ఒక్కసారి అది కరిగితే భవిష్యత్ మార్గం స్పష్టమవుతుంది. ఒకసారి జరిగిన పొరపాటు మళ్లీ జరగదు. అంతిమంగా ఇదంతా రాష్ట్రానికే ప్రయోజనకరం. అందులోనూ ఎన్నికల సమయం దగ్గరపడుతున్నవేళ ఈ సంక్షోభం ఇంకా సాగడం ఉభయులకీ క్షేమదాయకం కాదని ప్రధాని మోడీ భావించి ఉండొచ్చు. అందులో భాగంగానే ఈ కసరత్తు మొదలై ఉండొచ్చు. కారణం ఏదైనా సమస్య పరిష్కారానికి ఉద్దేశించిన భేటీ కాబట్టి మిగతా వాటికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజకీయాలన్నాక రాజకీయ ప్రయోజనాలు లేకుండానే ఇలాంటి దౌత్యాలు జరుగుతాయని అనుకోలేము. మొత్తం మీద చంద్రబాబుకి ఇది శుభ శకునం. ఇంతకాలం ఆయనలో పేరుకుపోయిన అసంతృప్తి కరిగిపోతుంది. వాజ్‌పేయి, దేవెగౌడ లాంటి నేతలు ప్రధానమంత్రులుగా ఉన్న తరుణంలో తానే అంతా అయి ఢిల్లీలో చక్రం తిపిన రోజుల్ని అనుక్షణం గుర్తుచేసుకునేలా మోడీ వ్యవహరించిన నేపథ్యంలో చంద్రబాబు కొత్త ఉత్సాహంతో మోడీ దగ్గరకు వెళ్లి.. ఆయన అభిమానాన్ని చూరగొనే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒక్కసారి భేటీ అయితే భవిష్యత్ మార్గాన్ని తనకు తానే వేసుకునేలా చంద్రబాబు జాగ్రత్తలు తీసుకోగలరు. అందులోనూ ఒకసారి దెబ్బ తిన్నతర్వాత ఆయన మరింత జాగ్రత్త పడతారు. ఇక కొత్త సంవత్సరంలోని మరో పార్శ్వాన్ని చూస్తే.. డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము దాకా డ్రంకెన్ అండ్ డ్రయివ్ కేసులు.. పోలీసుల ఛేజింగ్... ఇదొక కొత్త సంస్కృతిలాగా వెంటాడుతోంది. ఏటికేడాది ఇలాంటి కేసులు పెరుగుతున్నాయే గాని తగ్గడం లేదు. కొత్తగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో సైతం ఆ రాత్రి జరిగిన డీజేలు అందర్నీ పునరాలోచనలో పడేస్తున్నాయి. హైదరాబాదులో మద్యం సేవించి.. అదీ అమితంగా.. కాస్తంత ముతకగా చెప్పాలంటే.. పీకల దాకా తాగి.. కారు నడుపుతూ పట్టుబడ్డ టీవీ యాంకర్ ప్రదీప్ ఉదంతం కొత్త సంవత్సరం మొదటి వారమంతా తెలుగు రాష్ట్రాల్లో ఒక వినోదంలా మారింది. మద్యం సేవించి వాహనం నడపొద్దని సోషల్ మీడియాలో సుద్దులు చెప్పిన ఓ సెలెబ్రిటీ అదే నేరం చేసి పట్టుబడితే... సమాజం దాన్ని ఎలా తీసుకోవాలి? ఇది ఒక ప్రదీప్ విషయం కాదు. సామాన్యులు సెలెబ్రిటీలను భిన్నంగా చూస్తారు. వారిని అనుకరించడానికి, అనుసరించడానికి ప్రయత్నిస్తారు. అలాంటిది సెలెబ్రిటీలు తమ సహజ వ్యక్తిగత జీవితాలకు భిన్నంగా నీతిబోధనలు చేస్తే.. వాటికి విలువేముంటుంది? అప్పటిదాకా ఆ మాటలను వేదవాక్కులుగా నమ్మిన జనం సంగతేమిటి? ప్రతి వ్యక్తిలోనూ ఒక అపరిచితుడు ఉంటాడు. ఆ అపరిచితుడు ఎల్లవేళలా అందరికీ కనిపించడు. వాణ్ని లోలోనే బలవంతాన నిద్రపుచ్చుతారు. కాని అతను నిద్రలేస్తే అసలు నిజం జడలు విప్పుతుంది.

ఆటలో అరటిపండు మాదిరి గజల్ శ్రీనివాస్ ఉదంతం.

> **ఆటలో అరటిపండు మాదిరి గజల్ శ్రీనివాస్ ఉదంతం. సమాజంలో ఒక స్థాయికి చేరిన సెలెబ్రిటీలు వ్యక్తిగత జీవితాల్లో సైతం నైతికతను పాటించకపోతే చివరకు ఇలాంటి వైపరీత్యాలే జరుగుతాయని ఈ సంఘటన తేటతెల్లం చేస్తున్నది. మసాజ్.. ఫిజియోథెరపీ.. ఈరెంటికీ తారతమ్యాన్ని సామాన్య జనం గ్రహించలేరన్న ఓ భ్రమ ఇంత దూరం తెచ్చి ఉంటుందేమో. ఆఫీసుల్లో ఫిజియోథెరపీ చేయించుకోవడం ఎంతవరకు సబబు? అది ఫిజియోథెరపీ అవుతుందా? ఇలాంటి ప్రశ్నలు ఈ ఉదంతంలో సమాధానాల్లేనివిగానే మిగిలిపోతున్నాయి. ఇదంతా నైతిక విలువలకు సంబంధించినవి. నైతికత అంటే ఏమిటి అన్న ప్రశ్నపైనే ఆధారపడాలనుకుంటే ఇక సమస్యే లేదు.**

సమాజంలో ఒక స్థాయికి చేరిన సెలెబ్రిటీలు వ్యక్తిగత జీవితాల్లో సైతం నైతికతను పాటించకపోతే చివరకు ఇలాంటి వైపరీత్యాలే జరుగుతాయని ఈ సంఘటన తేటతెల్లం చేస్తున్నది. మసాజ్.. ఫిజియోథెరపీ.. ఈరెంటికీ తారతమ్యాన్ని సామాన్య జనం గ్రహించలేరన్న ఓ భ్రమ ఇంత దూరం తెచ్చి ఉంటుందేమో. ఆఫీసుల్లో ఫిజియోథెరపీ చేయించుకోవడం ఎంతవరకు సబబు? అది ఫిజియోథెరపీ అవుతుందా? ఇలాంటి ప్రశ్నలు ఈ ఉదంతంలో సమాధానాల్లేనివిగానే మిగిలిపోతున్నాయి. ఇదంతా నైతిక విలువలకు సంబంధించినవి. నైతికత అంటే ఏమిటి అన్న ప్రశ్నపైనే ఆధారపడాలనుకుంటే ఇక సమస్యే లేదు. వీడియోలు కుట్రలో భాగమేనని చెప్పుకున్నా.. ఫిజియోథెరపీకి, మసాజ్‌కి తేడా గురించిన ప్రశ్నలు.. ఆ రెండూ ఆఫీసుల్లో చేయించుకోవచ్చా అన్న ప్రశ్నలు ఆ కుట్ర కోణాన్ని క్రీనీడల్లా ఆక్రమించేస్తున్నాయి. పైకి స్వాములుగా కనిపిస్తూ.. తెరచాటు బాగోతాలు వెలగబెట్టిన చాలామంది వికృత చేష్టలు ప్రసార మాధ్యమాల్లో కనిపిస్తుంటాయి. ఇలాంటివి చూసినప్పుడు ఎవరిని నమ్మాలి? ఎవరిని నమ్మకూడదు? అన్న ప్రశ్న పుట్టుకొస్తుంది. కాని దానికి సమాధానం మాత్రం దొరకదు. డ్రంకెన్ అండ్ డ్రయివ్‌లో దొరికినప్పుడు.. చట్టాన్ని గౌరవించి.. కౌన్సెలింగ్‌కి హాజరైతే అదొక పద్ధతి. కాని పోలీసులకు కూడా ఆనుపానులు లేకుండా వారం రోజుల పాటు సాగలాగడం ద్వారా యువతకు ఏమి సందేశం ఇస్తున్నాం? చట్టానికి దొరక్కుండా అజ్ఞాతంలో ఉండిపోవచ్చని చెపడమే అవుతుంది. ఎవ్వరైనా ఎంతోకాలం చట్టం కళ్లుగప్పి ఉండటం సాధ్యం కాదు. ఈ నిజం తెల్సీ అదే తప్పు చేయడం సమాజానికి దుర్నీతి సంకేతాలు ఇవ్వడమే. చివరకు తాను మళ్లీ సోషల్ మీడియాలోకి వచ్చి.. తాను కౌన్సెలింగ్‌కు వెళతానని చెప్పక తప్పలేదు. దీనికి ఓ వారం సమయం పట్టడం విడ్డూరం. ఈలోగా యువతకు వెళ్లాల్సిన సందేశం వెళ్లిపోయింది. తప్పుచేసినా తప్పించుకుని తిరగొచ్చు అని. ఈ సంగతి అలా ఉంచితే.. భార్యల హత్యో దంతాల నుంచి ఒక్కసారిగా సీన్ భర్తల హత్యోదంతాలకు మారినట్టు కనిపిస్తున్నది. కిందటి ఏడాది చివర్లో ఒక స్వాతి ఉదంతం మరవక ముందే తాజాగా ఒక జ్యోతి తెరమీదికొచ్చింది. ప్రియుడితో కలిసి భర్త హత్యకు పకడ్బందీ ప్లాన్ వేసి సక్సెస్ అయింది. ఆ అమ్మాయిని చూస్తే నిండా పాతికేళ్ల వయస్సు లేదు. మానసిక పరిపక్వత లేదు. కాని ఆ అమ్మాయి భర్తనే హత మార్చిందంటే నమ్మలేని స్థితి. కాని దర్యాప్తులో ఆమే హత్య చేసినట్టు సాక్ష్యాధారాలు తేటతెల్లం చేశాయి. ఇష్టం లేని పెళ్లి జరిగితే దాన్ని పరిష్కరించుకోవా ల్సిన పద్ధతి వేరు. ఇష్టం లేకపోతే భర్తకి విడాకులు ఇచ్చి ఇష్టపడ్డ ప్రియుణ్ణి కట్టుకోవచ్చు. కాని భర్తని హతమార్చి ఆ తర్వాత సుఖంగా బతకొచ్చు అనుకోవడమే విచిత్రం. ఇదిలా నడుస్తుండగానే కోస్తాంధ్రలో ఒక శ్రీవిద్య. ఆమెదీ ఇదే తంతు.. ఇష్టం లేని భర్తను వదిలించుకునే మార్గం హత్యే అని నమ్మడమే ప్రమాదకర ధోరణికి అద్దం పడుతున్నది. మానవ మనస్తత్వాల్లో.. ఆలోచనా ధోరణుల్లో వస్తున్న మార్పుగా దీన్ని నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. భార్యలే కాదు.. భర్తలూ ఇలాంటి దుస్సాహసాలకు ఒడిగడుతున్న సంఘటనలు ఉంటున్నాయి. ఆడమగా తేడా కాదు. స్థూలంగా మనుషుల్లో వస్తున్న ఈ విపరీత ఆలోచనా ధోరణి గురించే చర్చంతా. సామాజిక, ఆర్థిక పరిస్థితులు కూడా ఇలాంటి సందర్భాల్లో ప్రధాన కారకాలుగా ఉంటున్నాయి. సరైన విద్య లేకపోవడం మరొక కారణం. అందరికీ విద్య అన్న నినాదం మిథ్యగా మారడం కూడా ఇలాంటి ఉపద్రవాలకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో కారణమవుతున్నది. నేరం చేశాక చట్టానికి చిక్కడం తప్పదని తెలిసీ.. ఇలా తెగించడాన్ని మూర్ఖత్వమని సరిపెట్టుకోలేము. చేసిన నేరానికి ఎటూ తగిన శిక్షలు పడతాయి కదా అని సరిపెట్టుకోలేము. శిక్షలు పడే మాట నిజమే అయినా.. రోజుల తరబడి ఆ దుష్ట వీరోచిత గాథలు ప్రసార మాధ్యమాల్లో చూస్తున్న యువత ఏం నేర్చుకుంటారన్నదే ప్రశ్న. మొత్తం మీద కొత్త సంవత్సరం వృద్ధుల నుంచి యువత దాకా ఇచ్చిన సందేశం ఏమిటని ఓసారి అవలోకనం చేస్తే మాత్రం గర్వించదగ్గ పరిణామమేదీ లేదు. మిగతా సంవత్సరం మీద ఆశతో ఎదురుచూడటమే మిగిలింది!

❑ వయ్యెస్సారెస్

లాలూకు మూడున్నరేళ్ల జైలు

● దాణా కుంభకోణం కేసులో శిక్ష ఖరారు ● లాలూతో పాటు ఏడుగురికి ఒకే శిక్ష ● నిందితులందరికీ రూ. 10లక్షల జరిమానా ● హైకోర్టులో బెయిల్ తెచ్చుకుంటామన్న తేజస్వి



రాంచీ: దాణా కుంభకోణం కేసులో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు సీబీఐ కోర్టు మూడున్నరేళ్ల జైలు శిక్ష.. రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. సీబీఐ రెండో కేసులో పేర్కొన్న రూ.89.27 లక్షల దాణాకుంభకోణంలో లాలూతో పాటు మరో ఏడుగురికి న్యాయస్థానం శిక్షఖరారు చేసింది. మరో ఏడుగురికి కూడా మూడున్నరేళ్ల జైలుతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించింది. గడువులోపు జరిమానా కట్టకుంటే నిందితులందరికీ మరో ఆరునెలల జైలు శిక్షపెరుగుతుందని న్యాయమూర్తి శివపాల్ సింగ్ ప్రకటించారు. నిందితుల్లో పూల్ చంద్,మహేష్ ప్రసాద్, బేక్ జూలియన్,సునిల్ కుమార్, సుశీల్ కుమార్, సుధీర్ కుమార్,రాజారామ్ ఉన్నారు. శిక్ష ఖరారు సందర్భంగా న్యాయమూర్తి నిందితుల నుద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. వీళ్లందరికీ ఓపెన్ జైలు సరిపోతుంది. ఎందుకంటే ఇంతకు ముందు వీళ్లకు ఆవులను పెంచిన అనుభవం ఉంది. అని వ్యాఖ్యానించారు.

న్యాయ వ్యవస్థపై నమ్మకముంది.. నాన్నకు బెయిల్ వస్తుంది..

లాలూ ప్రసాద్ యాదవ్ కు న్యాయస్థానం శిక్ష ఖరారు చేసిన తర్వాత ఆయన కుమారుడు బీహార్ మాజీ మంత్రి తేజస్వి యాదవ్ స్పందించారు. తమకు న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉందని..హైకోర్టులో లాలూకు బెయిల్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీబీఐ న్యాయస్థానం తీర్పుతో తాము నిరాశ చెందడం లేదని చెప్పుకొచ్చారు. లాలూకు లాలూకు మూడు నుంచి నాలుగేళ్ల జైలు శిక్ష పడితే త్వరగానే బెయిల్ మంజూరు అవుతుందని న్యాయనిపుణులు పేర్కొంటున్న నేపథ్యంలో హైకోర్టులో తన తండ్రికి బెయిల్ వస్తుందని తేజస్వి ధీమాగా ఉన్నారు.కేసు విచారణ సందర్భంగా లాలూ..న్యాయమూర్తికి వేడుకోలు చేసిన విషయం విదితమే.. దాణా కుంభకోణంలో ప్రత్యక్షంగా తన పాత్ర ఏమీ లేదని..తనపై దయతలచి శిక్షను తగ్గించాలని వేడుకున్నారు.తన ఆరోగ్యం, వయస్సు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని శిక్ష తగ్గించాలని లూలూ కోరారు. అయినా న్యాయమూర్తి లాలూపై కనికరం చూపకుండా మూడున్నరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించారు.

ఇదీ కేసు

1991-1994 మధ్య లాలూ బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన ఈ దాణాకుంభకోణం 1997 లో వెలుగులోకి వచ్చింది. పశువుల దాణా కొనుగోళ్లలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు రావడంతో లాలూసహా మరికొందరిపై కేసు నమోదైంది. దీంతో ముఖ్యమంత్రి పదవికి లాలూ రాజీనామా చేసి తన భార్య రబ్రీదేవిని సీఎంగా చేశారు. దాణా కుంభకోణానికి సంబంధించి మొత్తం ఐదు కేసులు నమోదు కాగా ప్రస్తుతం మూడు కేసులు పెండింగ్ లో ఉన్నాయి. తాజాగా తీర్పు వెలువరించిన కేసు 1994-1996లో లాలూ దేవ్‌గఢ్ జిల్లా ట్రెజరీ నుంచి 89 లక్షల 27వేల రూపాయలను అక్రమంగా విత్ డ్రా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందులో మొత్తం 38మందిపై కేసులు నమోదుకాగా వారిలో 11 మంది విచారణ సమయంలో మృతి చెందారు. ముగ్గురు అప్రూవర్లుగా మారారు. మరో ఇద్దరు నేరాన్ని ఒప్పుకోవడంతో 2006లో శిక్ష పడింది.ఇటీవల లాలూ సహా 15మంది దోశులుగా తేలగా..మరో ఏడుగురు నిర్దోషులుగా న్యాయస్థానం స్పష్టం చేసింది.

దాణా కుంభకోణం కేసు గ్రాఫిక్స్

దాణా కుంభకోణం కేసులో రాంచి సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం లాలూ ప్రసాద్ యాదవ్ కు మూడున్నరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా విధించింది. దేవగఢ్ ట్రెజరీ నుంచి రూ.89.27 లక్షల మోసపూరితంగా విత్ డ్రా చేసినందుకుగాను కోర్టు ఈ శిక్ష ఖరారు చేసింది. చైబాసా ట్రెజరీ నుంచి రూ. 37.7 కోట్లు మోసపూరితంగా విత్ డ్రా చేసినందుకు 2013లోనే న్యాయస్థానం లాలూని దోషిగా తేల్చింది. 21 ఏళ్లనాటి దాణా కుంభకోణం కేసులో మొత్తం 64 మందిపై కేసులు నమోదు కాగా.. 56 మంది నిందితులుగా న్యాయస్థానం తేల్చింది.

సామాజిక న్యాయం కోసం సంతోషంగా చనిపోతా:లాలూ

లాలూకు శిక్ష ఖరారైన తర్వాత ఆయన అధికారిక ట్విట్టర్ ఖాతా నుంచి బీజేపీని ఉద్దేశించి ట్వీట్ చేశారు. మమ్మల్ని అనుసరించండి.లేదంటే మేం ఫిక్స్ చేస్తాం. అనేది వారి తత్వం. సామాజిక న్యాయం, సమానత్వం, సామరస్యం కోసం నేను సంతోషంగా మరణిస్తాను. అని లాలూ వ్యాఖ్యానించినట్లు ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

మీసా భారతిపై ఈడీ రెండో చార్జ్ షీట్


ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కు దాణా కుంభకోణంలో రాంచీ సీబీఐ కోర్టు మూడున్నరేళ్ల జైలు శిక్ష విధించిన రోజే ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆయన కుమార్తె మీసా భారతి, అల్లుడు శైలేష్ కుమార్ లపై ఢిల్లీ కోర్టులో రెండో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. మనీలాండరింగ్ కు సంబంధించిన కేసులో ఈ చార్జ్ షీట్ దాఖలైంది. గత నెల 23న దాఖలు చేసిన చార్జ్ షీట్‌తోపాటు తాజా చార్జ్‌షీట్‌పై ఫిబ్రవరి 5న న్యాయస్థానం విచారణ జరిపే అవకాశం ఉంది. అయితే ఈ కేసులో వెంటవెంటనే రెండు చార్జ్‌షీట్‌లు దాఖలు చేయడంపై ఈడీపై న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ కేసులో విచారణ ప్రారంభమౌతుందా.. మీరు ఇంకా చార్జ్ షీట్లు దాఖలు చేస్తూనే ఉంటారా.. ఇంకెన్నీ అదనపు చార్జ్ షీట్లు దాఖలు చేస్తారు. ఈడీ అంటే ప్రధాన దర్యాప్తు సంస్థ. కానీ మీరు అలా నడుచుకోవడం లేదు. అని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. దక్షిణ ఢిల్లీలోని బిజ్వాసన్ ప్రాంతంలో మీశైల్ పాకర్స్ అండ్ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఉన్న ఫాం హౌస్ ను ఈడీ సీజ్ చేసింది. 2008-09 సంవత్సరంలో దీని కొనుగోలు కోసం కోటి 20 లక్షల మనీలాండరింగ్ చేశారని ఈడీ ఆరోపించింది. డొల్లకంపెనీలకు కోట్లలో నగదును బదిలీ చేశారని మీసా భారతి, ఆమె భర్తపై ఈడీ కేసులు నమోదు చేసింది. ఈ కేసులో సురేంద్రకుమార్ జైన్,వీరేంద్ర కుమార్ జైన్ అనే వారిద్దరి నివాసాలు, ఆఫీసుల్లో దాడులు నిర్వహించి మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద వారిని అరెస్ట్ చేసింది.వారితో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన చార్టర్డ్ అకౌంటెంట్ రాజేష్ అగర్వాల్ ను కూడా ఈడీ అరెస్ట్ చేసింది.

దాణా కుంభకోణం కేసు టైం లైన్

జనవరి 1996: చైబసా డిప్యూటీ కమిషనర్ పశుసంవర్థక శాఖలో సోదాలతో వెలుగులోకి దాణా కుంభకోణం
మార్చి 1996: లాలూ ప్రసాద్ యాదవ్ పై సీబీఐ చార్జ్‌షీట్
జూలై 1997: బీహార్ సీఎం పదవికి లాలూ రాజీనామా.. సీబీఐ ముందు లొంగుబాటు, జ్యుడిషియల్ కస్టడీకి లాలూ
ఏప్రిల్ 2000: కేసులో లాలూ భార్య రబ్రీదేవి పేరు
అక్టోబర్ 2001: కేసును జార్ఖండ్ హైకోర్టుకు మార్చిన సుప్రీంకోర్టు
ఫిబ్రవరి 2002: సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ ప్రారంభం
డిసెంబర్ 2006: ఆస్తుల కేసులో లాలూ, రబ్రీదేవి నిర్దోషులుగా తేల్చిన కిందిస్థాయి కోర్టు
మార్చి 2012: లాలూ, జగన్నాథ్ మిశ్రాలపై ఛార్జ్‌షీట్లు
సెప్టెంబర్ 2013: లాలూ, జగన్నాథ్ మిశ్రా సహా 45 మందిని దోషులుగా తేల్చిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం
డిసెంబర్ 2013: లాలూకు సుప్రీంకోర్టులో బెయిల్
మార్చి 2014: లాలూపై ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం
మార్చి 2017: సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ ప్రారంభం
డిసెంబర్ 2017 : లాలూతో పాటు 15 మందిని దోషులుగా తేల్చిన సీబీఐ కోర్టు, జైలుకు తరలింపు
జనవరి 6,2018: లాలూకు మూడున్నరేళ్ల జైలు శిక్ష

ఇమ్రాన్‌కు మళ్లీ పెళ్లి

మూడో వివాహంపై పాక్ వార్తా కథనాలు



ఇస్లామాబాద్: పాకిస్తాన్ విపక్ష నేత, మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ తనకు ఆధ్యాత్మిక సలహాలు ఇచ్చే ఒక మహిళను వివాహం చేసుకున్నారని పాకిస్తాన్‌కు చెందిన ఓ దినపత్రిక శనివారం తెలిపింది. జనవరి ఒకటవ తేదీ రాత్రి లాహోర్‌లో మూడవ వివాహం అన్నట్టుగా ఆమెను పరిణయమాడిన పాకిస్తాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ ఛైర్మన్ ఇమ్రాన్ ఖాన్ అక్కడి నుంచి నేరుగా ఇస్లా మాబాద్ వెళ్ళి ఉగ్రవాద వ్యతిరేక న్యాయస్థానం ఎదు ట హాజరయ్యారని పేర్కొం ది. కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసిందని తెలి పింది. పార్టీ కోర్ కమిటీ సభ్యుడు ముఫ్తీ సయీద్ నిఖా నిర్వహించారని తెలిపింది. వధువు ప్రభుత్వ ఉద్యోగి అయిన భర్తతో విడాకుల కోసం కొద్ది మాసాల క్రితం దరఖాస్తు చేసిందని సదరు దినపత్రిక పేర్కొంది. అయితే వివాహం జరిగినట్టుగా వార్తలను ఖాన్ రాజకీయ కార్యదర్శి ఆన్ చౌద్రీ, పార్టీ అధికార ప్రతినిధి నయీమ్ ఉల్ హక్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఇమ్రాన్‌కు ఇది మూడవ వివాహం. మొదటగా ఆయన 1995, మే 16న జెమిమా గోల్డ్ స్మిత్‌ను వివాహం చేసుకున్నారు. తొమ్మిదేళ్ల తర్వాత 2004, జూన్ 22న ఆమెతో విడాకులు పొందారు. ఆ తర్వాత టీవీ యాంకర్ రెహమ్‌ఖాన్‌ను ద్వితీయ వివాహం చేసుకున్నారు. అయితే ఆ వివాహం బంధం పట్టు మని 10 నెలలు కూడా నిలబడలేదు.

ఒకే చోట రజనీ, కమల్

● చిరునవ్వులతో కరచాలనం ● వేదిక కౌలాలంపూర్ ● సినీతారల వేడుకలో సందడి ● తమిళ రాజకీయాల్లో అలజడి



కౌలాలంపూర్: ఒకరు గత కొద్ది కాలంగా సామాజిక మాధ్యమాలపై రాజకీయ దుమారం రేపుతుంటే మరొకరు ఆధ్యాత్మిక రాజకీయాలకు నాంది పలుకు తున్నట్టుగా గతేడాది చివరి రోజున రాజకీయ ఆరంగేట్రం ప్రకటించారు. వారే అంతర్జాతీయంగా పేరుగడించిన తమిళ సినీనటులు కమల్ హాసన్, రజనీకాంత్. ఇద్దరూ ఒకే వేదికను పంచుకున్న అరుదైన ఘట్టం శనివారం కౌలాలంపూర్‌లో ఆవిష్కృతమైంది. అభిమానులను సంబరాల్లో ముంచెత్తింది. ఇది తమిళనాట రాజకీయాల్లో కొత్త సమీకరణకు నాంది పలుకుతుందా అన్న సందేహాలను లేవనెత్తింది. నచ్చతిర విళా 2018 పేరిట సినీతారల వేడుక స్థానికంగా ఒక స్టేడియంలో మొదలైంది. ఆ కార్యక్రమానికి రజనీకాంత్, కమల్ హాసన్ ఒకే హెలికాప్టర్‌లో స్టేడియానికి చేరుకున్నారు. కిందకు దిగిన తర్వాత ఒక గోల్ఫ్ కార్ట్‌లో కొద్ది దూరం ప్రయాణించారు. అభిమానుల ఆనందోత్సహాలు, ఘన స్వాగతం నడుమ ఇరువురు వేదికపై నవ్వుతూ కరచాలనం చేసుకున్నారు. గత నెల 31న రాజకీయాల్లోకి వస్తున్నట్టు అభిమానుల సమక్షంలో రజనీకాంత్ ప్రకటించగా, కమల్ హాసన్ సైతం అతి త్వరలో రజనీ బాట పట్టవచ్చనే వార్తలు తమిళనాట వినిపిస్తున్నాయి. ఈ మేరకు కమల్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చా రు. కౌలాలంపూర్‌లో రెండు రోజు లపాటు జరిగే నచ్చతిర విళా 2018 వేడుకను మాలిక్ స్ట్రీమ్స్ కార్ప్, మైఈ వెంట్స్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో సౌత్ ఇండియా ఆర్టిస్టుల అసోసియేషన్ నిర్వహిస్తున్నది.

పీసీసీ అధ్యక్షుల కొనసాగింపు

● కాంగ్రెస్ అధినేత రాహుల్ నిర్ణయం ● కొత్తవారి ఎంపికపై పూర్తి కాని కసరత్తు!

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులను యథావిధిగా కొనసాగించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నిర్ణయించారు. వీరితో పాటు రీజినల్, టెరిటోరియల్ అధ్యక్షులను కూడా కొనసాగించనున్నారు. సంస్థాగత ఎన్నికల పూర్తయినప్పటికీ ఇంకా అధ్యక్షుల మార్పుపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కొత్త అధ్యక్షులను నియమించేంతవరకు పాత వారే అధ్యక్ష పదవుల్లో కొనసాగుతారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేదీ ఓ ప్రకటనలో వెల్లడించారు.

నిజానికి రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత అన్ని రాష్ట్రాలకు నూతన అధ్యక్షులను నియమించాల్సి ఉంది. అయితే కొత్త అధ్యక్షుల ఎంపికపై కసరత్తు ఇంకా పూర్తి కాలేదు. ఆయా రాష్ట్రాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితుల ఆధారంగా సమర్థత కలిగిన యువ నాయకులను ఎంపిక చేయాలని రాహుల్ ఆలోచిస్తున్నారు. ఈ దిశగా రాహుల్ కార్యాలయం ఇప్పటికే పలువురు నాయకులను ఢిల్లీకి పిలిపించి వారితో రాహుల్‌గాంధీ నేరుగా మాట్లాడుతున్నారు.

రేపటి నుంచి అఖిల భారత విప్‌ల సదస్సు

జైపూర్: జనవరి 8నుంచి 18వ అఖిల భారత విప్‌ల సమావేశాలు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్లో జరగనున్నాయి. ఈ సమావేశాలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ ప్రారంభించనున్నారు. ఆయా రాష్ట్ర శాసనసభల్లో, పార్లమెంటులో పేపర్ రహిత పనితీరు, డిజిటల్ విధానంపై చర్చించనున్నారు. దేశవ్యాప్తంగా పలు రాజకీయ పార్టీలకు చెందిన విప్‌లు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో పార్లమెంటు, శాసనసభల్లో అత్యంత ప్రభావిత పనితీరుపై విప్‌లు పలు సూచనలు చేయనున్నారు. ఈ విప్‌ల సదస్సులో అజెండా ప్రకారం ఈ.విధానంపై చర్చించనున్నారు. విప్‌లు ఆయా రాజకీయపార్టీ సభ్యులుగా ఉంటూనే పార్టీలో క్రమశిక్షణకు కృషి చేస్తారు.

అఖిల భారత డీజీల సదస్సును ప్రారంభించిన కేంద్ర హోంమంత్రి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వివిధ రాష్ట్రాల డీజీపీ, బీఎస్ఎఫ్ అకాడమీ ఐజీపీల జాతీయ సమావేశం మధ్య ప్రదేశ్ గ్వాలియర్ జిల్లా టెకన్‌పూర్‌లో శనివారం ప్రారంభమైంది. కేంద్ర హోంమంత్రి ఈ సమావేశాన్ని ప్రా రంభించగా.. ప్రధాని నరేంద్రమోడీ ముగింపు సమావేశంలో పాల్గొ నను న్నారు. ఈ సమావేశంలో కేంద్ర సాయుధ బలగాలైన బీఎస్ఎఫ్, సీఐ ఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ తదితర సంస్థల నుంచి 250 మంది అధికారులు పాల్గొన్నారు. 2014లో గౌహతి, 2015లో గుజరాత్, 2016లో హైద రాబాద్‌లో ఈ సదస్సు నిర్వ హిం చగా, మిగతా అన్ని సమావేశాలు ఢిల్లీ లోనే నిర్వహిస్తూ వచ్చారు. టెకన్‌పూర్‌లోని బీఎస్ఎఫ్ అకాడమీలో సోమవారం వరకూ ఈ సమావేశం నిర్వహిస్తారు.

నిర్లక్ష్యం వల్లే కమలామిల్స్‌లో అగ్నిప్రమాదం

ముంబై: కమలామిల్స్ అగ్నిప్రమా దానికి సంబంధించిన నివేదికను అ గ్నిమాపకశాఖ అధికారులు ఉన్నతా ధికారులకు సమర్పించారు. గత నెలముంబైలో జరిగిన మోజో బిస్ట్రో రెస్టారెంటులో తొలుత అగ్నిప్రమాదం జరిగి అనంతరం మంటలు వన్ అబౌ రెస్టారెంటుకు వ్యాపించాయని అధి కారులు తెలిపారు. రెండు రెస్టా రెంట్లలో నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం సరఫరా చేశారన్నారు. ఈ ప్ర మాదం మానవ తప్పిదమే వల్లే జరి గిందని అధికారులు తమ నివేదికలో వెల్లడించారు.

బడ్జెట్‌పై ప్రధాని మోడీ ముద్ర

● పీఎంవోలో గంటల తరబడి సమావేశాలు ● ఉన్నతాధికారులతో కలిసి సమావేశాల్లో మోడీ ● ఎన్నికల బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలకు ఛాన్స్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఎన్నికలకు ఏడాది ముందు ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్ పై ప్రధానమంత్రి తనదైన ముద్ర వేయనున్నారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్టీ తర్వాత ఆర్థిక వృద్ధి మందగించి నిరుద్యోగం ప్రబలుతున్న నేపథ్యంలో దానిని అధిగమించే దిశగా పలు చర్యలు ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది. ఎన్నికల బడ్జెట్ కావడంతో పలు ప్రజాకర్షక పథకాలు ప్రతిపాదించే అవకాశముందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయంతో పాటు గ్రామీణ రంగానికి పెద్దపీట వేసే అవకాశముందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో స్వయంగా ప్రధాని మోడీయే బడ్జెట్ సమావేశాల్లో పాల్గొని ఉన్నతాధికారులకు సూచనలు చేస్తున్నారు. ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్ననేపథ్యంలో బడ్జెట్‌కు ప్రధాని మెరుగులు దిద్దుతున్నారు. ఉన్నతాధికారులతో గంటల తరబడి సమావేశాల్లో పాల్గొని తన ఆలోచనలను వారితో పంచుకుంటున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం అధికారులు, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు బడ్జెట్‌పై ఆయా వర్గాలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. ప్రధానమంత్రి కార్యాలయం ప్రోయాక్టివ్ పాత్ర పోషించడం వల్ల బడ్జెట్‌ను ప్రధానమంత్రి ఆలోచనలకు అనుగుణంగా రూపొందించే అవకాశముంటుందని ఆర్థికశాఖ అధికారులుచెపుతున్నారు. నిజానికి ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి బడ్జెట్ రూపకల్పన సమావేశాల్లో గంటల తరబడి సమావేశాల్లో పాల్గొనరు. అయితే వచ్చే ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో ప్రధాని, ఆయన కార్యాలయం దీనిపై ఫోకస్ చేసింది. వినూత్నమైన ఆలోచనలతో పథకాలను ప్రతిపాదించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ తన మంత్రివర్గ సహచరులను కోరుతున్నారు. గతంలోనూ సైతం బడ్జెట్, గత పథకాలకు , భవిష్యత్ పనికి లింక్‌గా ఉండాలని ప్రధాని సూచించారు.

గతంలోనూ బడ్జెట్ సమావేశాల్లో ప్రధానమంత్రి పాల్గొన్నప్పటికీ, ఈసారి నేరుగా ప్రధాని కార్యాలయంలోనే గంటల తరబడి బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధానమంత్రి నేరుగా బడ్జెట్ సమావేశాలకు హాజరుకావడం వల్ల ఆయన సూచనలకు అనుగుణంగా మరింత స్పష్టంగా బడ్జెట్ రూపొందించే అవకాశముంటుందని అధికారవర్గాలు అభిప్రాయపడ్డాయి.

ఈ సారి బడ్జెట్‌లో ప్రధానంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, వ్యవసాయ సంక్షోభ నివారణ, ప్రైవేట్ పెట్టుబడులపై ప్రధానమంత్రి మోడీ ద ష్టి సారించినట్లు అధికార వర్గాలు చెపుతున్నాయి. వచ్చే వారంలో దేశ ఆర్థిక స్థితిపై ఆర్థికనిపుణులతో ప్రధాని సమావేశం కానున్నారని తెలిసింది. పిఎం ఎకనమిక్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులతో సమావేశం జరిగే అవకాశం ఉంది. పెద్దనోట్ల రద్దు, జిఎస్టీ తర్వాత జిడిపి పడిపోయిన నేపథ్యంలో ఆర్థికవ ద్ధి వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలు ప్రతిపాదిం చే అవకాశముంది.

కులాల కార్చిచ్చును ఆర్పేదెలా?

● బీజేవైఎం పదాధికారుల సమావేశంలో మేధోమథనం ● సమాజాన్ని చిల్చే శక్తులను తిప్పికొట్టాలని అధినేతల ప్రభోదం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వివిధ సామాజిక వర్గాలు, కులాల మధ్య చిచ్చు పెడుతున్న కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలను తరిమికొట్టాలని భారతీయ జనతా యువ మోర్చాకు బీజేపీ అధిష్టానం పిలుపునిచ్చింది. ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన 'బీజేవైఎం రాష్ట్రీయ పదాధికారి బైఠక్'లో దేశవ్యాప్తంగా రోడ్డెక్కిన కులాల ఆందోళనలపై ప్రధానంగా చర్చించారు. తాజాగా మహారాష్ట్రలో దళితులు, బ్రాహ్మణుల మధ్య తలెత్తిన ఘర్షణలపై బీజేపీ ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. అంతకంటే ముందు గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పటేల్ సామాజికవర్గాన్ని, దళితులను రెచ్చగొట్టి బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేసింది. బీజేపీని దళిత వ్యతిరేకిగా, మైనారిటీ వ్యతిరేకిగా తరచుగా కాంగ్రెస్ పార్టీ పేర్కొంటోంది. ఈ ప్రచారం బీజేపీ విజయావకాశాలను దెబ్బతీస్తుందని పార్టీ అధినేతలు గ్రహించారు. ముఖ్యంగా యువతరమే ఈ తరహా ప్రచారాన్ని నమ్ముతోందని, వారి ద్వారా మిగతా వర్గాలు సైతం ప్రభావితమవుతున్నాయని గుర్తించారు. అందుకే దిద్దుబాటు చర్యల్లో భాగంగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల ఉచ్చులో యువతరం పడకుండా అడ్డుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం పార్టీ యువజన విభాగం బీజేవైఎంను రంగంలోకి దింపాలని పార్టీ అధినేతలు నిర్ణయించారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి బీజేవైఎం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను హస్తినకు పిలిపించి పార్టీ ప్రధాన కార్యదర్శులు వారందరికీ దిశానిర్దేశం చేశారు. యువతరాన్ని, విద్యార్థులను ప్రభావితం చేసేలా కార్యక్ర మాలు రూపొందించాలని, ఆ మేరకు యూనివర్సిటీల్లో తమ పట్టు పెంచాలని సూచించారు. కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా ప్రయోజనం పొందాలని చూస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల వైఖరిని బయటపెట్టాలని, ఆ రెండు పార్టీలను సమాజ విద్రోహ పార్టీలుగా పేర్కొంటూ ప్రచారం చేయాలని పదాధికారులకు సూచించినట్టు సమాచారం.

రాష్ట్రీయ పదాధికారి బైఠక్ ముగిసిన తర్వాత ఆంధ్రప్రదేశ్ యువమోర్చా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలపై విరుచుకు పడ్డారు. ఆ రెండు పార్టీలూ జే.ఎన్.యూలోని దేశద్రోహులతో చేతులు కలిపి కులాల మధ్య చిచ్చుపెడుతున్నాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సమాజంలోని అన్ని వర్గాల ఆదరణ పొందుతూ అత్యంత బలమైన రాజకీయ శక్తిగా ఎదిగిన బీజేపీని ఎదుర్కోలేక, కులాల మధ్య చిచ్చుపెట్టి ప్రయోజనం పొందాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. అందుకే ఉమర్ ఖాలిద్ వంటి దేశద్రోహులను, జిగ్నేష్ మేవానీ వంటి కుల నేతలను ప్రోత్సహిస్తూ వారి ద్వారా హింసాత్మక ఆందోళనలు చేయిస్తున్నారని విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అధికారాన్ని మళ్లీ నిలబెట్టుకుంటూ, అధికారంలో లేని రాష్ట్రాల్లో గెలుపొంది ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తూ దూసుకుపోతున్న బీజేపీని చూసి కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఓర్వలేకపోతున్నారని అన్నారు.


Andhraprabha business 2017
బిజినెస్ BUSINESS

ఎలక్ట్రిక్ కార్లు ఇప్పట్లో రానట్లే..

•2030 సంవత్సరం గడువు సడలింపు • భారత్ స్టేజ్-6 వాహనాల ఉత్పత్తిపై దృష్టి

న్యూఢిల్లీ: దేశంలో 2030 నాటికి అన్ని ఎలక్ట్రిక్ కార్లే ఉండాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఇటీవల సడలించడంతో కార్ల ఉత్పత్తి కంపెనీలు భారత్ స్టేజ్-6 ఉత్పత్తులపై తమ దృష్టిని కేంద్రీకరించనున్నాయి. ఈ నిర్ణయం దేశీయ మార్కెట్లో కార్ల అమ్మకాలను డిసెంబర్‌లో భారీగానే పెంచింది. డిసెంబర్‌లో అమ్మకాల్లో 7 శాతం వృద్ధి నమోదైంది. భారత్ స్టేజ్-6 వాహనాలు భారత మార్కెట్‌లోకి 2020లో రానున్నాయి. ఇటీవల పార్లమెంట్‌లో భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి బాబుల్ సుప్రియో ఈ విషయంపై ఒక ప్రకటన చేస్తూ.. 2030 నాటికి దేశంలో అన్నీ ఎలక్ట్రిక్ కార్లే ఉండాలన్న నిబంధన తేవాలన్నదానిపై ప్రభుత్వాని కి ఎటువంటి ప్రణాళిక లేదని స్పష్టం చేశారు. అటోమొబై ల్ పరిశ్రమ కాలుష్య రహితంగా ఉండేందుకు, ప్రత్యా మ్నాయ ఇంధన వనరుల వినియోగం, క్రూడాయిల్ దిగుమతులను తగ్గించటం లక్ష్యంగా 2030 నాటికి దేశంలో అన్ని కార్లు ఎలక్ట్రిక్ కార్లే ఉండాలన్న నిబంధన తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఈ వాదనను మరో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మద్దతు తెలిపారు. కియా

కియా మోటార్స్‌కు కొత్త ఎండి



కియా మోటార్స్ ఇండియ (కెఎంఐ) కూక్యూన్ షిమ్ ను చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీస ర్, మేనేజింగ్ డైరెక్ట ర్‌గా నియమించింది. 2019 రెండవ అర్ధ సంవత్స రంలో కియా కంపెనీ స్థానికంగా ఉత్పత్తిచేసిన కారును మార్కెట్‌లోకి తేనుంది. దేశంలో కియా మార్కెట్‌ను విస్తరించేందుకు షిమ్ కీలక పాత్ర నిర్వహించనున్నట్లు కంపెనీ పేర్కొంది. కియా తొలి మానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణం పర్యవేక్షణ నుకూడా షిమ్ చేపడతారు. భారత్‌లో కియా చేపట్టనున్న మార్కెట్ విస్తరణ ప్రాజెక్టుకు 1.1 బిలియన్ డాలర్లు వెచ్చించనుంది.



డిసెంబర్లో కార్ల అమ్మకాల్లో 7% వృద్ధి

మారుతి సుజుకి, టాటా మోటార్స్, హోండా మినహా మిగతా కార్ల తయారీ కంపెనీలు తమ ఉత్పత్తుల అమ్మకాలు తగ్గాయని ప్రకటించాయి. కొత్త సంవత్సరం ప్రారంభకాను న్నందున డీలర్లు కొత్త స్టాకును తీసుకోవడాని కే మొగ్గు చూపారని కంపెనీలు ప్రకటించాయి. 98 శాతం ప్యాసింజర్ కార్ల మార్కెను ఏడు కంపెనీలు ఆక్రమిస్తు న్నాయి. గత నెలతో పోలిస్తే డిసెంబర్‌లో అమ్మకా ల్లో వృద్ధి 7 శాతం నమోదు చేసుకున్నాయి. డిసెంబర్ 2017లో అమ్మకాలు 2.17 లక్షయూనిట్లు అమ్ముడు పోగా, 2016 ఇదే నెలలో అమ్మకాల సంఖ్య 2.02 లక్షయూనిట్లుగా ఉంది.

2017లో లగ్జరీ కార్ల అమ్మకాలు పెరిగాయి

గత ఏడాదిలో జీఎస్టీ ప్రారంభించనున్నామని ప్రభుత్వం ప్రకటన రావడంతో లగ్జరీ కార్ల ప్రియులు ఎక్కడ ధరలు పెరుగుతాయోనన్న భయంతో వాటి కొనుగొళ్లకు ఎగపడ్డారు. ఈ విభాగం 38,700 యూనిట్ల అమ్మకాలను నమోదు చేసుకుంది. ఈ విభాగంలో కార్లను ఉత్పత్తి చేస్తున్న ఆరు కంపెనీలు అమ్మకాల్లో 15 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి.

టాటా మోటార్స్ వెస్ట్‌పోర్ట్‌తో భాగస్వామ్య ఒప్పందం

TATA Tata Motors limited



వ్యాపార అవసరాలకు ఉపయోగించే వాహనాలను ఉత్పత్తి చేసే ప్రముఖ భారత సంస్థ టాటా మోటార్స్ కెనడాకు చెందిన వెస్ట్‌పోర్ట్ ఫ్యూయల్ సిస్టంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా టాటా మోటార్స్ తన సిఎన్‌జీ ట్రక్కులు, బస్సులకు అవసరమైన భారత్ స్టేజ్ 6 ఇంజన్ల అభివృద్ధిచేసి వెస్ట్‌పోర్ట్ కంపెనీ సరఫరాచేస్తుంది. ఈ అభివృద్ధి, సరఫరా ఒప్పందం.. నాలుగు సిలిండర్లు, ఆరు సిలిండర్లున్న సహజ వాయవుతో మండించే వాణిజ్య వాహనాల కుటుంబానికి పరిమితమవుతుంది. కాగా, డీజిల్ వాహనాలకు సంబంధించి ముంబైకి చెందిన కంపెనీ భారత్ 6 ఇంజన్లను టాటాకు సరఫరా చేస్తుంది.

దివాళ కంపెనీలకు
మ్యాట్ నిబంధనలు సడలింపు

Central Board of Direct Taxes

న్యూఢిల్లీ: రుణాలను తిరిగి చెల్లించడంలో విఫలమై దివాళ పరిస్థితులకు దగ్గరైన కంపెనీలకు ఊరటనిచ్చే ప్రకటనను ఆదాయ పన్ను శాఖ శనివారం ప్రకటించింది. సదరు కంపెనీలపై కనీస ప్రత్యామ్నాయ పన్ను(ఎంఏటీ) విధింపు పరిమితిని సడలించింది. ఇన్‌కం టాక్స్ చట్టం సెక్షన్ 115జెబి ప్రకారం బుక్ ప్రాఫిట్ నుంచి నష్టాలను లేదా ఆదాయంలో కలపని తరుగుదలను తీసివేసిన తర్వాత ఏది తక్కువైతే దానిపై పన్ను విధించనున్నట్లు సిబిడిటి వెల్లడించింది. ఈ చట్టం వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. 'ఏదైనా కంపెనీ కార్పొరేట్ దివాళ దరఖాస్తు తీర్మాన ప్రక్రియ ఐబిసి అధికార మండలి పరిశీలించి అంగీకరించినప్పుడే ఈ నిబంధన వర్తిస్తుంది. తరుగుదలతో కలిపి మొత్తం నష్టంను బుక్ ప్రాఫిట్ నుంచి తీసివేసిన తర్వాత మ్యాట్ నిబంధనను వర్తింపచేయటం జరుగుతుంది' అని సబిడిటి(కేంద్ర ప్రత్యక్షపన్నుల బోర్డు) ప్రకటించింది. తాజా సడలింపు నిజమైన కష్టాలను ఎదుర్కొంటున్న కంపెనీలకు ఉపకరిస్తుందని సిబిడిటి తెలిపింది. ఈ తరహా కంపెనీలకు రుణాలిచ్చిన సంస్థలు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ కింద దివాళ, రుణాల ఎగవేత కింద కేసులను దాఖలు చేయాలని కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో సిబిటిడి మ్యాట్ సడలింపు వీటికి కొంత ఊరట నిస్తాయని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్, ఇండస్ ఇండియా బ్యాంక్‌తో ఒప్పందం



న్యూఢిల్లీ: ఇండస్ ఇండియా బ్యాంకుతో భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లుగా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ శనివారం ప్రకటించింది. వినియోగ దారుల బ్యాలెన్స్ నిలువలు లక్షరూపాయలు మించితే వారికి ఫిక్సిడ్ డిపాజిట్ సౌకర్యాన్ని కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఎండి, సీఈవో రేణుసత్తి చెప్పారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ వినియోగదారులు తక్షణమే తమ డిపాజిట్లను రీడీమ్ చేసుకోవచ్చని తెలిపింది. దీనికి వారు ఎటువంటి ఛార్జీలు కాని చెల్లించనవసరంలేదని స్పష్టం చేసింది. ఈ డిపాజిట్లపై 6.85శాతం ఏటా వడ్డీని ఇవ్వనున్నట్లు పేటీఎం తన ప్రకటనలో వెల్లడించింది. ఎఫ్‌డీలు కొనసాగే సమయంలో వినియోగదారులు వయసుపెరిగి సీనియర్ సిటిజన్‌లుగా మారితే.. వారి ఖాతాలు సీనియర్ సిటిజన్ పథకంలోకి అటోమేటిక్ మారుతాయని తెలిపారు. ఆ విధంగా వారు అధిక వడ్డీరేటును పొందుతారని తెలిపింది. భారతీయులు ఎక్కువమంది తమ పెట్టుబడులు సురక్షితంగా ఉండి, ఎక్కువ వడ్డీ రావాలని కోరుకుంటారు. వారి ఆశలను మా టైఅప్ తీరుస్తుంది. ఇందుకోసం వినియోగదారులు ఎటువంటి పేపర్ వర్క్ రేణుసత్తి చెప్పారు.

ఎన్‌ఏసీఎల్ నిధుల సమీకరణకు సిద్ధం

NACL Industries Limited
(formerly known as 'Nagarjuna Agrichem Limited')
ISO 9001:2015, ISO 14001:2015, OHSAS 18001:2007 Certified Company
NAGARJUNA NACL

న్యూఢిల్లీ: పంట ఉత్పత్తుల వ్యాపా రంలో రైతులకు భద్ర త కల్పించే ప్రముఖ సంస్థ ఎన్ఎసి ఎల్ ఇండస్ట్రీస్ రూ.3వేల కోట్ల నిధుల సమీకరణకు కంపెనీ బోర్డు అంగీకరించిందని ప్రకటించింది. కంపెనీ వృద్ధి ప్రణాళికల్లో భాగంగా ఈ ప్రక్రియకు బోర్డు ఓకే చెప్పిందని పేర్కొంది.

ఎన్ఎసిఎల్ గతంలో నాగార్జున ఆగ్రోకెమ్ లిమిటెడ్‌గాపిలువబడేది. నిధుల సమీకరణ ప్రక్రియ ఫిబ్రవరి 3న ప్రారంభించను న్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ నిధులను కంపెనీ ఉత్పత్తుల ఎగుమతులను అంతర్జాతీయంగా, దేశీయంగా పెంచేందుకు ఉపయోగించనుంది.

టయోటా మాజీ అధ్యక్షుడు టయోడా మృతి



టోక్యో: జపాన్‌కు చెందిన ప్రముఖ అటోమొబైల్ కంపెనీ టయోటా మాజీ అధ్యక్షుడు టయోడా మరణించినట్లు టయోటా కంపెనీ శనివారం ఒక ప్రకటన చేసింది. టయోట కంపెనీ ప్రస్తుత సీఈవో అకి టయోడాకు మరణించిన టయోడా స్వయాన మామయ్య. 88 ఏళ్లున్న టయోడా న్యూమోనియాతో బాధపడుతూ డిసెంబర్ 30న మరణించినట్లు కంపెనీ తెలిపింది. టయోడా, టయోటా అధ్యక్షుడిగా 1992 నుంచి 1995వరకు పనిచేశారు. టయోడా కంపెనీకి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో టయోటాను ఎదురు కంపెనీగా తీర్చి దిద్దారు. ఆయన హయాంలో కంపెనీ ఉత్తర అమెరికాకు విస్తరించింది. ఆయన అంత్య క్రియలు దగ్గరి బంధువుల సమక్షంలో జరిగాయి. కాగా టయోటా కంపెనీ ప్రత్యేక సంతాప కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపింది. టయోడా తండ్రి స్థాపించిన టయోట కంపెనీలో టయోడా 1953లో ప్రవేశించాడు. టయోటా, జనరల్ మోటార్స్ కలసి స్థాపించిన కొత్త సంస్థకు 1984లో టయోడా తొలి అధ్యక్షుడుగా పనిచేశారు. క్యాలిఫోర్నియాలో బేస్‌గా ఉన్న ఈ జాయింట్ వెంచర్‌ను టయోటా ఉత్తర అమెరికాకు విస్తరించింది.

కాంగ్రెస్ చేతికి సీఎస్‌వో అస్త్రం

- వృద్ధి రేటు తగ్గుదల, ప్రభుత్వంపై విమర్శల దాడి
- కేంద్ర గణాంక సంస్థ అంచనాలతో కాంగ్రెస్ దూకుడు
- జీడీపీని విభజన రాజకీయాలుగా అభివర్ణించిన రాహుల్
- మోడీ, జైట్లీ చెప్పినవన్నీ కబుర్లే: చిదంబరం
- అహంకార ప్రధాని, విఫలమైన ఆర్థికమంత్రితో విపత్తు: సూర్జేవాలా

న్యూఢిల్లీ: ఎన్డీఏ ప్రభుత్వ సంస్కరణలపై పదేపదే విమర్శనాస్త్రాలు సంధిస్తున్న కాంగ్రెస్ పార్టీ కేంద్ర గణాంక సంస్థ (సీఎస్‌వో) అంచనాతో మరింత దూకుడు పెంచింది. దేశ ఆర్థిక వృద్ధి రేటు 6.5 శాతానికి పడిపోవడాన్ని ఉటంకిస్తూ..ప్రధాని నరేం ద్రమోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీలే లక్ష్యంగా విమర్శ నాస్త్రాలు సంధిస్తోంది. ప్రభుత్వం సంస్కరణలుగా చెప్పు కుం టున్న జీఎస్టీ, నోట్ల రద్దు వ్యవహారంతోనే జీడీపీ వృద్ధిరే టు నాలుగేండ్ల కనిష్ఠానికి పడిపోయిందని.. తలసారి ఆదా యం గతేడాదితో పోలిస్తే 1.4 శాతం తగ్గి..8.3 శాతంగా నమో దై నందని కేంద్రంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. కాంగ్రెస్ రాహుల్ గాంధీ సహా పలువురు సీనియర్ నాయకులు బీజేపీ టార్గెట్‌గా విమర్శల బాణాలను ఎక్కుపెట్టారు.

మోడీ సర్కార్‌పై చిదంబరం ఫైర్



దేశ జీడీపీ వృద్ధిరేటు నాలుగేళ్ల కనిష్ఠానికి పడిపోయిం దని కేంద్ర గణన సంస్థ (సీఎస్‌వో) ప్రకటించడంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి చిదంబ రం స్పందించారు. మోడీ ప్రభు త్వం తీసుకు న్న నిర్ణయాలతో దేశంలో ఆర్థిక మందగమనం మునుపె న్నడూ లేనివిధంగా తీవ్రస్థాయికి చేరిందని మండిపడ్డారు. పదేపదే అభివృద్ధి మంత్రం జపిస్తున్న మోడీ..ప్రజలకు ఇన్నాళ్లు చెప్పినవన్నీ కబుర్లేనని తేలిపోయిందని విమర్శించారు. ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం అవలం భించిన వైఖరి బీజేపీ అతిపెద్ద వైఫల్యంగా అభివర్ణించారు. కొత్త ప్రాజెక్టుల ప్రకటనలు తగ్గిపోయాయి. తాజా పెట్టుబడులు లేవు. పెద్దనోట్ల రద్దు ప్రభావం నేటికీ ఇన్ ఫార్మల్ సెక్టార్ పై తీవ్రంగా ఉంది. ఉద్యోగాల కల్పన పాతాలానికి పడిపోయింది. తయారీరం గం వృద్ధి దిగజారిపోయింది. వ్యవసా యంపై మునుపెన్న డూ లేనివిధంగా తీవ్ర ప్రభావం పడింది. అని చిదంబరం కేంద్రంపై మండిపడ్డారు.గత నవంబర్ లో 4.88 గా రిటైల్ ద్రవ్యోల్బణం 15 నెలల గరిష్ఠానికి పెరిగిపోయిం దని.. పారిశ్రామిక ఉత్పత్తులు మూడునెలల కనిష్ఠానికి తగ్గిపో యాయని పేర్కొన్నారు. ఇలాగైతే మీరు ఉద్యోగాల కల్పనపై ఇచ్చిన హామీలు ఎలా నెరవేరుస్తా రు.. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని చెప్పిన హామీ లన్నీ ఉత్తుత్తి మాటలేనా అని చిదంబరం మండిపడ్డారు.

నూతన పెట్టుబడులు	13 ఏళ్ల స్థాయికి దిగజారాయి
బ్యాంక్ పరపతి పెరుగుదల	63 ఏళ్ల కనిష్ఠానికి పతనం
ఉద్యోగాల కల్పన	8 ఏళ్ల స్థాయికి పతనం
వ్యవసాయ స్థూల విలువ(జీవీఏ)	1.7 క్షీణత
ద్రవ్యలోటు	8 ఏళ్ల గరిష్ఠానికి చేరిక
నిలిచిపోయిన ప్రాజెక్టులు	సంఖ్యలో పెరుగుదల



జీడీపీ అంటే స్థూల విభజన రాజకీయాలు

సీఎస్‌వో నివేదిక తర్వాత రాహుల్ మరింత దూకుడు పెంచా రు. ప్రధాని మోడీ, కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానా లతో దేశ ఆర్థికరంగం కుదేలైందని రాహుల్ మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం దృష్టిలో జీడీపీ అంటే స్థూల ఆర్థిక వృద్ధి కాదని.. స్థూల విభజన రాజకీయాలని రాహుల్ వ్యాఖ్యా నించారు. మోడీ, జైట్లీపై ట్వీట్టర్ వేదికపై విమర్శనాస్త్రాలు సంధించిన రాహుల్.. రాజకీ యాల పెట్టుబ డిలో మోడీ, జైట్లీ సాధించింది ఇదీ అంటూ ట్విట్టర్ లో ఓ పట్టిక వేశారు. అంటూ కేంద్ర ప్రభు త్వంపై రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు.

central statistical office CSO

మోడీ, జైట్లీ ఆర్థిక జ్ఞానం మరిచారు: సూర్జేవాలా

ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆర్థిక జ్ఞానాన్ని మరిచిపోయారని..ఫలితంగా దేశ ఆర్థిక వృద్ధి రేటు విపత్తులో పడిపోయిందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణ్ దీప్ సూర్జేవాల్ విమర్శించారు. డిమానిటై జేషన్ అనే విపత్తును ప్రధాని మోడీ సృష్టించారని చురకలంచారు. ఆర్థిక మందగమనానికి జీఎస్టీని సరిగ్గాఅమలు చేయకపో వడంమే కారణమని మండిపడ్డా రు. అహంభావి అయిన ప్రధాని, విఫ లమైన ఆర్థికమంత్రి ఆర్థిక జ్ఞా నాన్ని మరిచిపోయారు. దీంతో దేశ ఆర్థికవృద్ధి విపత్తులో పడిపో యిం ది అని సూర్జేవాలా విమర్శిం చారు.

నందన్ నీలేకని బోర్డు తప్పిదాలను సవరించారు

ఇన్ఫీ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బాలక్రిష్ణన్

Infosys®

బెంగళూరు: ఇన్ఫోసిస్ కంపెనీ గత బోర్డు సీఈవోల వేతనాల నిర్ణయంలో చేసిన తప్పును కంపెనీ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని సరిదిద్దారని ఇన్ఫోసిస్ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వి బాలక్రిష్ణన్ అన్నారు. 'నందన్ నీలేకని ఆధ్వర్యంలోని బోర్డు ప్రస్తుత సీఈవో సలీల్ పారేఖ్ వేతనంను ఆయన ప్రతిభకు తగ్గట్టుగా నిర్ణయించారు. అంతేకాక దీర్ఘకాలంలో అతని సేవలను దృష్టిలో పెట్టుకొని చేసిన నిర్ణయం' అని బాలక్రిష్ణన్ మీడియాతో అన్నారు. సీనియర్ మేనేజ్‌మెంట్ వేతనాలు వారి సామర్థ్యాలను బట్టి ఉంటాయి. బోర్డు ఈ విషయాన్ని గమనించి తగిన విధంగా చర్య చేపట్టిందన్నారు. బోర్డు అనుసరిస్తున్న ప్రమాణాలు పెరుగుతున్న షేర్‌హోల్డర్లను దృష్టిలో పెట్టుకొని చేసింది. ఒకవేళ బోర్డు తన విచక్షణమేరకు ప్రక్రియను చేపడితే. ఆ వివరాలను షేర్ హోల్డర్లకు తెలుపాల్సి ఉంటుంది అని బాలక్రిష్ణన్ అన్నారు. ఇన్ఫోసిస్ బోర్డు పారేఖ్ వేతనం ఏడాదికి రూ.6.5 కోట్లుగా నిర్ణయించింది. 2018-19 నాటికి ఇది రూ.9.75 కోట్లుగా పెరిగే అవకాశముంది. గత బోర్డు తప్పుడు నిర్ణయాలు చేసింది. అది ఇన్ఫోసిస్ స్థాపకుల ఉద్దేశాలను సంస్కృతి, విలువలను గుర్తించలేదు. మాజీ సీఈవో విశాల్ సిక్కా వేతనంను ఎటువంటి కారణంలేకున్నా భారీగా పెంచి మిగతా ఉద్యోగుల వేతనాలను స్వల్పంగా పెంచిందని బాలక్రిష్ణన్ గుర్తుచేశారు. క్యాపిటలిజంలో పరిమితిని మించిన అధిక వేతనాలు క్యాపిటలిజంను అర్థంచేసుకోవడంలో సామాన్య ప్రజలు ఇబ్బంది పడతారన్న ఎన్ ఆర్ నారా యణ మూర్తి వ్యాఖ్యలను బాలక్రిష్ణన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక షేర్ హోల్డ ర్‌గా బోర్డును త్వరగా పునర్నిర్మాణం చేయాలని కోరుకుంటున్నట్లు అయన చెప్పారు.

నాలుగు కొత్త కోర్సులు ప్రారంభించనున్న ఐసీఎఐ

కోయంబతూర్: దేశంలో చార్టెడ్ అక్కౌంట్ల కోర్సులను నిర్వహించే ఇన్సిటిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసిఎఐ) త్వరలో కొత్తగా నాలుగు కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఇవి ఐసిఎఐ సభ్యులు, సభ్యులు కాని వృత్తి నిపుణులకు ఉపయోగపడతాయని పేర్కొంది. శనివారం ఈమేరకు వివరాలను ఐసిఎఐ వైస్ ప్రెసిడెంట్ హెచ్. పద్మనాభన్ విలేకరులకు వెల్లడించారు. ఎగ్జిక్యూటివ్ డిప్లొమా ఇన్ బిజినెస్ వాల్యుయేషన్, సెర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఆర్బిట్రేషన్, సెర్టిఫికెట్ కోర్స్ ఇన్ జిఎస్‌టీ, ఎగ్జిక్యూటివ్ డిప్లొమా ఇన్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ ఫర్ ఇంజినీర్స్ అనే కోర్సులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. కంపెనీల ఖాతాల మదింపులు, ఆడిటింగ్ రంగాలు ప్రస్తుత కాలంలో అత్యధిక ప్రాధాన్యతను సంతరించుకున్నాయని, అర్బిట్రేషన్ కోర్సు అధ్యయనం వల్ల వివాదాలను కోర్టు బయటే పరిష్కరించుకోవచ్చని పద్మనాభన్ తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన జిఎస్‌టీ విషయానికి వస్తే పన్ను సంస్కరణల్లో ప్రధానమైనదన్నారు. ఇది నేర్చుకోవడంలవల్ల వ్యాపారంలో సమస్యలను తేలికగా పరిష్కరించుకోవచ్చాన్నారు. తమ సంస్థ ఇటీవల జాతి నిర్మాణ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటోందని, ముఖ్యంగా కేంద్రం చేపట్టిన ఒకే జాతి ఒకే పన్ను, స్వచ్ఛ భారత్ అభియాన్, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నమాని ఆయన తెలిపారు.







హైటెక్స్‌లో ఎలక్ట్రిక్ వెహికల్ రెనవబుల్ ఎనర్జీ ఎగ్జిబిషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైటెక్స్‌లో జరిగిన ఎలక్ట్రిక్ రెనవెబుల్ ఎనర్జీ వాహనాల ప్రదర్శనకు సందర్శకుల నుంచి మంచి స్పందన వచ్చింది. శనివారం హైటెక్స్‌లో ఎలక్ట్రిక్ వెహికల్ రెనవబుల్ ఎనర్జీ ఎగ్జిబిషన్ (ఈవిరెక్స్) పేరుతో ఎలక్ట్రిక్ వాహనాల ప్రదర్శనను ప్రారంభించారు. దక్షిణ భారత దేశంలో తొలిసారి ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనకు సోలార్ విద్యుత్‌తో నడిచే మోటార్ సైకిల్స్, మోపెడ్స్, ఆటోలు, కార్లు, కార్గొలు ఉత్పత్తి చేసే 70కిపైగా కంపెనీలు పాల్గొన్నాయి. కర్బన ఉద్గారాల కాలుష్యం తగ్గించి వావారణానికి మేలు చేసేలక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌కు భారీ స్పందన ఉన్నట్టు ఈవీఆర్ఇఎక్స్ సీఈవో డా.కె.ఎస్.మూర్తి తెలిపారు. శనివారం ప్రారంభమైన ఈ ప్రదర్శన రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. తెలంగాణను కాలుష్య రహింతగా మార్చేందుకు సోలార్ విద్యుత్ వాహనాలు ఉపయోగపడతాయని వారు మీడియాతో అన్నారు. వంద కిలోమీటర్లు సాధారణ వాహనంలో ప్రయాణించాలంటే రెండు లీటర్ల పెట్రోల్ అవసరం . ఇందుకోసం రూ.140 రూపాయల దాక ఖర్చు చేయాల్సివస్తుంది. హైదరాబాద్ వంటి నగరాల్లో ద్విచక్రవాహనం నడిపేందుకు నెలకు నాలుగు వేల రూపాయల దాక పెట్రోల్ కొనుగోలుకే సరిపోతుందని అదే ఎలక్ట్రిక్ వెహికల్ అయితే కేవలం రెండు మూడు వందల రూపాయలతోనే సరిపోతుందని వాహన ఉత్పత్తిదారులు చెబుతున్నారు. విద్యుత్ చార్జింగ్‌తో నడిచే ద్విచక్ర వాహనాలు ప్రస్తుతం రెండు మాడల్స్‌లో లభిస్తున్నాయి. టాటా కంపెనీతో కలిసి అగస్త్యఆటోమోటివ్ కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాన్ని రూపొందించింది. ఈ వాహనం ఆరు గంటలు చార్జింగ్‌తో 350కిలోమీటర్ల దాకనడవనుంది. ఈవిలెరిట్, ఈ2వోకార్లు కూడా ప్రదర్శించారు. సందర్శకులు వీటిని ఆసక్తితో తిలకించి వాటి పనితీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

దుర్గ గుడి ఈవో బదలీ



- క్షుద్ర పూజలు జరగలేదని నివేదికలు?
- మరింత లోతుగా విచారణకు నిర్ణయం
- అందుకే ఈవో సూర్యకుమారికి స్థాన చలనం
- మంత్రి మాణిక్యాలరావు వెల్లడి

అమరావతి, ఆంధ్రప్రభ : ఊహించినట్లుగానే దుర్గ గుడి ఘటనకు సంబంధించి నిర్వహించిన విచారణలో ఆలయంలో క్షుద్రపూజలు జరగలేదని నివేదికలు ప్రాథమికంగా తేల్చినట్లు సమాచారం.ఈ ఘటనతో పాటు పరిపాలనపరమైన లోపాలకు కారణంగా పేర్కొం టూ ఈవో సూర్యకుమారిపై ప్రభుత్వంబదిలీ వేటు వేసింది. ఇన్చార్జి ఈవోగా దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధకు బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా ఇందుకు సంబంధించిన విచారణను ఇక ముందు కూడా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే విచారణ సజావుగా జరగాలంటే ఈవో బాధ్యతల్లో ఉండకూడదనే కారణంతోనే ఈవోను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్రదేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాల రావు ప్రకటించారు. ఘటనకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్రంగా స్పందించి, అధికారులతో చర్చించారు. కాగా ఇందుకు సంబంధిం చిన రెండు రకాల నివేదికలు శనివారం ముఖ్యమంత్రి వద్దకు చేరాయి. పోలీస్ విచారణ నివేదికను సిటీ పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ సమర్పించగా, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని నిజ నిర్ధారణ కమిటీ నివేదికను ఆ శాఖ మంత్రి మాణిక్యాలరావు ముఖ్యమంత్రికి అందజేశారు. జన్మభూమి కార్యక్రమాన్ని ముగించుకుని విజయవాడలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రిని కలిసి, స్వయంగా అందజేశారు. నిజనిర్ధణ కమిటీ నివేదికను తొలుత దేవాదాయ శాఖ కమిషనర్‌కు విచారణ కమిటీ సభ్యుడైన రఘునాథ్ అందజేశారు. అనంతరం అనురాధ మంత్రి మాణిక్యాలరావును కలిసి, నివేదికను అందజేశారు. శనివారం రాత్రి మంత్రి మాణిక్యాలరావు ముఖ్యమంత్రిని క్యాంప్ కార్యాలయంలో కలిసి, నిజనిర్ధరణ కమిటీ ఇచ్చిన నివేదికను అందజేశారు. అయితే ఈ రెండు నివేదికలను ముఖ్యమంత్రి అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో మంత్రి మాణిక్యాలరావు, సిటీ పోలీస్‌కమిషనర్ గౌతమ్‌సవాంగ్‌తోను, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి సతీష్‌చందర్, దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధ తదుపరి చర్యలు నిమిత్తం సీఎంతో భేటీ అయ్యారు. సుదీర్ఘభేటీ అనంతరం ముఖ్యమంత్రి ఘటనపై వారికి దిశ నిర్దేశం చేశారు. అనంతరం భేటీలోతీసుకున్న నిర్ణయాలను మంత్రి మాణిక్యాల రావు విలేకరులకు వెల్లడించారు. అయితే అసలు ఆ రెండు నివేదికల్లో ఏముంది ?దుర్గగుడి ఘటనపై ఏమని తేల్చారు ? ఘటన జరిగిందని తేల్చారా ? లేక లేదని చెప్పారా ? అనే టెన్షన్ ఇటు భక్తుల్లోను, అటు ప్రజల్లోను నెలకొన్న నేపథ్యంలో మంత్రి ఘటనపై పూర్తి క్లారిటీ ఇచ్చారు. విచారణను మరింత పకడ్బందీగా నిర్వహించాలంటే ఈవోను తక్షణమే బదిలీ చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని మంత్రి తెలిపారు. కేవలం పరిపాలనపరమైన లోపాల కారణంగానే ఈవోను బదిలీ చేశామన్నారు. అయితే పాలనలో ఈవో వైఫల్యం చెందారని అన్నారు.పూర్తి స్థాయిలో విచారించి,బాధ్యులపై చర్యలుంటాయన్నారు. పోలీస్‌కమిషనర్ గౌతమ్‌సవాంగ్‌మాట్లాడుతూ ఈ విషయంలో సీఎం చాలా సీరియస్‌గా ఉన్నారని అన్నారు.ఆలయం ముగిసిన తర్వాత అంతరాలయంలోకి బయట వ్యక్తులు వెళ్లిన మాట వాస్తవమని, ఇదే అంశాన్ని తమ నివేదికలోపొందుపర్చామన్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ముఖ్యమంత్రి విచారణను మరింతలోతుగా నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే ఈవోను బదిలీ చేశారంటున్నారు.



హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

- సీఎం చంద్రబాబుకు లేఖలో రఘువీరారెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ: ఇంద్రకీలాద్రిపై తాంత్రిక పూజలు జరిగాయన్న ఆరోపణల మేరకు ఇందులో నిజాలను నిగ్గు తేల్చేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, భక్తుల మనోభావాలు, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రఘువీరా శనివారం బహిరంగ లేఖ రాశారు. లేఖలో పేర్కొన్న మేరకు, ఈ ఘటనకు సంబంధించి నిందితులను జైల్లో వేస్తే సరిపోదని..అమ్మవారి ఆలయంలో జరిగిన అపచారానికి రాష్ట్ర ప్రజలపై శిక్ష పడకూదన్న ఆయన ఆగమ శాస్త్ర పండితుల సలహాల మేరకు ఆలయాన్ని సంప్రోక్షణ గావించాలని కోరారు. అసలు తాంత్రిక పూజలు ఎవరు చేయించారు..ఎందుకు చేయించారు.. ఎవరు చెబితే చేయించారు.. అన్న వివరాలను బహిర్గతం చేయాలని, ఇప్పటికే పోలీసుల దర్యాప్తు నివేదిక ప్రభుత్వం వద్ద ఉన్నందున నిందితులను రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రజలు అనుమానిస్తున్నారు. తాంత్రికపూజలు జరిగినట్లు సిసి పుటేజీల సాక్ష్యాధారాలతో నిరూపితమవుతుంటే ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఎమిటో బహిర్గత పర్చాలి. ఈ మాదిరి పూజల వల్ల అమ్మవారి ఆలయంలో జరిగిన అపచారానికి గాను రాష్ట్రానికి ఏ కీడు దాపరిస్తుందోనన్న భయం కలుగుతోంది. అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తుంటే కూతవేటు దూరంలో ఉండే ప్రభుత్వం ఏం చేస్తోంది..? అంటూ రఘువీరా ముఖ్యమంత్రికి రాసిన లేఖలోపేర్కొన్నారు.

దుర్గగుడిలో తాంత్రిక పూజలు జరిగాయని విశ్వసిస్తున్నాం

- శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహారాజ్



అనంతపురం కల్చరల్, ప్రభ న్యూస్: విజయవాడ కనకదుర్గ దేవాలయంలో తాంత్రిక పూజలు జరిగాయని ఒక మఠాధిపతిగా విశ్వసిస్తున్నానని విశాఖపట్నం శారదాపీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహారాజ్ పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణార్థం అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్న స్వామి వారు శనివారం అనంతపురం జిల్లా కేంద్రంలోని హరిజన వాడలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ్‌నగర్‌లోని బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో అర్చక పురోహిత వేద పండితులు చాలా దర్భర పరిస్థితుల్లో ఉన్నారన్నారు. దేవాదాయ శాఖ అర్చకులకు, పురోహితులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. దుర్గ గుడిలో తాంత్రిక పూజలు జరిగాయని ఒక పీఠాధిపతిగా మేము నమ్ముతున్నామన్నారు. ఆది శంకరాచార్యులు ప్రపంచవ్యాప్తంగా తిరుగుతూ లోక కళ్యాణార్థం ఆలయాల్లో పూజలు చేశారన్నారు. దుర్గ గుడిలో జరిగిన క్షుద్ర పూజల వల్ల పాలకులకు, ప్రజలకు ప్రమాదం సంభవించే సూచనలు ఉన్నాయన్నారు. నిజనిర్ధారణ కమిటీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వేశారని, అందులో ప్రభుత్వానికి సంబంధించిన వారు మాత్రమే ఉన్నారన్నారు. ఎలాంటి సిటింగ్ జడ్జి లేరన్నారు. దేవాదాయ శాఖ మంత్రి తాంత్రిక పూజలు జరగలేదని ఒకసారి, జరిగాయని మరొక్కసారి మాట్లాడడం తగదన్నారు. భగవంతుడు ఆలయాల్లో పేదల కోసం సమాజం కోసం కొలువై ఉన్నాడన్నారు. గంగలో మునిగితే పాపాలు పోతాయని అంటారు. గంగే పాపబూరితమైతే ఎవరితో చెప్పాలి. కమిటీని పారదర్శకంగా ఏర్పాటు చేసి, ప్రజలకు మంచి చేయాలని ముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు. తాంత్రిక పూజలు జరగకపోతే మీడియా వారు ప్రతి పది నిమిషాలకోసారి ఆలయంలో జరిగిన సన్నివేశాలను ఎందుకు చూపుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. నిజ నిర్ధారణ కమిటీలో నిజాయితీ గల అధికారులను వేయాలని లేనిపక్షంలో అక్కడున్న పూజారులను భయభ్రాంతులకు గురి చేసి, నిజాన్ని నీరుగారుస్తారన్నారు. అర్చక, పురోహితుల కోసం జులై మాసంలో విజయవాడలో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు స్వామి తెలిపారు.

విచారణ జరపాలి: వైకాపా నేత అంబటి

విజయవాడ కనకదుర్గమ్మ వారి ఆలయంలో క్షుద్రపూజలు జరిపారన్న ఆరోపణలపై నిగ్గు తేల్చేందుకు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైకాపా నేత అంబటి రాంబాబు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అంబటి మాట్లాడుతూ లోకేష్‌కు ఆర్థాంతరంగా ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడం కోసమే ఆయన తల్లి భువనేశ్వరి రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో క్షుద్రపూజలు జరిపి ఉంటారని అన్నారు. కాళహస్తి ఆలయంలో కూడా తాంత్రిక పూజలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయన్నారు. వీటిపై నిజనిర్ధారణ కమిటీలవల్ల ఉపయోగం ఉండదన్నారు .

3 కమిటీలు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి ప్రారంభం కానున్నాయి. అమరావతిలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటుకోసం అవసరమైన భవనాలను పరిశీలించేందుకు న్యాయమూర్తుల కమిటీని ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ కు లేఖ రాసిన విషయం తెలిసిందే. పర్యవసానంగా హైకోర్టు న్యాయమూర్తులందరూ (ఫుల్ కోర్ట్)ఇటీవల సమావేశమై, కమిటీల ఏర్పాటు చేసే బాధ్యతను ఏసీజేకు అప్పగించిన విషయం తెలిసిందే. ఆ నిర్ణయం మేరకు ఏసీజే ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. ఏపీలో ప్రభుత్వం ప్రతిపాదించిన భవనాలను పరిశీలించేందుకు న్యాయమూర్తులు ఫిబ్రవరి మొదటి వారంలో అమరావతికి వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఏపీకి వెళ్లి అక్కడి భవనాలను పరిశీలించి హైకోర్టు ఏర్పాటు నిమిత్తం భవనాన్ని ఎంపిక చేసి తుది నిర్ణయాన్ని ఫిబ్రవరి చివరి వారం లోగా తెలియజేస్తే జూన్‌లో హైకోర్టు ఏర్పాటుకు తగిన సన్నాహాలు చేసుకుంటామని ఏపీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఆ లేఖలోపేర్కొన్న విషయం తెలిసిందే. ఆ లేఖను ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ఏసీజేకు అందజేసిన విషయం తెలిసిందే..ఏపీ ప్రభుత్వం గుర్తించిన కొన్ని భవనాలను జడ్జీల కమిటీ పరిశీలించి వాటికి అవసరమైన మరమ్మతులు, మార్పులు - చేర్పులు చేసేందుకు తగు సూచనలు చేస్తారు. జడ్జీల కమిటీ సూచనలకు అనుగుణంగా ఏపీ ప్రభుత్వం భవనాన్ని ఏప్రిల్ చివరి వారంలో సిద్ధం చేసేందుకు, వేసవి సెలవుల్లో ఫైళ్లు, ఫర్నీచర్ తదితర సామాగ్రిని ఏపీ హైకోర్టుకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. హైదరాబాద్ లో ఉన్న హైకోర్టుకు వెళ్లడానికి ఆంధ్రప్రదేశ్ నుంచి కక్షిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో ఏపీ హైకోర్టును అమరావతి ప్రాంతంలోని తాత్కాలిక భవనంలో ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం హైకోర్టు అవసరాలకే కాకుండా న్యాయమూర్తులు, సిబ్బంది నివాసాలకు కూడా తగిన భవనాలు అవసరమవుతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి హైకోర్టు విభజనపై తెలంగాణ ప్రభుత్వం, న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వం పై తీవ్రంగా ఒత్తిడి తెచ్చాయి. అయితే అప్పట్లో ఏపీ అంతగా సంసిద్ధత వ్యక్తం చేయకపోవడం, భవనాలను సిద్ధం చేయకపోవడంతో ఏపీకి ప్రత్యేక హైకోర్టు ఆలస్యమైంది. అయితే తాత్కాలిక భవనాల్లో హైకోర్టు ఏర్పాటు చేసేందుకు ఏపీ ముఖ్యమంత్రి సంసిద్ధతను వ్యక్తం చేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడంతో ప్రత్యేక హైకోర్టు చేసేందుకు సన్నాహాలు ఊపందుకున్నాయి. దీనికి తోడు లోక్‌సభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రకటన చేయడంతో ఉమ్మడి హైకోర్టు విభజనకు మార్గం సుగమమైంది.

ఐచ్ఛికాల ఆధారంగా న్యాయమూర్తుల కేటాయింపు.

ఉమ్మడి హైకోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు ఇచ్చిన ఐచ్ఛికాల ఆధారంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులకు కేంద్ర ప్రభుత్వం న్యాయమూర్తులను విభజించిన విషయం తెలిసిందే. ఉమ్మడి హైకోర్టుకు మొత్తం 61 మంది న్యాయమూర్తులను కేటాయించారు. 60 :40 నిష్పత్తిలో ఏపీకి 37 మంది, తెలంగాణకు 24 మంది న్యాయమూర్తులను నిర్ణయించారు. ఉమ్మడి హైకోర్టులో ప్రస్తుతం పనిచేస్తున్న 31 మంది న్యాయమూర్తుల్లో 17 మందిని ఏపీకి ,12 మందిని తెలంగాణకు కేటాయించారు. ఈ విషయాన్ని ఏసీజేన్యాయమూర్తులతో చర్చిస్తారు. ఏపీలో భవనాల్ని చూసేందుకు జడ్జీలతో కమిటీని ఏర్పాటు చేస్తారు. అంతా సవ్యంగా జరిగితే కేంద్ర మంత్రి వర్గ అనుమతితో రాష్ట్రపతి ప్రకటన వెలువడుతుంది.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు వీరే

జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్, జస్టిస్ ఎమ్మెస్.రామచంద్రరావు, జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, జస్టిస్ పి.నవీన్ రావు జస్టిస్ చల్లా.కోదండరామ్, జస్టిస్ బి.శివశంకరరావు, జస్టిస్ ఎమ్మెస్కే.జైస్వాల్, జస్టిస్ డాక్టర్షమీమ్ అక్తర్ , జస్టిస్ పి.కేశవరావు, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ టి.అమర్ నాథ్ గౌడ్.ఉన్నారు.

ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు

జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ ఎస్వీ.భట్, జస్టిస్ ఏవీ.శేషసాయి, జస్టిస్ దామా.శేషాద్రినాయుడు, జస్టిస్ ఏ.రామలింగేశ్వరరావు, జస్టిస్ ఎం.సీతారామమూర్తి, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ టి.సునీల్ చౌదరి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి, జస్టిస్ ఎ.శంకరనారాయణ, జస్టిస్ జి.శ్యాంప్రసాద్, జస్టిస్ జి.ఉమాదేవి, జస్టిస్ ఎన్.బాలయోగి, జస్టిస్ టి.రజనీ, జస్టిస్ డీవీఎస్ఎస్.సోమయాజులు, జస్టిస్ కె.విజయలక్ష్మి, జస్టిస్ఎం.గంగారావు.ఉన్నారు.

టీడీపీ ఐటీ నిపుణులకు ప్రత్యేక శిక్షణలు

- బెంగుళూరు వేదికగా 300 మందికి వర్క్‌షాప్
- రెండు రోజులపాటు సంక్షేమ పథకాలు, విజన్ 2029పై అవగాహన
- ప్రత్యేక శిక్షణలతో టీడీపీ ఎన్నికల టీం రెడీ



అమరావతి, ఆంధ్రప్రభ: సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో అధికార టీడీపీ ప్రజలతో మమేకం అయ్యేందుకు రాజకీయ యాత్రలకు ప్రణాళికలు రచిస్తోంది. గత మూడు నెలలుగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఎదో ఒక సమస్య నెపంతో ప్రజలతో మమేకం అవుతుండటంతో టీడీపీ కూడా రాజకీయ వ్యూహ ప్రతి వ్యూహాలతో ముందుకు అడుగులు వేస్తోంది. దీనికోసం తెలుగుదేశం పార్టీ జాతీయ నేతల నుంచి గ్రామ నేతల వరకు దశల వారీగా వారిలో నాయకత్వ లక్షణాలను టీడీపీ మానవ వనరుల విభాగం నేతృత్వంలోని సుశిక్షితులైన బోధనా సిబ్బంది పెంపొందించడం జరుగుతోంది. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి ప్రారంభమైన ప్రత్యేక శిక్షణా తరగతుల ద్వారా 50 వేల మంది టీడీపీ నేతలల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని జాతీయ అధిష్టానం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మంగళగిరి కేంద్రంలో తొలుత విడతగా సెప్టెంబరు 4వ తేదీ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, కార్పొరేషన్ ఛైర్మన్లు తదితర 120 మంది పైచిలుకు రాష్ట్ర నేతలకు మూడు రోజుల పాటు శిక్షణలను ఇవ్వడం జరిగింది. అనంతరం తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ నేతలు 600 మందికి, సోషల్ మీడియా టీంకు చెందిన 300కి, దళిత నేతలు 300 మందికి ఇప్పటి వరకు శిక్షణలను ఇవ్వడం జరిగింది. తాజాగా టీడీపీ ఐటీ నిపుణులకు బెంగుళూరు వేదికగా శని, ఆదివారాల్లోత రెండు రోజుల పాటు ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చంద్రబాబు విజన్ 2029లపై అవగాహన పెంపొందించే దిశగా ఇస్తున్న ఈ శిక్షణలకు 300 మంది ఐటీ నిపుణులు హాజరుకానున్నారు.

నిపుణులైన అధ్యాపక బృందం

బలమైన కేడర్ కలిగిన టీడీపీలో నేతలకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించడం ఒక సవాల్ లాంటిదే. కానీ సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన తెలుగుదేశం పార్టీలో సీనియర్‌నేతలకు కొదవలేదని చెప్పవచ్చు. పార్టీ వ్యవస్థాపకుడైన స్వర్గీయ నందమూరి తారక రామారావు సమకాలికులైన సీనియర్‌నేతల మేధస్సుకు, ఆధునిక టెక్నాలజీని జోడించి పార్టీ శ్రేణుల్లో ప్రజాసేవ పట్ల అంకిత భావం పెంపొందించేందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాలతో టీడీపీ జాతీయ మానవ వనరుల డైరెక్టర్ పెద్ది రామారావు, కన్సల్టెంట్ అనంత్, సభ్యుడు వెంకట్ రాజులతో కూడి ప్రత్యేక కోర్ టీం ప్రత్యేక శిక్షణలకు శ్రీకారం చుట్టింది. దీని కోసం ప్రతి మూడు జిల్లాలకు ఒక శిక్షణా కేంద్రం చొప్పన రాష్ట్రవ్యాప్తంగా ఐదు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు విజయనగరంలో, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు తణుకులో, గుంటూరు, ప్రకాశం, నెల్లూరులకు కందుకూరులో, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురంలకు తిరుపతిలో అలాగే ప్రజా రాజధాని అమరావతి కేంద్రంగా మంగళగిరిలో రాష్ట్రస్థాయి శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. విజయనగరం కేంద్రంలో కలిశెట్టి అప్పలనాయుడు, తణుకులో మద్దిపాటి వెంకట్ రాజు, కందుకూరులో దాసరి రాజా మాస్టారు, తిరుపతిలో రాంగోపాల్ రెడ్డి, మద్దిపట్ల సూర్య ప్రకాశ్‌ల ట్రైనింగ్ డైరెక్టర్లుగా మండల, గ్రామ కమిటీ నేతలకు శిక్షణలను ఇవ్వడం జరుగుతోంది.

అలాగే మంగళగిరి వద్ద గల శిక్షణా కేంద్రంలో రాష్ట్ర, జిల్లా, అనుబంధ కమిటీ నేతలకు కోర్‌టీం ఆధ్వర్యంలో శిక్షణలను ఇస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్లు, సబ్‌ప్లాన్ ద్వారా నిధులను కేటాయించి ప్రతి కుటుంబానికి రూ.10 వేలు ఆదాయం సమకూర్చే చర్యలను చేపడుతున్న టీడీపీ ప్రభుత్వ పనితీరును నిరంతరం సభలు, సమావేశాలు, చైతన్య యాత్రల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి తిరిగి అధికారం చేజిక్కించుకునేలా నేతలు కృషి చేసేలా ఈ శిక్షణా శిబిరాల ద్వారా తర్ఫీదు ఇస్తున్నారు.

హృదయ లక్ష్మీ హారం

(మొదటిపేజీ తరువాయి)

బరువు 721 గ్రాములు కాగా మొత్తం విలువ రూ.31 లక్షలు. లక్ష్మీదేవి అమ్మవారి రూపంలో ఉన్న ఈ హారాన్ని స్వామి మెడలో ఇక మీదట నిరంతరం అలంకరిస్తారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఆలయ ఇవో కె.రామచంద్రమోహన్‌కు దొడ్డికిరణ్, లక్ష్మి దంపతులు హారాన్ని అందజేయడం జరిగింది. తొలుత హారంతో పాటు పెద్ద ఎత్తున భక్తులంతా సింహగిరికి చేరుకొని మాడవీదుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆ తరువాత ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకొని అధికారికంగా ఇవో రామచంద్రమోహన్‌కు అప్పగించారు. వైకాపా నగర అధ్యక్షులు మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఇంకా ప్రభుత్వ విప్ గణబాబుతో పాటు, ఇతర నేతలు తిప్పలనాగిరెడ్డి, కొయ్య ప్రసాద్‌రెడ్డి, ఆలయ ఏఇఓ ఆర్.వి.ఎస్.ప్రసాద్ తదితరులంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. కొద్ది నెలల క్రితం విజయనగరం పైడితల్లి అమ్మవారికి కూడా దొడ్డికిరణ్, లక్ష్మి దంపతులు బంగారు మకరతోరణాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దొడ్డి కిరణ్ ఆంధ్రప్రభతో మాట్లాడుతూ సింహాచలం శ్రీ వరాహాలక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా తన కుటుంబం కొలవడం జరిగిందన్నారు. స్వామిపై ఉన్న భక్తిశ్రద్ధలతోనే ఈ విలువైన హారాన్ని అందజేశామన్నారు.

రాహుల్‌పై హక్కుల నోటీస్ లోక్‌సభకు

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడ్డారని యాదవ్ ఆరోపించారు. ఆయన ఉద్దేశ్య పూర్వకంగానే ఆ పని చేశారని అన్నారు. రాజ్యసభ శీతాకాల సమావేశాల చివరి రోజున జీరో అవర్‌లో తాను ఇచ్చిన నోటీసు ఏమైందని యాదవ్ సభ ఛైర్మన్‌ను తెలుసుకొనగోరగా తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తదనుగుణంగా నోటీసును లోక్‌సభ స్పీకర్‌ను పంపించారు.

సభా హక్కుల సంగతులు

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా బీజేపీ ఎంపీ యాదవ్ ఇచ్చిన సభా హక్కుల నోటీసును రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు లోక్‌సభ స్పీకర్‌కు పంపించడంతో సభా హక్కుల అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్‌నీడలో సభా హక్కుల నోటీసుకు ఉన్న ప్రాధాన్యత, సంబంధిత సంఘాల కార్యకలాపాలు, విధి విధానాలపై ప్రత్యేక కథనం. రాహుల్ గాంధీకి సభా హక్కుల నోటీసు రాజ్యసభ నుంచే వచ్చింది కనుక అక్కడి విషయానికి వస్తే..

సభా హక్కులపై ప్రశ్న

సభా హక్కుల ప్రశ్నను లేవనెత్తాలనుకునే సభ్యుడు ప్రతిపాదిత ప్రశ్నను సభలో ప్రస్తావించడం కంటే ముందే సెక్రటరీ జనరల్‌కు లిఖితపూర్వక నోటీసు సమర్పించాలి. ఒక డాక్యుమెంట్ ప్రాతిపదికగా ప్రశ్నను లేవనెత్తుతున్న పక్షంలో సదరు డాక్యుమెంట్‌ను సైతం నోటీసుతో జతపరచాలి. సభా హక్కులపై ప్రశ్నను లేవనెత్తడానికి ఈ కింది షరతులు వర్తిస్తాయి.. ఆ ప్రశ్న నిర్దేశిత అంశంపై ఇటీవల జరిగిన సంఘటనకు పరిమితమై ఉండాలి. సభా హక్కుల సంఘం జోక్యం అనివార్యం కావాలి.

సభలో లేవనెత్తే విధానం

187వ రూల్ కింద సభా హక్కులపై ప్రశ్నను లేవనెత్తడానికి ఛైర్మన్ అంగీకరించిన పక్షంలో సంబంధిత సభ్యుడు లేచి నిలబడి తన ప్రశ్నను సభలో ప్రస్తావిస్తారు. దానికి సంబంధించిన క్లుప్తమైన ప్రకటన చేస్తారు. ప్రశ్నను లేవనెత్తడానికి ఆమోదం లభించని పక్షంలో ఫలానా సభ్యుడు ఫలానా సభ్యుడిపై సభా హక్కుల నోటీసు ఇచ్చారని ఛైర్మన్ సభకు తెలుపుతారు.

సభా హక్కుల కమిటీకి నోటీసు

190వ రూల్ కింద నోటీసును సంబంధిత సభ్యుడు లేదా మరే ఇతర సభ్యుడి ద్వారా సభా హక్కుల సంఘానికి సిఫార్సు చేసే అంశంపై రాజ్యసభ ఒక నిర్ణయం తీసుకుంటుంది. రాజ్యసభకు సంబంధించి 10 మంది సభ్యులతో సభా హక్కుల కమిటీ ఉంటుంది. కమిటీకి కోరంగా ఐదుగురు సభ్యులు ఉండాలి. తనకు అందిన ప్రతి నోటీసును సంఘం సునిశితంగా పరిశీలిస్తుంది. సంబంధిత సభ్యులకు సమన్లు జారీ చేసే అధికారం సంఘానికి ఉంటుంది. అవసరమైనన్నీ సార్లు సమావేశమైన అనంతరం సంఘం తన నివేదికను ఛైర్మన్‌కు పంపిస్తుంది. అనంతరం నివేదికపై సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ఎవరైనా సభ్యుడు తీర్మానానికి సవరణలు చేయాలని కోరవచ్చు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలులో

ప్రభుత్వాలు వైఫల్యం

- పని ప్రదేశాల్లో కమిటీలను ఏర్పాటు చేయాలి
- యువతిని లైంగికంగా వేధించిన గజల్ శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో మహిళా సంఘాల డిమాండ్



అమరావతి, ఆంధ్రప్రభ: మహిళల పై పెరుగుతున్న వేదింపులు అరికట్టాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలని పలువురు మహిళ సంఘాల నాయకులు తీర్మానం చేశారు. యువతి పై లైంగిక వేధింపులకు పాల్పడిన గజల్ శ్రీనివాస్ ను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. శ్రామిక మహిళా రాష్ట్ర సమన్వయ కమిటీ (సిఐటియు), అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) సంయుక్తంగా మహిళల పై జరుగుతున్న లైంగిక వేధింపుల పై శనివారం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐద్వా ఈస్ట్ కార్యదర్శి లక్ష్మి అధ్యక్షత వహించగా శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు కె.స్వరూపరాణి ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ బాబాలు, స్వామిజీలు, రాజకీయ నాయకులు, పోలీసు ఉన్నతాధికారులు ఇలా చెప్పకుంటుపోతే సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న వారు మహిళలను మభ్యపెట్టి లోబరచుకోవడానికి ప్రయత్నలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పని ప్రదేశాలలో, స్కూల్స్, కాలేజిల్లో మహిళలకు భద్రత కరువైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో వచ్చిన లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. చివరికి సుప్రీంకోర్టే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని నోటీసులు జారీ చేసినా ఫలితం లేదన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణకు నోడల్ అధికారులను నియమించలేదని, అంతర్గత కమిటీలు లేవని అమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

గజల్ శ్రీనివాస్ బాధిత యువతి ప్రదర్శించిన ధైర్యాన్ని ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ ప్రశంశింది. గజల్ శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానం చేసింది. ఈ తీర్మానాలను పిఓడబ్ల్యూ నాయకురాలు పద్మా బలపరచగా అందరు అమోదించారు. ఈ సమావేశంలో పలువురు మహిళ సంఘల నాయకులు భారతి, మున్నీ, వేమేశ్వరి, కె.సుబ్బరావమ్మ, సుధా, ఫాతిమా తదితరులు పాల్గొని ప్రసంగించారు.

భూసేకరణ చట్ట సవరణపై

10న నిరసన సదస్సు

హాజరుకానున్న ఎఐకెయస్ జాతయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్

అమరావతి, ఆంధ్రప్రభ: 2013 భూసేకరణ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన సవరణ బిల్లును నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి సదస్సు ఈ నెల 10న విజయవాడలో నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, ఇంకా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కిసాన్ సభ జాతీయ ఉపాధ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ కుమార్ అంజాన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, ఇంకా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్యలతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వం ఏకపక్షంగా ప్రవేశ పెట్టిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదం జరిగితే రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు , చేతివృత్తిదారులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టంతో నయా భూస్వాములు, కార్పొరేట్లకు లబ్ధిచేకురుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సవరణ బిల్లు రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా ఒత్తిడి తెచ్చేందుకు జరుగుతున్న ఈసదస్సును జయప్రదం చేయాలని ప్రసాద్ కోరారు.

కాకినాడకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ - కాకినాడ మధ్యన మూడు ప్రత్యేక రైళ్లు నడిపించబోతున్నారు. ఈ నెల 14న హైదరాబాద్ నుండి ప్రత్యేక రైలు బయలుదేరి మరుసటి రోజు కాకినాడకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడ నుండి ఈ నెల 15, 17 తేదీల్లో ప్రత్యేక రైళ్లు బయలుదేరి మరుసటి రోజు హైదరాబాద్ చేరుకుంటాయి. ప్రత్యేక రైళ్లు అన్ని ప్రధానమై స్టేషన్లల్లో నిలుపుదల చేయడం జరుగుతుందని దక్షిణ మధ్య రైల్వే ప్రకటనలో తెలిపింది. ఈ నెల 16న మరో రైలు కాకినాడలో బయలుదేరి మరుసటిరోజు సికింద్రాబాద్ చేరుకుంటుందన్నారు.

తెలంగాణ ఎంపీలను చూసి బుద్ధి తెచ్చుకోండి

- విభజన హామీలు అమలులో టీడీపీ విఫలం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

అమరావతి, ఆంధ్రప్రభ: తెలంగాణ ఎంపిలను చూసి మన ఎంపీలు బుద్ధి తెచ్చుకోవాలని చిన్న అంశంపై పార్లమెంటులో గొడవ చేసి మరీ వారు సాధించుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విభజన హామీలపై మోడీతో మాట్లాడే దమ్ము, ధైర్యం ముఖ్యమంత్రికి, ఎంపీలకు లేదని ఆయన విమర్శించారు. విభజన హామీలపై ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టానున్నట్లు ఆయన తెలిపారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ప్రధానిని కలవడానికి తెలుగుదేశం ఎంపీలకు ఇన్ని రోజులు ఎందుకు పట్టిందని ఆయన ప్రశ్నించారు.

టీడీపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు ప్రధాని ని కలిసి ఏమి సాధించారన్నారు. చంద్రబాబుకు ప్రధాని అపాయింట్ మెంట్ ఇవ్వకపోతే అడుక్కుంటానికి ఎంపీలను పంపారని విమర్శిం చారు. పార్లమెంటులో బిర్యానీలు తినడానికి ఉన్నరా అని తాము చేసిన విమర్శల కారణంగా ఎంపీలు ప్రధానిని కలిశారని చలోక్తి విసి రారు. విభజన హామీల అమలు పై అఖిలపక్షసమావేశం నిర్వహిం చాలని , ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రధానిని కలవాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని దళితుల పై నానాటి దాడుల పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో జరుగుతున్న జన్మభూమిలో దళితులను గ్రామ బహిష్కరణచేశారని, అలాగే విజయనగరం జిల్లాలోని దళితుల పై స్థానిక ప్రజా ప్రతినిధి తనయుడు దాడులు జరిపారని విచారం వ్యక్తం చేశారు.

8 నుంచి విజయవాడలో సీపీఐ జాతీయ సమావేశాలు

భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి సమావేశాలు జనవరి 8,9,10 తేదీలలో విజయవాడ పార్టీ కార్యాలయంలో జరుగుతాయని రామకృష్ణ ప్రకటించారు. ఈ సమావేశాలలో కేంద్ర నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి, నారాయణ లతో పాటు దేశంలో 29 జిల్లాలకు చెందిన కార్యదర్శులు, జిల్లా స్థాయినాయకులు పాల్గొంటారని చెప్పారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టే విధంగా కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయని, జర్నలిస్టులు,రచయితలు, ప్రజా సంఘాల నాయకుల పై జరుగుతున్న దాడుల గురించి సమావేశాల్లో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల పై చర్చించి తీర్మానాలను ఏప్రియల్ లో కేరళలో జరగబోయే జాతీయ సమావేశాల్లో ప్రవేశపెట్టి నివేదిక రూపొందిస్తామని ఆయన తెలిపారు. పార్టీ ప్రతిష్టత, ప్రభుత్వ వైఫల్యాలను సమగ్రంగా చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు జల్లి విల్సన్, దోనేపూడి శంకర్, అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఉత్పత్తి, వినియోగాల్లో

దేశంలోనే అగ్రస్థానం

జన్మభూమి గ్రామసభలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు



కాకినాడ, ప్రభన్యూస్ ప్రతినిధి: దేశంలోనే విద్యుత్ తలసరి వినియోగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని విద్యుత్‌శాఖా మంత్రి కిమిడి కళా వెంకట్రావు స్పష్టం చేశారు. దేశంలో 11శాతం విద్యుత్‌ను ఆంధ్రప్రదేశ్‌లో వినియోగిస్తున్నారన్నారు. సహజంగానే విద్యుత్ తలసరి వినియోగం ఆ ప్రాంతాభివృద్ధి, వికాసాలకు అద్దంపడుతోందన్నారు. శనివారం మంత్రి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించారు. కాజులూరు మండలం ఆర్యవటం గ్రామంలో జన్మభూమి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ 23.15కోట్లతో ఏర్పాటు చేస్తున్న 132/33కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. అనంతరం మంత్రి కళా మాట్లాడుతూ 1998లోనే చంద్రబాబు దూరదృష్టితో విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఆఫలితంగానే ఇప్పుడు రాష్ట్రం మిగులు విద్యుత్ సాధిస్తోందన్నారు. అలాగే విద్యుత్‌బోర్డును చంద్రబాబు అప్పుడే నాలుగు పంపిణీ విభాగాలుగా విభజించారన్నారు. తద్వారా పంపిణీ నష్టాల్ని గణనీయంగా తగ్గించగలిగారన్నారు. ఇలా మిగిలిన విద్యుత్‌ను ప్రజలకు అందిస్తున్నామన్నారు. జాతీయస్థాయిలో విద్యుత్ పంపిణీ నష్టాలు 19.5శాతంగా ఉన్నాయన్నారు. దీన్ని 15శాతానికి తగ్గించే ప్రయత్నం జరుగుతోందన్నారు. అయితే తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో సరఫరా నష్టాలు 4.5శాతానికి నియంత్రించగలిగామన్నారు. సహజంగానే పంపిణీ నష్టం ఒకశాతం తగ్గితే 360కోట్లు ఆదా అవుతాయన్నారు. ఇంతగణనీయంగా తగ్గించిన పంపిణీ నష్టాల వల్ల విద్యుత్ సంస్థల పనితీరు మెరుగుపడిందన్నారు. అందుబాటులో ఉన్న విద్యుత్‌ను మరింత మెరుగైన పద్దతిలో సరఫరా చేసేందుకు కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్టేషన్లను నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను విస్తృతంగా పెంచుతున్నామన్నారు. విద్యుత్‌రంగంలో కేంద్రం ఏటా 37సూచికల క్రింద అవార్డులందిస్తోందన్నారు. ఇందులో 27అవార్డుల్ని ఆంధ్రప్రదేశ్శే అందుకుంటోందన్నారు.

విపక్షాల హామీలు నమ్మొద్దు

ప్రభుత్వానికి పెరుగుతున్న జనాధరణను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయంటూ మంత్రి కళా మండిపడ్డారు. పనిగట్టుకుని ప్రభుత్వంపై కొందరు అనుచిత విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. కల్లిబొల్లి హామీలు గుప్పిస్తున్నారన్నారు. వాటిని నమ్మొద్దంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మోడల్ నియోజకవర్గంగా రామచంద్రాపురం

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమాల్లో రాష్ట్రానికే మోడల్‌గా నిల్చిందని మంత్రి ప్రశంసించారు. ప్రస్తుతం శంఖుస్థాపన చేసిన సబ్‌స్టేషన్‌ను తొమ్మిదిమాసాల్లోగా పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో రామచంద్రాపురం ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు, ఆర్‌డిఓ ఎన్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే జన్మభూమి లక్ష్యం: మంత్రులు యనమల, దేవినేని



సింగరాయిపాలెం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి యనమల

కైకలూరు, ప్రభ న్యూస్: గ్రామాల్లో ఎదుర్కొంటున్న ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి యనమల రామకృష్ణుడు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. కృష్ణాజిల్లా కైకలూరు నియోజకవర్గంలోని సింగరాయి పాలెం గ్రామంలో నిర్వహించిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి యనమల మాట్లాడుతూ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నదే మా లక్ష్యం అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందిననాడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది అని గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామాల్లో ప్రతి ఒక్క సమస్యను తెలుసుకుని దానికి పరిష్కారించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి దేవినేని ఉమా మాట్లాడుతూ అపరభగీరధుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఆ ఒక్క నాయకుడు ఆలోచన వల్లే నేటి నీటి కొరత తీరుతుందన్నారు. పట్టిసీమ ద్వారా నీటిని తరలించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత మా ప్రభుత్వానికే దక్కిందన్నారు. 160 టిఎంసిలతో 13లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం జరిగిందని పేర్కొన్నారు. దీంతో 10 వేల కోట్ల ఆదాయం రైతులకు వచ్చిందన్నారు. ఆరుతడి పంటలకు సకాలంలో నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా త్రాగునీరుకు ఎటువంటి లోటు లేదని ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం నీరు ఎంతో బంగారం అని నీటిని వృధా చేయకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని దేవినేని ఉమా కోరారు. రాబోయే కాలంలో క్రాప్ హాలిడ్ అనేది ఉండదని ఇక రైతు కళ్లల్లో ఆనందం చూడటమే మా ప్రభుత్వ ధ్యేయం అన్నారు. అనంతరం శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంకు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, జిల్లా టిడిపి అధ్యక్షుడు బచ్చుల అర్జునుడు, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు దరఖాస్తుల వెల్లువ

- 3 లక్షలు దాటిన దరఖాస్తులు
- గడువు ముగిసే నాటికి 4 లక్షలు దాటొచ్చు
- ఏర్పాట్లలో నిమగ్నమైన ఏపీపీఎస్సీ
- కోచింగ్ సెంటర్లలో అభ్యర్థుల హడావుడి

అమరావతి, ఆంధ్రప్రభ : ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి విద్యా శాఖ నిర్వహించతలపెట్టిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌కు దరఖాస్తుల వెల్లువ కొనసాగుతోంది. దాదాపు 14వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం టెట్ నిర్వహించాలని తలపెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు 3 లక్షల మించి దరఖాస్తులు అభ్యర్థుల నుంచి రావడం గమనార్హం. డిసెంబర్ 18వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 15వ తేదీ వరకు గడువు ఉండడంతో వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. దరఖాస్తుల సంఖ్య 4 లక్షల దాటవచ్చంటున్నారు.పేపర్ -1 రాసేందుకు 1.10 లక్షలు, పేపర్ -2కు సంబంధించి 1.70 లక్షలు,రెండు పేపర్లు రాసేందుకు 10వేల మందికి పైగానే దరఖాస్తు చేసుకున్నారు. దీనిని బట్టి ఉపాధ్యాయ పోస్టులకు మరింత పోటీ పెరిగిందని చెప్పవచ్చు. దీంతో అభ్యర్థులు మరింత సీరియస్‌గా ప్రయత్నిస్తే తప్పా ఉద్యోగం లభించే అవకాశం లేదంటున్నారు. సమయం దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థుల్లో టెన్షన్ ప్రారంభమైంది.తొలుత టెట్ పరీక్షను జనవరి 17 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సి ఉండగా అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు వాయిదా వేసిన సంగతి తె లిసిందే. దీంతో ఫిబ్రవరి 5 నుంచి 15వ తేదీ వరకు టెట్ పరీక్ష నిర్వహించేందుకు ఏపీపీఎస్సీ విస్తృత ఏర్పాట్లు చేసేందుకు కసరత్తు చేస్తోంది. కొత్త షెడ్యూల్ ప్రకారం దరఖాస్తుల స్వీకరణ,హాల్ టిక్కెట్ల జారీ తేదీల్లో కొన్ని మార్పులు ఉంటాయని గతంలోనే మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పిన సంగతి తెలిసిందే.. డీఎస్సీని కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహించే అవకాశం ఉందంటున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో తొలి సారిగా జరగబోతున్న ఈ టెట్ పరీక్షకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఏపీపీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఎంపికలను చేయబోతుండడంతో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష కోసం వేలాది మంది నిరుద్యోగులు ఎంతో కాలంగా ఆతృతతో ఎదురుచూస్తున్నారు. టెట్‌లో ఉత్తీర్ణులైన వారు మాత్రమే డీఎస్సీ పరీక్ష రాయడానికి అర్హులవుతారు కనుక అభ్యర్థులు ఇప్పటికే ఈ విషయమై ప్రత్యేక దృష్టిపెట్టి,పరీక్షకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే అభ్యర్థులు ఇప్పటికే వేలాది రూపాయలు పోసి,కోచింగ్ సెంటర్లలో చేరి,శిక్షణ పొందుతున్నారు. ఇదే అదునుగా భావించి శిక్షణ పేరుతో ఎన్నో సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. కనీస నియమ నిబంధనలు లేకుండానే శిక్షణ పేరుతో బోర్డులు తగిలించాయనే విమర్శలున్నాయి. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. నిరుద్యోగుల నుంచి పెద్ద ఎత్తున ఫీజుల రూపంలో గుంజుతున్నాయనే విమర్శలున్నాయి.

'ఉపాధి కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలం'



ప్రసంగిస్తున్న మయూక్ బిశ్వాస్

అమరావతి, ఆంధ్రప్రభ : భారతదేశంలో నాణ్యతలేని వృత్తి విద్యాకోర్సులు బోధిస్తున్నారని అఖిల భారత పీఎస్ఎన్ కన్వీనర్ మయూక్ బిశ్వాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి యేడాది లక్షల మంది విద్యార్థులు కోర్సులు పూర్తి చేసుకుని వస్తుంటే, వారికి ఉపాధి చూపించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపించారు. శనివారం విజయవాడలోని ఎంబి విజ్ఞన కేంద్రంలో ప్రొఫెషనల్ స్టూడెంట్ నెట్‌వర్కు రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సు కు ముఖ్య అతిధిగా విచ్చేసిన మయూక్ బిశ్వాస్ మాట్లాడుతూ విద్యా రంగానికి మోడీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు ప్రకటనల కోసం రూ.36 వేల కోట్లు ఖర్చు చేసిందని మండిపడ్డారు.1936లో ఏర్పడిన ప్లానింగ్ కమీషన్ రద్దు చేసి దాని స్థానంలో నీతి ఆయోగ్ ను తీసుకువచ్చి ఏం సాధించారో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాధాన్యతలతో నడపాల్సిన ఐఐటిల్లో కూడా మౌలిక సదుపాయాలు లేవని విచారం వ్యక్తం చేశారు.ఆచార్య నాగార్జున యూనివర్శిటి ఇంజనీ రింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొపెసర్ ఈదర శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమంగా సామాజిక స్పృహ తగ్గుతుందని ఇలాంటి సమావేశాల ద్వారా విద్యార్థులలో సామాజిక చైతన్యాన్ని కల్పించాలని సూచించారు.పిఎస్ఎన్ కమిటీ సభ్యుడు ఎస్‌డి లాల్ సలామ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎస్ ఎఫ్ ఐ నాయకులు రమేష్, అశోక్, కోటి, అనిల్, సాయి, ఎఐఎఫ్ నాయకులు నూర్ మహ్మద్ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రొఫెషనల్ విద్యార్థులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో నిర్వహించిన అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ అధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య, తదితరులు

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి శిద్దా



అమరావతి, ఆంధ్రప్రభ: గ్రామీణ ప్రాంతాలలో మౌలికసదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి శిద్దా రాఘవరావు పేర్కొన్నారు. శనివారం గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు మండలం భోగోలు గ్రామంలో జరిగిన 5వ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి గ్రామసభను ప్రారంభించారు. అనంతరం అందరిచేత జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి అన్ని రకాల మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో గతంలో రోడ్లు సరిగా లేవని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పెషల్ డ్రైవ్ చేపట్టి రహదారులను నిర్మించడంతో పాటు రహదారుల అభివృద్ధికి కూడా పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు తెలుసుకుని వారి నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే పరిష్కరించేందుకు జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు.

ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు మన రాష్ట్రం ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. పేదరికం లేని సమాజం తేవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సంక్రాంతి తరువాత పేద ఎస్సీలకు రూ.40 వేలు, ఎస్టీలకు రూ.50 వేలు, బీసీలకు రూ.35 వేలు పెళ్ళికానుకల అందజేసి ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్, మార్కాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి పెంచల కిషోర్, ఎంపిపి రవికుమార్ యాదవ్, జెడ్పీటీసీ వెంకట లక్ష్మమ్మ, మండలపరిషత్ అభివృద్ధి అధికారి సుకుమార్, తహశీల్ధార్ జిఎస్ఎన్.ప్రసాద్, సర్పంచ్ ఎన్నం గీత, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజలు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- అభివృద్ధి పనుల్లో జాప్యం పట్ల ఏడీసీ సీఎండీ లక్ష్మీ పార్థసారథి ఆగ్రహం



గుత్తేదారు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఏడీసీ సీఎండీ

అమరావతి, ఆంధ్రప్రభ : రాజధాని అమరావతిలో ఏడీసీ చేపడుతున్న రహదార్ల నిర్మాణంలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులు, గుత్తేదారుల సంస్థలపై సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశించిన గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయకపోతే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శనివారం రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ప్యాఏజీ-3లో ఎన్-4, ఎన్-14, ప్యాకేజీ-12లో ఈ-11, ఈ-7, ఈ-9 రహదార్లను పరిశీలించారు. సదరు రహదార్ల నిర్మాణంలో పురోగతి ఆశించిన స్థాయిలో లేపోవడంతో ఆమె ఆగ్రిమించారు. ముందుగా ఆమె బోరుపాలెం,శాఖమూరు, కృష్ణాయపాలెం గ్రామాల్లో జరుగుతున్న బ్రిడ్జిల పనులను పరిశీలించారు. వాటి పనులను ముందుకు సాగపోవడం పట్ల తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడీసీపై ఎన్నో బాధ్యతలను ఉంచిందని పనులు నత్తనడకన జరపడం పద్దతి కాదన్నారు. ఎన్-4 రోడ్డు పరిశీలనలో భాగంగా బ్రిడ్జి పనుల పురోగతిపై పనుల సాగదీత సరైన విధానం కాదని.. వెనువెంటనే వంతెన నిర్మాణం జరిగిపోవాలని గుత్తేదారు సిబ్బందికి ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో ఎప్పటికప్పుడు స్వీయ పరిశీలన అవసరమని అధికారులపై మండిపడ్డారు. వచ్చే వారంలో మళ్లీ రహదార్లను పరిశీలిస్తానని పనుల్లో పురోగతి సాధించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

వారధి జంక్షన్‌లో బుద్ధ చక్ర ..

ఈ పర్యటనలో భాగంగా కనకదుర్గమ్మ వారధి కూడలిలో ఏడీసీ ఆధ్వర్యంలో బుద్ధ చక్రను నిర్మిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. బుద్ధ చక్రను నిర్మించడానికి ఏడీసీ అధికారులు వెయ్యి స్క్వేర్ సెంటిమీటర్ల విస్తీర్ణంలో చేపట్టిన ల్యాండ్ స్కేప్‌ను పరిశీలించారు. బుద్ధచక్ర నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇది పూర్తయితే రాజధాని ముఖ ద్వారాన్ని చక్కని ఆకర్షణ వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో ఏడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ టి.మోజెస్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీరు ఎంవి.సూర్యనారాయణ, డీఈ ఎలెగ్జోవను, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సుందరీకరణలో జాప్యం జరిగితే సహించను

సుందరీకరణ పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) సీఎం డి.లక్ష్మీపార్థసారధి అధికారులనుహెచ్చరించారు. రమేష్ హాస్పిటల్ కూడలి నుంచి రామవరప్పాడు రింగు కూడలి వరకు 16వ నెంబరు జాతీయ రహదారికి ఇరువైపులా ఏడీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పచ్చదనం సుందరీకరణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ప్రముఖులు పర్యటించే ఈ రహదారిని ఆధునిక హంగులతో అభివృద్ధి చేయాలన్నారు. రహదారికి పశ్చిమ ముఖంగా ఏడీసీ అటవీ విభాగం అధికారులు అందమైన మొక్కలు, కాలి బాటల ప్రక్కన గ్రీనరి, పాదచారులు కూర్చోవడానికి వీలుగా ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాత్రిళ్లు రహదారి శోభాయమానంగా దర్శనమిచ్చేందుకు ఆకర్షణీయమైన విద్యుత్తు దీపాలను తీర్చిదిద్దాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదన్నారు. సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీసీఎఫ్ వై.రమేష్ కు సూచించారు. ఈ పర్యటనలో ఏడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌జి.రత్నకుమార్, చీఫ్ ఇంజనీరు టి.మోజెస్‌కుమార్, సీనియర్ ఇంజనీరు ఎం.సూర్యరావు, అటవీ విభాగం అధికారులు హుస్సేను, ఎం.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బీబీఏఎస్ విధానంపై సీఆర్‌డీఏలో అవగాహన



బీబీఎఎస్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీఆర్‌డీఏ అధికారులు, ఇంజినీర్లు, సర్వేయర్లు

అమరావతి, ఆంధ్రప్రభ: బిమ్ బేస్డ్ బిల్డింగ్ అప్రూవల్ సిస్టం (బీబీఎఎస్)పై సాఫ్ట్ టెక్ ప్రతినిధులు శనివారం సీఆర్‌డీఏ అధికారులకు, ఇంజినీర్లకు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అవగాహన కల్పించారు. విజయవాడ సీఆర్‌డీఏ కార్యాలయంలో జరిగిన ఈఅవగాహన కార్యక్రమంలో రాజధాని నగర పరిధిలోని ఎల్పీఎస్ లేఅవుట్లలో నిర్మించనున్న భవనాలకు బిబిఎఎస్ విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు ఇవ్వడం జరుగుతుందని సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు తెలియజేశారు. రివెట్ సాఫ్ట్‌వేర్‌లో తయారు చేసిన ప్లాన్ 3డీ మోడల్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్న సాఫ్ట్ టెక్ ప్రతినిధులు ఆవిధానాన్ని సవివరంగా తెలియజేశారు. ఈ విధానంలో సమగ్రంగా ప్లాన్ తయారు చేసి అప్‌లోడ్ చేస్తే డెవలప్‌మెంట్ ప్రమోషన్ విభాగం అధికారులు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని అధికారుల వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఆర్‌డీఏ సీనియర్ ప్లానింగ్ ఆఫీసర్ జి. నాగేశ్వరావు, జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్లు చిట్టేల మధుసూధనరావు, టి. నరేంద్రనాథ్‌రెడ్డి, అసిస్టెంట్ ప్లానర్ ఆర్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ జోన్‌లో నిర్మాణాలు చేయొద్దు

సీఆర్డీఏ పరిధిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని సీఆర్‌డీఏ అధికారులు మరోసారి స్పష్టంచేశారు. ఈనేపథ్యంలోనే శనివారం యనమలకుదురు అనుమతిలేని నాలుగు నిర్మాణాలను అడ్డుకొని నిర్మాణాల సెంట్రింగ్ సీఆర్డీఏ అధికారులు తొలగించారు. అదేవిధంగా బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న నిర్మాణ పనులను నిలిపివేశారు. అగ్రికల్చర్ జోన్‌లో నిర్మాణాలు చేయరాదని, అనుమతిలేకుండా నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి తీసుకుని మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ గుమ్మడి ప్రసాదరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీలేఖ, కరుణ పాల్గొన్నారు.

రాజధానిలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులు

అమరాతి రాజధానిలోని మందడం, నీరుకొండ తో పాటు తుళ్ళూరు, కృష్ణాయపాలెం గ్రామాలలో శనివారం ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులను నిర్వహించారు. వరద నియంత్రణ చర్యలకి సంబంధించిన సామాజిక ప్రభావ అంచనా, పునరావాస కార్యాచరణ ప్రణాళిక, వరద నియంత్రణ చర్యలకి సంబంధించిన పర్యావరణ ప్రభావ అంచనా పర్యావరణ నిర్వహణ ప్రణాళికల నివేదికలపై సీఆర్‌డీఏ సదస్సును ఏర్పాటు చేసింది. ఈ సదస్సులలో ప్రజలు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, మేధావులు, ప్రకృతి ప్రియులు, సంఘ సేవకులు , ఇతర ప్రభుత్వ శాఖాధికారులు పాల్గొని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈసూచనలను ముసాయిదాలో పొందపరచడం జరుగుతుందని సీఆర్‌డీఏ అధికారులు పేర్కొన్నారు. ఏడీసీ , టాటా అర్కాడిస్, వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు, ఏపీఆర్డీఏ స్ట్రాటజీ డైరెక్టర్ జేఎస్ ఆర్.కె శాస్త్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం ఆలోచించాలి

- 9న తాలూకా కేంద్రాల్లో ధర్నా
- మార్చిలో చలో అసెంబ్లీ: ఏపీఎన్జీవో అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ పి.అశోక్‌బాబు



అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్రంలో రాష్ట్రంలో సీపీఎస్(కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) పెద్ద సమస్యగా మారిందని ఏపీఎన్జీవో అధ్యక్షుడు పి.అశోక్‌బాబు అన్నారు. శనివారం విజయవాడ ఎన్జీవో కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సీపీఎస్ రద్దుపై ఆలోచించాలని, ఏపీలో ఈవిషయంపై ఉద్యమం తీవ్రస్థాయిలో ఉందని, సీపీఎస్‌ని రద్దుచేయాలని ఉద్యోగులు బలంగా కోరుకుంటునారని తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని మంత్రి యనమలకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చెశామని, కాని అది కేంద్రం పరిధిలో ఉందని సీఎం తెలిపారన్నారు. ఈవిషయంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి ఉద్యోగుల సమస్యని పరిష్కరించాలన్నారు. సీపీఎస్ రద్దు విషయంపై రాష్ట్రంలోని అన్నీ తాలుకా కేంద్రాల్లో ఈనెల 9వతేదీన ధర్నాలు చేస్తున్నామని, ఈదర్నాలో అన్ని సంఘాలు పాల్గొంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఫిబ్రవరి 10వతేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో మహాధర్నా చేపడతామని, మార్చి నెలలో అసెంబ్లీ జరిగే సమయంలో 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అఖిల భారత రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులసమాఖ్య ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి దేశ వ్యాప్తంగా చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని కూడా చేపట్టడం జరుగుతుందన్నారు. 9వతేదీన జన్మభూమి కార్యక్రమం ఉన్నప్పటికీ ఉద్యోగులు ఒక పూట సెలవు పెట్టి ధర్నాలో పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో 4లక్షల మంది ఉద్యోగులు ఉన్నారని అందరూ జన్మభూమిలో పాల్గొనటంలేదని, ఈధర్నా కార్యక్రమం జన్మభూమికి ఆటకం కాదన్నారు. పెన్షన్ లేకుంటే ప్రభుత్వ ఉద్యోగానికి విలువ లేదన్నారు. సీపీఎస్ విషయంలో ఆర్టీఐని సంప్రదించగా రాష్ట్ర పరిధిలోనే ఉన్నట్లు చెబుతుందని, సీపీఎస్ వల్ల పదవీవిరమణ పొందిన ఉద్యోగులకు నగదును కేంద్రం ఇస్తుందా, రాష్ట్రం ఇస్తుందా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పీఆర్‌సీ అరియర్స్ విషయంలో సంక్రాంతి సందర్భంగా ఒక తీపి కబురు అందుతుందని ఆశిస్తున్నామన్నారు. ఆదివారం కూడా పిల్లల్ని జన్మభూమికార్యక్రమానికి పిలవటం సరికాదని, ఇది కొత్త వివాదానికి తెరతీస్తుందన్నారు. ఈవిషయంలో విద్యాశాఖమంత్రిని, సీఎం చంద్రబాబుని కలస్తామన్నారు. కార్పొరేట్ స్కూల్స్‌లో బాగానే ఉన్నప్పటికీ ప్రభుత్వం కేవలం ప్రభుత్వ పాఠశాలల పిల్లల్ని జన్మభూమికి పిలవటం సరికాదన్నారు. ఈసమావేశంలో ఏపీజేఏసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాబుల్ రెడ్డి, విద్యాసాగర్, రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రసాద్, సీవీ రమణ, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపి ఉద్యోగులను అడ్డుకోవద్దు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: తమ సచివాలయం లోకి రాకుండా ఏపి ఉద్యోగులను అడ్డుకోవద్దని ఏపి గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రతి శనివారం ఎపి సచివాలయానికి వచ్చే తమ ఉద్యోగులను సచివాలయం లోపలికి రాకుండా అడ్డుకోవడం సరికాదని అన్నారు. శనివారం సచివాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం మరో ఎనిమిదేళ్లు ఎపి సచివాలయం తమ పరిధి లో ఉంటుందని, లోపలికి రాకపోకలు సాగించే హక్కు ఉద్యోగులకు ఉందన్నారు. ప్రతి శనివారం బ్యాంకు పనులు, యూనియన్ కార్యకలాపాలు, సహకార కార్యాలయ పనుల నిమిత్తం ఉద్యోగులు వస్తారని, వారిని అడ్డుకోవద్దని సూచించారు. పరిస్థితి ఇలాగే ఉంటే చిలికి చిలికి గాలివానగా మారే ప్రమాదం ఉందని కృష్ణయ్య హెచ్చరించారు.

మమ్మల్సి తెలంగాణకు రప్పించండి

తెలంగాణకు చెందిన తమను తెలంగాణకు కేటాయించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులు విజ్ఞప్తిచేశారు.

అటెండర్లుగా పని చేస్తున్న దాదాపు 168 మంది తెలంగాణ ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రా నికి కేటాయించారని, తెలంగాణ స్థానికులమైన తమను స్వరాష్ట్రా నికి రప్పించేందుకు సీఎం కేసీఆర్ చొరవ చూపాలని ఉద్యోగులు విజయలక్ష్మి, అస్రా బేగం, ఫహీమున్నీసా, డి ఉషాదేవి, లక్ష్మి తదితరులు కోరారు. తామొక చోట,కుటుంబాలొక చోట ఉంటూ ఇబ్బందులు పడుతున్నామని వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

శనివారం సచివాలయంలో తమకు కలిసిన ప్రతి అధికారికి వారు తమ గోడును చెప్పుకున్నారు.

270 కేజీల గంజాయి స్వాధీనం

పెందుర్తి, (విశాఖపట్నం) ప్రభ న్యూస్: విశాఖ జిల్లా పెందుర్తి మండల పరిధి జెర్రిపోతులపాలెంలో శనివారం వ్యాన్‌లో తరలిస్తున్న 270 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జూరెడ్డి మురళి తెలిపిన వివరాలు ప్రకారం జెర్రిపోతులపాలెం, నూకమాంబ కాలనీలో గంజాయి తరలిస్తున్న వ్యక్తి అవినాష్ ఒక స్కూటిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయాడు. బెహరా పాలిటెక్నికల్ కాలేజి వద్ద ఒక వ్యాన్‌ను గుద్దడంతో గంజాయి తరలిస్తున్న వాహనం ఆగిపోయింది. దీంతో స్థానికులు అవినాస్‌ను పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన పోలీసులు వెళ్లి గంజాయి తరలిస్తున్న తమిళనాడుకు చెందిన అవినాష్‌ను అరెస్టు చేసి వాహనాన్ని గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ గంజాయిని పాడేరు నుండి తీసుకొచ్చినట్లు నిందితులు పేర్కొన్నారు.


గంజాయి పట్టివేత

సబ్బవరం : టర్బో వాహనంలో తరలిస్తున్న గంజాయిని సబ్బవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సబ్బవరం ఎస్సై ప్రభాకరరెడ్డి, సిబ్బంది మూడురోడ్ల సెంటర్లో మాటు వేసి వాహనాన్ని తనిఖీ చేశారు. గంజాయి తరలిస్తున్న వాహనాన్ని, 75 కేజీల గంజాయిని, ఇద్దరు వ్యక్తులను, సుమారు రూ.20వేల నగదు స్వాధీనం చేసుకొని టాస్క్ ఫోర్స్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ షాపుల నుంచి

అన్ని రకాల పప్పుల సరఫరా

- నిల్వల ఖాళీకి చర్యలు
- వివరాలు ప్రభుత్వానికి నివేదించాం: మార్క్‌ఫెడ్ జీఎం



అమరావతి, ఆంధ్రప్రభ: రేషన్ షాపుల ద్వారా అన్ని రకాల పప్పులను వినియోగ దారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. మార్క్‌ఫెడ్ వద్ద ఉన్న కందులు, పెసలు, మినుములను మిల్లింగ్ చేసి తద్వారా వచ్చే పప్పులను చౌకదుకాణాల ద్వారా విక్రయించేందుకు ప్రణాళిక రూపొందించారు. మార్క్‌ఫెడ్ వద్ద కందులు, పెసలు, మినుములు, శనగల నిల్వాలు మూలుగు తున్నాయి. రైతుల నుంచి ప్రభుత్వం ఎంఎస్‌పీ ధరలకు మార్క్‌ఫెడ్ ద్వారా అపరాలను కొనుగోలు చేసింది. ఈ ఏడాది తిరిగి వీటిని కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ గోడౌన్లలో ఖాళీ లేకపోవడంతో ఉన్న నిల్వాలను ఖాళీ చేయాలనే నేపథ్యంలో పప్పుల ప్రతిపాదన తెరపైకి వచ్చింది. మార్క్‌ఫెడ్ వద్ద ఉన్న నిల్వలను మార్కెట్లో విక్రయిస్తే ప్రస్తుతం ఉన్న ధరలు పతనమవుతాయనే దృష్టితో వీటిని మిల్లింగ్ చేసి సబ్సిడీ ధరలకు వినియోగదారులకు విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మార్క్‌ఫెడ్ వద్ద ఉన్న నిల్వలపై ప్రభుత్వానికి నివేదికిచ్చారు. జన్మభూమి కార్యక్రమ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశముంది. ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న కందులను క్వింటా రూ.5,450, మినుములు 5,400, పెసలు 5,500 చొప్పున కొనుగోలు చేయడం జరిగింది. మార్క్‌ఫెడ్ వద్ద ఉన్న కందులు, మినుములు, పెసలు, శనగలు గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కృష్ణాజిల్లాల్లోని పీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో నిల్వ చేశారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ వద్ద 87 వేల టన్నులు కందులుండగా, ఇటీవల 11 వేల టన్నుల కందులను చంద్రన్న కానుకకు, మరో 4 వేల టన్నులను మహిళా శిశు సంక్షేమ శాఖకు కందిపప్పు నిమిత్తం కేటాయించింది. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ వద్ద 72 వేల టన్నుల కందులున్నాయి. శనగలు 4 వేల టన్నులు, మినుములు 13,500 టన్నులు, పెసలు 2,900 టన్నుల నిల్వలు ఉన్నాయి. వీటన్నింటినీ ప్రభుత్వం ఈనెలాఖరులోపు మార్క్‌ఫెడ్ నుంచి స్వాధీనం చేసుకొని మిల్లింగ్ చేయించే అవకాశాలు న్నాయి. అనంతరం వచ్చిన పప్పులను చౌకదుకాణాల ద్వారా వినియోగదారులకు విక్రయించనున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు ధర రూ.65 నుంచి 70 ఉన్న ధర నేపథ్యంలో ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా కిలో 50లకు కందిపప్పు విక్రయించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ ఆళ్ల శివకోటి ప్రసాద్‌ను వివరణ కోరగా తమ వద్ద ఉన్న కందులు, మినుములు, పెసలు, శనగల నిల్వల వివరాలను ప్రభుత్వా నికి తెలియజేయడం జరిగిందన్నారు. వీటన్నింటినీ మిల్లింగ్ చేసి వచ్చే పప్పులను చౌకదుకాణాల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు.



ఇప్పుడేం చేస్తారు..?!

● డీజీపీ మాలకొండయ్య శైలిపై పోలీసుల్లో చర్చ ● పొలిటికల్ పోస్టింగుల్లో మీమాంస ● స్వాగతిస్తున్న నిజాయితీపరులు

అమరావతి, ఆంధ్రప్రభ : పోలీసు శాఖలో ఆయనదో అరుదైన వ్యక్తిత్వం..ముక్కుసూటి తనం..నిజాయితీ.. చట్టం పరిధిలో విధులు నిర్వహించడం ఆయన నైజం. ఆయనే ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీ డాక్టర్ మన్నం మాలకొండయ్య. ఆయన దగ్గర సిఫార్సులకు ఏమాత్రం అవకాశం లేదు. మరి ఇలాంటి మాలకొండయ్య రాజకీయ బదిలీలపై ఇప్పుడెలా స్పందిస్తారనేది పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. మాలకొండయ్య డీజీపీగా రావడాన్ని నిజాయితీపరులైన పోలీసు అధికారులు స్వాగతిస్తుండగా..పైసలు, పైరవీలతో పోస్టింగ్‌లు పొందిన అధికారులు మీమాంసలో పడ్డారు.

డీఎస్పీల బదిలీల్లో గందరగోళం

గతేడాదిన్నర కాలంగా డీఎస్పీల బదిలీల్లో గందర గోళం నెలకొంది. డీజీపీగా జె.వి.రాముడు ఉన్న సమయంలో డీఎస్పీల బదిలీలు ఆయన చేతుల్లోనే ఉండేవి. రాజకీయపరమైన ఒత్తిళ్ల నేపథ్యంలో డీఎస్పీల బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. ప్రభుత్వం నేరుగా వారితో మాట్లాడిన తర్వాతనే పోస్టింగ్‌లు ఇస్తోంది. ఈ క్రమంలోనే కులాలు, వర్గాలు, రానున్న ఎన్నికల సమీకరణాలు వంటివి చోటు చేసుకుంటున్నాయి. కొందరు ప్రజాప్రతినిధులకు ముడుపులు ముట్టచెప్పి పోస్టింగ్‌లు పొందారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. సమర్థులైన అధికారులున్నప్పటికీ ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు అంగీకరిస్తేనే పోస్టింగ్ ఇచ్చే పరిస్థితులు నెలకొన్నాయి. అనంతపురం జిల్లాలో రాజకీయపరమైన వర్గ విబేధాల నెలకొని ఇప్పటి వరకు ధర్మవరం, తాడిపత్రి సబ్ డివిజన్లకు డీఎస్పీలను నియమించ లేదు. కొన్ని జిల్లాల్లో సబ్ డివిజన్ అధికారులు బాధ్యతలు చేపట్టకుండానే వెనుదిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. విధిలేని స్థితిలో ఇచ్చిన పోస్టింగ్‌లు రద్దు చేసి కొత్త వారికి పోస్టింగ్‌లు ఇవ్వాల్సిన పరిస్థితులను ప్రభుత్వం ఎదుర్కొంది. ఇదే సమయంలో అనేక జిల్లాల్లో పలువురు డీఎస్పీలు తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

మితిమీరిన అవినీతి

పోలీసు శాఖలో అవినీతి పెచ్చురిల్లిందనే ఆరోపణలు పెరిగాయి. పోలీసు శాఖ నిర్వహించిన అంతర్గత విచారణలో 17శాతం పనులు లంచం లేకుండా పోలీసులు చేయడం లేదని రూఢీ అయ్యింది. చివరకు ఎఫ్ఐఆర్(ప్రాథమిక సమాచార నివేదిక) నమోదుకు కూడా పోలీసులు లంచాలు తీసుకుంటున్నారంటూ సాక్షాత్తు గత డీజీపీ నండూరి సాంబశివరావు చెప్పడాన్ని బట్టి పోలీసు శాఖ ఏ స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏసీబీ దాడుల్లో చిక్కుతున్న పోలీసు అధికారుల ఉదంతాలు కూడా వీటిని స్పష్టం చేస్తున్నాయి. గతేడాది అక్రమాస్తుల కేసులో గుంటూరు జిల్లాకు చెందిన ఓ డీఎస్పీని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. లంచం తీసుకుంటూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడగా, గుంటూరు జిల్లాలో ప్రొబేషనరీ ఎస్ఐ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. నెల్లూరు, గుంటూరు వంటి జిల్లాల్లో క్రికెట్ బెట్టింగ్, ఇసుక మాఫియాకు సహకరిస్తూ పోలీసు అధికారులు భారీగా వెనుకేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఇప్పటికే ఆరా

నిత్య విద్యార్థిగా పోలీసు శాఖలో పేరొందిన మాలకొండయ్య బాధ్యతలు చేపట్టిన వెంటనే పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరు పట్ల దృష్టిసారించారు. పోలీసు శాఖలో అధికారుల వ్యవహార శైలి, రాజకీయ ఒత్తిళ్లు, పోస్టింగ్‌ల కొనుగోళ్లు వంటి అంశాలు ఇప్పటికే ఆయన దృష్టికి వచ్చినట్లు తెలిసింది. మధ్యప్రదేశ్‌లో రెండు రోజుల పాటు జరిగే డీజీపీల సదస్సులో పాల్గొనేందుకు మాలకొండయ్య వెళ్లారు. మంగళవారం రాష్ట్రానికి ఆయన తిరిగి రానున్నారు. వచ్చిన వెంటనే తనకు అందిన సమాచారంపై ఆయన సమీక్షించనున్నారు. ఆ సమీక్ష తర్వాత తదుపరి తీసుకోనున్న చర్యలపై పోలీసు శాఖలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.



గవర్నర్‌తో ఏసీబీ డీజీ ఠాకూర్ భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్‌ను ఆంధ్రప్రదేశ్ అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ ఆర్.పి.ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా శనివారం హైదరాబాద్ రాజ భవన్‌లో గవర్నర్‌ను కలిసిన ఠాకూర్ రాష్ట్రంలో ఏసీబీ చేపట్టిన కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్ ఆయనకు పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిసింది.

రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో సమావేశమైన కేంద్ర మంత్రి వై. సుజనా చౌదరి





పోలవరానికి తొలగిన అడ్డంకులు

● ఎగువ కాఫర్ డ్యామ్‌కు, టెండర్లకు పచ్చజెండా ● టెండర్ల గడువు పొడిగింపు? ● ఇక నుంచి పనుల్లో మరింత పురోగతి ● ఢిల్లీలో ముగిసిన ఆకృతుల కమిటీ సమావేశంలో తాజా నిర్ణయాలు

అమరావతి, ఆంధ్రప్రభ: ఎట్టకేలకు కేంద్ర జలవనరుల శాఖ కాఫర్ డ్యామ్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇంతకాలం నెలకొన్న వివాదానికి కేంద్రం తెరదించింది. ఈమేరకు ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి జలవనరుల శాఖకు సంబంధించిన పాండ్యా కమిటీ ఆమోదం తెలిపింది. శుక్రవారం ఈ మేరకు ఢిల్లీ నుంచి రాష్ట్ర జలవనరుల శాఖాధికారులకు సమాచారం అందింది. తాజాగా నిర్ణయంతో పోలవరానికి ఏర్పడిన ప్రధాన అడ్డంకి తొలగిపోయినట్లయింది. గతంలో దిగువ కాఫర్ డ్యామ్ నిర్మాణానికి అనుమతినిచ్చిన కేంద్ర జలవనరుల శాఖ, ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి మాత్రం అడ్డు చెప్పడంతో పనులను నిలిపివేయిన సంగతి తెలిసిందే. కాగా రాష్ట్ర జలవనరుల శాఖాధికారులు ఈనెల 4,5 తేదీల్లో ఢిల్లీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ఆకృతుల కమిటీ బృందంతో ప్రత్యేకించి, సమావేశమయ్యారు. 4వ తేదిన పోలవరం ప్రాజెక్టు గేట్ల నిర్మాణం,నాణ్యత ఇతరఅంశాలపై చర్చించారు. ఈ క్రమంలోనే శుక్రవారం కేంద్ర జలవనరుల శాఖాధికా రులు తాజాగా ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి సంబంధించి ఆమో దం తెలిపినట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి కీలక మైన ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి సంబంధించి గత కొంత కాలంగా వివాదం ఏర్పడిన సంగతి తెలిసిందే. అసలు దీని నిర్మాణం అవసరం లేదని కొందరు, అవసరమని మరికొంతమంది వాదించడం తో కేంద్ర జలవనరుల శాఖాధికారులు ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణా న్ని నిలిపేసిన సంగతి తెలిసిందే. దిగువ కాఫర్ డ్యామ్‌నిర్మాణానికి అనుమతిచ్చిన కేంద్రం ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి ఆనాడు అభ్యంతరం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణం ఆపేసి,మిగతా పనులను చేసుకుంటూ పోతుంది. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఈ విషయ మై పలు మార్లు కేంద్రంతో మాట్లాడారు. ప్రధాని దగ్గర నుంచి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ప్రత్యేకించి, చర్చించడం జరిగింది. కాఫర్ డ్యామ్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళికను కూడా కేంద్రానికి అందజేశారు. ఈ క్రమంలోనే కేంద్రం ప్రభుత్వం ఇందుకు సంబంధించి విచారణ జరిపి,నివేదిక అందజేసేందుకు జాతీయ జలవిద్యుత్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) నిపుణుల బృందాన్ని గత నెలలో రాష్ట్రానికి పంపించింది. దీంతో నిపుణుల బృందం పోలవరం ప్రాజెక్టును సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపింది. కాఫర్ డ్యామ్‌ను ప్రధాన డ్యామ్‌లో భాగంగా నిర్మించాలా ? లేక విడిగా నిర్మించాలా? లేదా పాక్షికంగా నిర్మించాలా ? అన్న కోణంలో నిపుణుల కమిటీ విచారించింది. ఈ మధ్యే ఈ విషయమై కేంద్రానికి నివేదిక కూడ అందజేసింది. ఆ నివేదికలో పోలవరం ప్రాజెక్టులో కొంత ప్రధాన డ్యామ్ ..మరికొంత కాఫర్ డ్యామ్ నిర్మించి, ఈ రెండింటిని అనుసంధానించడం ద్వారా నీటిని నిలబెట్టవచ్చని ఎన్‌హెచ్‌పీసీ కేంద్రానికి నివేదిక ఇచ్చిందంటున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రధాన డ్యామ్‌ను నిర్మించవచ్చని సూచించింది. దీని వల్ల వ్యయం కూడా బాగా తగ్గుతుందని కేంద్రానికి నివేదించింది. అయితే ప్రభుత్వం ఎగువ కాఫర్‌డ్యామ్‌ను 42.5 మీటర్ల ఎత్తులో నిర్మించాలని ప్రతిపాదించిన సంగతి తెలిసిందే.ఇలా చేస్తే 2018 జూన్ కల్లా గ్రావిటీ ద్వారా నీటిని అందించవచ్చని రాష్ట్రప్రభుత్వం భావిస్తున్నది. అయితే స్పిల్‌వే,స్పిల్ చానల్‌కు సంబంధించిన కాంక్రీట్ పనులు వేగంగా జరగకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కాంట్రాక్టర్ నుంచి కొన్ని పనులను వేరు చేసి,రూ. 1483 కోట్లకు నవంబర్ నెలలో టెండర్లు పిలిచింది. కాఫర్ డ్యామ్ వ్యవహారం తేలేంతవరకు టెండర్ ప్రక్రియను కూడా నిలిపేయాలని కేంద్రం ఆదేశించడంతో పాటు ప్రధాన కాంట్రాక్టరైన ట్రాన్స్‌స్ట్రాయ్‌కు పనుల్లో పురోగతికి నెలరోజుల గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో పిలిచిన టెండర్లను తాత్కాలికం నిలిపేసి, టెండర్ ప్రక్రియను గత నెలలో పొడిగించారు. ఈ శుక్రవారంతో ఆ గడువు కూడా ముగిసింది. మళ్లీ టెండర్ల గడువును పొడిగించారంటున్నారు. తాజాగా కేంద్రం ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి, టెండర్ ప్రక్రియకు పచ్చజెండా ఊపడంతో పనుల్లో మరింత వేగం పుంజుకునే అవకాశం ఏర్పడింది. ఇలా ఉంటే త్వరలో పూర్తి స్థాయిలో బాచింగ్‌ప్లాంట్, కూలింగ్ ప్లాంట్ అందుబాటులోకి రానున్నాయి. ఇవి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే కాంక్రీట్ పనులు మరింత వేగంతో జరుగుతాయి. వారానికి 3 లక్షల క్యూబిక్ మీటర్ల చొప్పున ఏప్రిల్ నాటికి తవ్వకంలో కీలకభాగం పనులు పూర్తి చేసేందుకు అవకాశం ఏర్పడుతుందంటున్నారు. రెండు నెలల విరామం తర్వాత త్రివేణి సంస్థ మళ్లీ తిరిగి పనులు మొదలు పెట్టడడంతో పనులు మరింతగా ఊపందుకున్నాయంటున్నారు. ఇప్పటివరకు 6.96 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి ,రాతి తవ్వకం పనులు పూర్తి చేశారు. అదే విధంగా 33,523 క్యూబిక్ మీటర్ల వరకు స్పిల్‌వే,స్టిల్లింగ్ బేసిన్ కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. 84.6 మీటర్ల మేర డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం జరిగింది. తాజాగా నిర్ణయంతో పోలవరానికి అన్ని అడ్డంకులు తొలగాయంటున్నారు.

నేడు రెండు కొత్త విమాన సర్వీసులు ప్రారంభం



కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు

తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: తిరుపతి నుంచి హైదరాబాద్ మీదుగా ఢిల్లీకి, తిరుపతి నుంచి నేరుగా బెంగుళూరుకు వెళ్లే ఇండిగో విమానసర్వీసులను ఆదివారం ప్రారంభించనున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖమంత్రి అశోక్ గజపతి రాజు వెల్లడించారు. రెండురోజుల తిరుపతి, తిరుమల పర్యటన నిమిత్తం ఆయన శనివారం మధ్యాహ్నం ఇక్కడి రేణి గుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు విలేకరులతో మాట్లాడుతూ భారత దేశీయ విమానయానం ప్రయాణికుల సంఖ్యాపరంగా పెరిగిందని, ప్రస్తుతం సంబంధిత రంగం ప్రపంచంలోనే మూడోస్థానంలో ఉందన్నారు. ఇంకా దేశీయ విమానయానాన్ని పెంచడాని కి విమానాశ్రయాల అభివృద్ధి, విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. వివిధ నగరాల మధ్య కనెక్టివిటీని పెంచడానికి కూడా కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతు న్నాయని, కొందరు చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నా ఫలించదన్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీ తెలుగుదేశం పొత్తు కొనసాగుతుందని అంటూ, ఎవరు గెలుస్తారనే విషయాన్ని చెప్పడానికి తాను జ్యోతిష్యుడ్ని కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తీసుకురావడానికి నిరంత రాయంగా కృషి చేస్తున్నానన్నారు. జన్మభూమి మాఊరు మంచి కార్యక్ర మమని, ఆ కార్యక్రమం అర్థం తెలియనివారే విమర్శిస్తారన్నారు. అంతకు ముందు అశోక్‌గజపతిరాజుకు తిరుపతి సబ్ కలెక్ట ర్ నిశాంత్ కుమార్, ఎయిర్ పోర్టు డైరెక్టర్ పుల్లా తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. వారి స్వాగత సత్కారాలను అందుకున్న మంత్రి నేరుగా తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

శ్రీవారి సేవలో అశోక్ గజపతిరాజు

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని శనివారం సాయంత్రం విమానయాన శాఖ మంత్రి అశోక్‌గజపతిరాజు దర్శించుకున్నారు. ముందుగా తిరుమల చేరుకున్న కేంద్రమంత్రికి పద్మావతి అతిథిగృహాల వద్ద ఓఎస్‌డి లక్ష్మినారాయణ యాదవ్ పుష్పగుచ్ఛంతో సాదర స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. కొద్దిసేపు విరామం అనంతరం శ్రీవారి ఆలయం ముందు నిర్వహించే సహస్రదీపాలంకార సేవలో కుటుం బ సభ్యులతో కలసి పాల్గొన్నారు. అనంతరం శ్రీ భూవరాహస్వామిని దర్శించుకుని అక్కడి నుంచి నేరుగా ఆలయంలోకి చేరుకుని స్వామివారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులకు వేదపండితులు ఆశీర్వచనం పలుకగా టిటిడి అధికారులు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

12న ఢిల్లీకి సీఎం చంద్రబాబు

పోలవరం, విభజన అంశాలపై చర్చ

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 12న ఢిల్లీకి వెళ్లను న్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధానంగా విభజన హామీలు , పోలవరం తదితర అంశాలపై ప్రధానితో ముఖ్యమంత్రి చర్చించనున్నారు. ఇప్పటికే విభజన హామీల ప్రకారం కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, ఇంకా రావాల్సిన బకాయిలపై అధికార యంత్రాంగం కసరత్తు ప్రారం భించింది. అదే విధంగా పోలవరంకు సంబంధించి కాంట్రాక్టర్ మార్పుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణానికి వెచ్చించిన వ్యయం లెక్కలను తయారు చేస్తున్నారు. ఏడాది కాలం తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానితో భేటీ కావడం పట్ల రాజకీయ వర్గాల్లో సర్వత్ర ఆసక్తి నెలకొంది. ఇటీవల కాలంలో బీజేపీ, టీడీపీ మధ్య విభేదాల కారణంగా చంద్రబాబు కు ప్రధాన మంత్రి అపాయిన్మెంట్ లభించలేదంటూ పుకార్లు షికార్లు చేశాయి. దీనికి తోడు రాష్ట్రానికి చెందిన కొందరు బిజెపి నేతలు, ప్రజాప్రతినిధులు తెలుగుదేశం పార్టీపై విమర్శలు కురిపించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కు ఈ నెల 12వ తేదిన కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడంతో మరింత ఉత్కంఠ నెలకొంది. విభజన చట్టంలోని 9,10 షెడ్యూల్‌లోనిపరిష్కారంకాని అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లే అవకాశముంది. నవ్యాంధ్ర జీవనాడి పోలవరంను సకాలంలో పూర్తయ్యేందుకు కేంద్ర సహకారం కోరనున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న జాప్యానికి కారణమైన ప్రధాన కాంట్రాక్టర్ కంపెనీ అయిన ట్రాన్స్‌ట్రాయ్‌పై ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. సవరించిన అంచనాలకు అనుగుణంగా నిధులను విడుదల చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేయనున్నారు. అంతేకాకుండా ప్రాజెక్టు వ్యయం కన్నా భూసేకరణ వ్యయమే ఎక్కువ అవుంతుందన్న విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రధానితో ప్రత్యేకంగా చర్చించే అవకాశమున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ముఖ్యమంత్రి వెంట ఆర్థికశాఖా మంత్రి యనమల రామకృష్ణుడు, జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్‌తో పాటు ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ఢిల్లీ వెళ్ళన్నారు.

పోలవరాన్ని దుర్గమ్మే కాపాడాలి

● నేటి నుంచి కాంగ్రెస్ పాదయాత్ర ● 10న సత్యాగ్రహం: రఘువీరా

అమరావతి,ఆంధ్రప్రభ: ఇందిరాసాగర్ పోలవరం ప్రాజెక్టుని దుర్గమ్మే కాపాడాలని ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న కనకదుర్గమ్మను ప్రార్థించానని, ఏపిసిసి చీఫ్ రఘువీరారెడ్డి తెలిపారు. కేంద్రప్రభుత్వ నిధులతో పోలవరం పూర్తికావాలని, పోలవరం నిర్వాసితులు అందరికి న్యాయం చేయాలన్న విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకున్న లక్ష్యాలను తెలియచేయడమే తమ లక్ష్యమని రఘువీరా తెలిపారు. ఆదివారం నుంచి పదవ తేదీ వరకు కాంగ్రెస్ పార్టీ ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు పాదయాత్ర చేయను న్న నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై ఘాట్ రోడ్ నుంచి కాలినడకన వెళ్లి రఘువీరారెడ్డి అమ్మవారిని శనివారం దర్శించుకున్నారు. ఘాట్ రోడ్‌లోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద 101 కొబ్బరి కాయలను కొట్టాక రఘువీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘాట్ రోడ్ నుంచి అమ్మవారి ఆలయానికి చేరుకుని దర్శనానంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కళ్లు తెరిపించాలని అమ్మవారిని వేడు కున్నట్లు చెప్పారు. పిసిసి ఉపాధ్యక్షుడు తులసీరెడ్డి, నాయ కులు ఆకుల శ్రీనివాసకుమార్, మీసాల రాజేశ్వరరావు, కొలనుకొండ శివాజీ తదితరులు రఘువీరా వెంట ఉన్నారు.

మూడురోజులపాటు పోలవరం పాదయాత్ర : ఎన్. తులసిరెడ్డి

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు వద్దకు ఈ నెల 7,8,9 తేదీల్లో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్. తులసిరెడ్డి పేర్కొన్నారు. పోలవరం పాద యాత్ర ఉద్దేశాన్ని ఆయన ప్రభ న్యూస్‌కు శనివారం వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టును 2018-19కి పూర్తి చేయాలని, ఈ ప్రాజెక్టును పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులతోనే పూర్తి చేయించాలని, ఈ ప్రాజెక్టు వల్ల నిర్వా సితులైన వారికి పూర్తిగా న్యాయం చేకూర్చాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణపు పనుల విషయంలో నాణ్యత అంశంలో ఎలాంటి రాజీలేని దోరణి లేకుండా కృషి చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ తరపున ఈ పాదయాత్రను తలపెట్టినట్లు తులసిరెడ్డి పేర్కొన్నారు. మూడు రోజుల పాటు పాదయాత్ర నిర్వహించి ఆ తర్వా త ఈ నెల 10న పోలవరం ప్రాజెక్టు వద్ద సంబంధిత డిమాండ్‌లతో సామూహిక నిరాహార దీక్షలు చేపడతామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు, పార్టీలకు అతీతంగా రాజకీయ పార్టీ నేతలందరూ, భక్తులు, ఈ ఆలయ ప్రాశస్త్యాన్ని , పవిత్రతను కాపాడే ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తులసిరెడ్డి అభిప్రాయపడ్డారు.

ట్రాన్స్‌స్ట్రాయ్‌పై నీలినీడలు

● చుట్టుముట్టిన సమస్యలు ● కేంద్రం నిర్ణయంతో మరింత ఇబ్బంది ● 60 సీ నిబంధనం కింద టెండర్లు ● మళ్లీ టెండర్ గడువు పొడిగింపు?

అమరావతి, ఆంధ్రప్రభ : పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి గతంలో నిలిపేసిన టెండర్ ప్రక్రియకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ప్రాజెక్టు ప్రధాన గుత్తేదారు ట్రాన్స్‌స్ట్రాయ్ భవిష్యత్‌పై నీలిమేఘాలు అలుముకుంటున్నాయంటున్నారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులు చేయడంలో బాగా వెనుకబడిన క్రమంలోనే రాష్ట్రప్రభుత్వం స్పిల్‌వే, స్పిల్ చానల్‌కు సంబంధించిన కాంక్రీట్ పనులను వేరే సంస్థకు అప్పగించేందుకు నవంబర్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. సుమారు రూ. 1,483 కోట్ల విలువైన స్పిల్‌వే కాంక్రీట్ పనులకు టెండర్లు పిలిచారు. అయితే దీన్ని సవాల్ చేస్తూ ట్రాన్స్‌స్ట్రాయ్ కేంద్రాన్ని ఆశ్రయించింది. తనకు కొంత గడువు ఇస్తే పనుల్లో పురోగతి చూపిస్తానని చెప్పడంతో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ట్రాన్స్‌స్ట్రాయ్‌కు నెల రోజుల గడువిచ్చారు. ఇప్పటికే ఆ గడువు కూడా పూర్తికావస్తోంది. అయినా పనుల్లో పురోగతి లేదని ప్రభుత్వం కేంద్రానికి నివేదించిందంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా కేంద్రం పునఃపరిశీలన చేసి, గతంలో నిలిపేసిన టెండర్ల ప్రక్రియను ముందుకు తీసుకుపోయేందుకు కేంద్ర జలవనరుల శాఖ ఆమోదం తెలిపిందంటున్నారు.అంటే ఇది ఒక విధంగా ట్రాన్స్‌స్ట్రాయ్ కు ఇబ్బందికరమైన పరిణామమేనని అంటున్నారు. ఇప్పటికే పలు సమస్యలతో సతమతమవుతున్న ట్రాన్స్‌స్ట్రాయ్‌కి తాజా కేంద్రం నిర్ణయం మరింత ఆందోళన కలిగించే అంశమేనంటున్నారు. ఇటీవల కెనరా బ్యాంక్ హైదరాబాద్‌లో జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో ట్రాన్స్‌స్ట్రాయ్‌పై దివాలా పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. రూ. 725 కోట్లు బకాయి పడిందని, ఎన్నిసార్లు అడిగినా రుణం చెల్లించకుండా ఇబ్బందిపెడుతున్నందున ట్రాన్స్‌స్ట్రాయ్‌ను దివాలా తీసినట్లుగా ప్రకటించి, దివాలా ప్రక్రియను ప్రారంభించి, రుణ వసూ లుకు చర్యలు తీసుకోవాలని కెనరా బ్యాంక్ కోరిన సంగతి తెలిసిందే. మళ్లీ ఆ విషయం మరిచిపోకముందే శుక్రవారం దేనా బ్యాంక్ సిబ్బంది కోర్టు ఆదేశాలతో పోలవరం సైట్‌కు వెళ్లి, నానా హంగామా చేయడమే కాకుండా ట్రాన్స్‌స్ట్రాయ్‌కు చెందిన మూడు వాహనాలను సీజ్ చేయడం ఆ సంస్థకు మరింత ఇబ్బందికరమేనని భావిస్తున్నారు. కెనరా బ్యాంక్ స్ఫూర్తితో మరిన్ని బ్యాంకులు ట్రాన్స్‌స్ట్రాయ్‌పై వత్తిడి పెంచాయంటున్నారు. కెనరా బ్యాంక్ ట్రాన్స్‌స్ట్రాయ్‌పై దాఖలు చేసిన దివాలా ప్రక్రియ పిటిషన్‌తో ఇప్పటికే ట్రాన్స్‌స్ట్రాయ్ అనేక ఇబ్బందుల్లో పడింది. దీంతో ఎక్కడా కూడా ఆ కంపెనీకి రుణం విషయంలో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయంటున్నారు. వరుసగా జరుగుతున్న ఈ పరిణామాలన్నింటినీ గమనించిన రాష్ట్రప్రభుత్వం ఈ వ్యవహారాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలోనే తాజా నిర్ణయం వెలువడిందంటున్నారు. నిలిపేసిన టెండర్ ప్రక్రియను తిరిగి కొనసాగించుకోవచ్చని కేంద్ర జలవనరుల శాఖ అనుమతి ఇచ్చిందంటే అది ట్రాన్స్‌స్ట్రాయ్‌కు ఎదురుదెబ్బేనంటున్నారు. కాగా కేంద్రం నిర్ణయంతో స్పిల్‌వే,స్పిల్‌చానల్‌కు సంబంధించిన కాంక్రీట్ పనుల టెండర్ల ఖరారుకు మార్గం సుగమమైనట్లు తేలిపోయింది. సుమారు రూ. 1483 కోట్ల స్పిల్‌వే,స్పిల్ చానల్ పనులకు నవంబర్ నెలలో టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. ' 60 సి ' నిబంధన కింద ఈ టెండర్లు పిలిచారు. స్పిల్‌వేలో ఒకటి నుంచి 35వ బ్లాక్ వరకు కాంక్రీట్ పనులకు, స్పిల్ చానల్ తవ్వి 18 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేసేందుకు ఈ టెండర్లు పిలిచారు. 36 వ బ్లాక్ నుంచి 52 బ్లాక్ వరకు ట్రాన్స్‌స్ట్రాయ్ కంపెనీ చేసే విధంగా ప్రభుత్వం 60 సీ నిబంధనసురించి టెండర్లు పిలవడం జరిగింది. ఇప్పటికే రెండుసార్లు టెండర్ గడువును కూడా పొడిగించారు. దీంతో చాలా కంపెనీలు పనులు దక్కించుకునేందుకు టెండర్లు దాఖలు చేశాయి. అయితే మళ్లీ కేంద్రం సూచనల మేరకు మరికొద్ది రోజులు టెండర్లు దాఖలుకు గడువు పొడిగించారంటున్నారు. ఇప్పటికే పనులు తీవ్ర ఆలస్యమైనందున ఎక్కువ రోజులు గడవు ఇవ్వకుండా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఏది ఏమైనా ట్రాన్స్‌స్ట్రాయ్ నుంచి కొన్ని పనులు వేరే సంస్థకు తరలిపోయే పరిస్థితి రావడం గమనార్హం.ఈ మార్పుల నేపథ్యంలో ట్రాన్స్‌ట్రాయ్ ఎలా స్పందిస్తున్నది వేచి చూడాలి మరి. అయితే కేంద్రం నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఆనందంలో ఉన్నారు. ఇక పోలవరం పనులు మరింత ఊపందుకోవడమే కాకుండా ప్రతిపక్షానికి గుణపాఠం చెప్పినట్లయిందని అంటున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో ఐదు అంచెలుగా పంటలు

పద్మశ్రీ సుభాష్ పాలేకర్



అమరావతి, ఆంధ్రప్రభ : ప్రకృతి వ్యవసాయంలో పంటలను ఐదంచెలుగా వేయడం ద్వారా రైతులు అతి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను పొందవచ్చని పద్మశ్రీ సుభాష్ పాలేకర్ తెలియజేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా గల బైబిల్ మిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమంలో ఏడవ రోజైన శనివారం ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ప్రకృతి సేద్య విధానంలో మొదటి అంచెలో మామిడి, చిత తదితర పెద్ద వృక్షాలు ఉంటాయని, వాటి క్రింద బత్తాయి, కాఫీ, కమలా వంటి చెట్ల జాతులు, వాటి క్రింద దానిమ్మ, సీతాఫలం వంటి పొద జాతి మొక్కలు, నాలుగవ స్థాయిలో కందులు, మిరప, పసుపు వంటి పంటలు, ఐదవ వరుసలో నేలను సంపూర్ణంగా సజీవ ఆచ్ఛాదనగా నేలను కప్పి ఉంచే ఉలవలు వంటి తీగజాతి పంటలను వేయడం జరుగుతుందన్నారు. ఈ ఐదు అంచెల విధానంతో ఒక సెకనుకు 9 మీటర్ల వేగంతో వర్షాలు వచ్చినా చెట్లు, కొమ్మలు, ఆకులు వేగాన్ని నియంత్రించి, తుంపర్లగా మార్చి ప్రతి వర్షం బొట్టు భూమిలోకి ఇంకిపోతుం దన్నారు.

ఐదంచెల పంటలతో రాయలసీమ కరవు మాయం

పంటలు పండించే నేలలు సస్యశ్యామలం కావాలంటే కర్బనం, నత్రజనిలతోనే సాధ్యమని పాలేకర్ వెల్లడించారు. ప్రస్తుతం మన దేశ నేలల్లో 0.2 శాతం మాత్రమే కర్బనం ఉందని, కానీ 10:1 నిష్పత్తిలో కర్బనం, నత్రజనిలు ఉన్నపుడే నేలలు సారవంతంగా మారతాయన్నారు. జీవన ద్రవ్యం తయారీతోనే ఈ సమస్యను అధిగమించవచ్చని, దీనికోసం ప్రకృతి సేద్యం వైపుగా రైతులు అడుగులు వేయాలన్నారు. నవ్యాంధ్ర ప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం దిశగా సీఎం చంద్రబాబు ప్రోత్సహించడం అభినందనీయ మని, కరువు జిల్లాలుగా పేరుబడిన రాయలసీమ జిల్లా లు పంటలతో పాడి, పంటలతో కళకళలాడాలంటే ప్రకృతి సేద్యంలోని ఐదు అంచెల విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈశాన్య జిల్లాల్లో కూడా ఇదే విధానాన్ని అవలంభిస్తే మంచిదని, తోటల పెంపకంలో కూడా ఇదే విధానం అనుసరిస్తే అద్భుత ఫలితాలను పొందవచ్చన్నారు.

ప్రకృతి సేద్యం విస్తరణకు ప్రణాళికలు సిద్ధం

వ్యవసాయ శాఖ సలహాదారు విజయ్ కుమార్

లాభసాటి సాగులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రకృతి సేద్యం విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు టి.విజయ్ కుమార్ తెలియజేశారు. అమరావతి కేంద్రంగా ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్ర రైతాంగానికి ఇస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి ఆయన శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం 42 లక్షల హెక్టార్లలో పంటల సాగు జరుగుతోందని, వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఐదు లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యంతో పంటలను పండించేలా చర్యలు చేపట్టామన్నారు. అమరావతి కేంద్రంగా ఇస్తున్న ప్రకృతి సేద్య శిక్షణలకు పొరుగు రాష్ట్రమైన తెలంగాణాకు చెందిన 500 రైతులు హాజరయ్యారని, ఆది, సోమవారాల్లో ఉత్తర భారతంలోని రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు కూడా ఈ శిక్షణలకు రానున్నారని ఆయన తెలిపారు.

సేంద్రీయ వ్యవసాయంపై విమర్శలు తగదు


● రాష్ట్రశాసన సభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్



అమరావతి, ఆంధ్రప్రభ : సేంద్రీయ వ్యవసాయ విధానంపై ప్రకృతి సేద్య విప్లవ పితామహుడు సుభాష్ పాలేకర్ విమర్శలు చేయడం తగదని రాష్ట్ర శాసన సభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ వెల్లడించారు. శనివారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయం రెండూ మంచివే అని, ఈ రెండు విధానాల ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయ ని చెప్పారు. నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటలు ప్రకృతి సాగులో వస్తాయని, అలాగ ని సేంద్రీయ సాగు హానికరమంటూ వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలను కించపరిచేలా పాలేకర్ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఈ రోజు ల్లో చిన్న, సన్నకారు రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని చేపట్టడం చాలా తక్కువ అవకాశాలు ఉన్నాయని, ఈ తరహా సేద్యానికి గోసంపద చాలా అవసరమంటూ అంత పెద్ద మొత్తంలో గోసంపద సాధారణ రైతుల వద్ద ఉండదన్నారు. ప్రజలకు, రైతాంగా నికి అవగాహన పెంపొందించడం ద్వారా గోసంపదను పెంచవచ్చని తద్వారా ప్రకృతి సేద్యం దిశగా అడుగులు వేసేలా ప్రోత్సహించవచ్చన్నారు. కానీ అంతర్జాతీయంగా అద్భుత ఫలితాలు ఇస్తున్న సేంద్రీయ సాగును తప్పుపడుతూ రైతాంగాన్ని భయభ్రాం తులకు గురి చేయడం తగదని, ఒకేసారి లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం సాధ్యం కాదన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ రోజుల్లో వ్యవసాయంలో యాంత్రీకరణ ఎంతో అవసరమని, సేంద్రీయ సాగు చేపడుతున్న రైతులు హైబ్రీడ్ వంగడాలను ఉపయోగిస్తూ అధిక దిగుబడులు పొందుతున్నారని వివరించారు. దేశంలో ఎక్కువగా రసాయనిక పురుగుల మందులు వాడుతున్న రైతాంగం రాష్ట్రంలోనే అధికంగా ఉన్నారని, వారిలో కూడా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. పురుగుల మందుల వాడకంతో ఆహార పంటలు, నేల విషతుల్యం అవుతుందని, ఈ విషయాలను విమర్శలతోగాక అవగాహన సదస్సులతో తెలియజేస్తూ దశల వారీగా ప్రకృతి సేద్యం దిశగా రైతులు అడుగులు వేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

కొనసాగుతున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్శిటీ క్రికెట్‌మెన్ పోటీలు

● జేఎన్‌టీయు కాకినాడ, కృష్ణ, నాగార్జున, విజ్ఞాన్, ఉస్మానియా యూనివర్శిటీ టీమ్స్ గెలుపు



విశాఖ స్పోర్ట్స్, ప్రభ న్యూస్ : ఆంధ్ర విశ్వ విద్యాలయం, రఘు ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న సౌత్ ఇండియన్ యూనివర్సిటి పురుషులక్రికెట్ పోటీలు శనివారం ఉత్కంఠభరితంగా జరిగాయి. జెఎన్‌టియు కాకినాడకు నాధ్యాల్ అగ్రికల్చర్ యూనివర్శిటీకి జరిగిన మ్యాచ్‌లో జెఎన్‌టియు విజయం సాధించింది. క్రిష్ణా యూనివర్సిటీ మచిలీ పట్నంకు ఆదికవి నన్నయ్య యూని వర్శిటీకి జరిగిన మ్యాచ్‌లో క్రిష్ణా యూనివర్శిటీ 107 పరుగులతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో కౌశిక్ 49 బాల్స్ ఆడి 65 పరుగులు, నిఖిల్ 55 బాల్స్ ఆడి 70 పరుగులు చేసి విజయానికి తోడ్పడ్డారు. మధురై కామరాజు యూనివర్శి టీకి రాయలసీమ యూనివర్శిటీ కర్నూల్ కి జరిగిన మ్యాచ్‌లో ఎం.కె. యూనివర్సిటి 5 వికెట్లు తో విజయం సాధించింది. యోగి వేమన కడప యూనివర్శిటీకి ఉస్మానియా యూనివర్శి టీకి జరిగిన మ్యాచ్ లో ఉస్మానియా యూనివర్సిటి 79 పరుగులుతో విజయసాధించారు. ఎన్ రెడ్డి 68 పరుగులు చేసారు. నితిష్ 49 పరుగులు చేసారు. అలగప్పా యూనివర్శిటీ కరైకుడి కి కె. యూనివర్శిటీ సిమోగా కి జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్లు తేడాతో కె. యూనివర్శిటీ విజయం సాధించింది. యూనివర్శిటి ఆఫ్ మైసూర్ కు బెంగుళూరు యూనివర్శిటీకి జరిగిన మ్యాచ్ లో మైసూర్ యూనివర్శిటీ 46 పరుగులతో విజయంసాధించింది. కర్నాటక యూనివర్శిటీకి కాలికట్ కేరళకు జరిగిన మ్యాచ్ లో కాలికట్ యూనివర్శిటీ 6 వికెట్లు తో విజయంసాధించింది. విజ్ఞాన్ యూనివర్శిటి గుంటూరుకు వివిఎస్‌కె యూనివర్శిటీ బళ్లారి కి జరిగిన మ్యాచ్ లో విజ్ఞాన్ యూనివర్శిటీ 78 పరుగులతో విజయం సాధించారు. యూనివర్శిటి ఆఫ్ అగ్రికల్చర్ సిమోగాకు బెర్త్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ తమిళనాడుకు జరిగిన మ్యాచ్ లో బెర్త్ ఇనిస్టిట్యూట్ 115 పరుగలుతో ఘన విజయం సాధించింది. అన్నామలై యూనివర్శిటికి రాని చిన్నమ్మ యూనివర్శిటీకి జరిగిన మ్యాచ్ లో అన్నామలై యూనివర్శిటీ 3 వికెట్లు తో విజయం సాధించారు. భారితియార్ యూనివర్శిటికి శ్రీ వెంకటేశ్వరా యూనివర్శిటీ తిరుపతికి జరిగిన మ్యాచ్ లో శ్రీ వెంకటేశ్వరా యూనివర్శిటి 2 వికెట్లు తేడాతో విజయం సాధించారు. పి.ఇ.ఎస్. యూనివర్శిటీకి ఎస్. సిహెచ్.ఎస్.వి.ఎం. యూనివర్శిటి కి జరిగిన మ్యాచ్ లో పి.ఇ.ఎస్. యూనివర్శిటి 18 పరుగులతో విజయం సాదించారు. అమృత విశ్వవిద్యాపీఠం బెంగుళూరు కు సవితా యూనివర్శిటీ చెన్నై కి జరిగిన మ్యాచ్‌లో అమృత విశ్వవ విద్యాపీట్ 5 వికెట్లు తో విజయం సాధించింది. ధామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటికి డాక్టర్ ఎం.జి.ఆర్. ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ యూనివర్శిటీకి జరిగిన మ్యాచ్‌లో డాక్టర్ ఎం.జి.ఆర్ 44 పరుగులతో విజయం సాదించిందిని ఏయూ డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, అండ్‌స్పోర్ట్స్ సైన్స్ డైరెక్టర్ (హెచ్ఓడి) ఆచార్య ఎన్. విజయమోహన్ తెలిపారు.

క్రీడాప్రభ

భారత్ 92-7... హేమా హేమీ బ్యాట్స్‌మెన్ ఒకరి వెంట ఒకరు క్యూ కట్టారు... మిస్టర్ డిపెండబుల్ పుజారా దక్షిణాఫ్రికా పేసర్ల భీకర బంతుల్ని ఎదుర్కొని రెండు గంటలకు పైగా నిలిచినా భారీ స్కోరు సాధించలేకపోయాడు... 92 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన జట్టును ఆదుకునేదెవరు? ఎవరా ఆపద్బాంధవుడు! ఇలా మథనపడుతున్న భారత క్రికెట్ అభిమాని మనసుకు ఊరట కలిగిస్తూ.. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య (93) ప్రతాపం చూపించాడు. దక్షిణాఫ్రికా బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. భయం అనేది తన నిఘంటువులోనే లేదన్నట్లు స్టెయిన్ బృందాన్ని ఢీకొన్నాడు. ఉపఖండపు పిచ్‌లపైనే కాదు... దక్షిణాఫ్రికా వంటి వికెట్లపైనా మొనగాడిలా బ్యాటింగ్ చేయగలనని చాటాడు. తాను వరల్డ్ క్లాస్ ఆల్‌రౌండర్‌నని చెప్పకనే చెప్పాడు. ఆల్‌రౌండ్ దిగ్గజంకపిల్‌దేవ్ వీరోచిత ఇన్నింగ్స్‌ను గుర్తుకు తెచ్చాడు! స్టెయిన్ పేస్ దళం బంతుల్ని చీల్చి చెండాడు. తన సహజసిద్ధమైన శైలిలో ఆడి దక్షిణాఫ్రికాను ఒత్తిడిలోకి నెట్టాడు. భారీ ఆధిక్యం సాధిద్దామనుకున్న వారి ఆశలపై నీళ్లు చల్లాడు. ఆ జోరులో సెంచరీ సాధిస్తాడనుకున్న 7 పరుగుల తేడాలో ఆ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. అయితేనేం భారత్‌కు మ్యాచ్‌లో పోటీనివ్వదగ్గ స్కోరు సాధించిపెట్టాడు. జట్టు స్కోరులో సగం పాండ్య సాధించిందే! దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు కూల్చి బౌలింగ్‌లోనూ పాండ్య సత్తా చాటాడు. పాండ్య మెరుపులతో తొలి టెస్ట్ ఆసక్తికరంగా మారింది.

పాండ్యా ఎదురుదాడి

తోడ్పాటునందించిన భువీ

భారత్ 209 ఆలౌట్

దక్షిణాఫ్రికా 65-2

95 బంతుల్లో 93 పరుగులు : 14 ఫోర్లు, 1 సిక్స్

కేప్‌టౌన్: పాండ్య 93, 95 బంతుల్లో, 14 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో భారత్ రెండో రోజుశనివారం తొలి ఇన్నింగ్స్‌లో 209 పరుగులు సాధించింది. పాండ్యకు భువనేశ్వర్ (25, 86 బంతుల్లో, 4 ఫోర్లు) సమయోచితంగా తోడ్పాటునందించాడు. వీరిద్దరు కలిసి 8వ వికెట్‌కు 99 పరుగులు జోడించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఆలౌటైన వెంటనే రెండో ఇన్నిం గ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా.. పాండ్య ధాటికి 59 పరుగు లకే రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు మర్‌క్రమ్ (34), ఎల్గర్ (25)లను పాండ్య పెవిలియన్ దారి పట్టించాడు. ఆట ఆఖరుకు దక్షిణాఫ్రికా 2 వికెట్లకు 65 పరుగులు చేసింది. ఇప్పటికి భారత్‌పై 142 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఇంకా 8 వికెట్లు చేతిలో ఉన్నాయి.

దూకుడే మంత్రం: పాండ్య వీరోచిత బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చేశాడు. ఉదయం సెషన్లో దక్షిణాఫ్రికా కీలక పుజారా (26, 92 బంతుల్లో, 5 ఫోర్లు) తీశారు. కానీ పాండ్య తిరుగులేని బ్యాటింగ్‌తో టీ విరామానికి భారత్ స్కోరును 185-7క ు చేర్చాడు. అప్పటికి టీమ్‌ఇండియా ఇంకా 101 పరుగులు వెనుకబడింది. 15 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇచ్చిన క్యాచ్‌ను డీన్ ఎల్గర్ జారవిడడంతో పాండ్యకు జీవనదానం లబించింది. అయినా పాండ్య దూకుడు తగ్గించుకోలేదు. తొలి రోజు డివిలియర్స్, డు ప్లెసిస్ ఎదురుదాడిని చూసిన పాండ్య అదే బాటను ఎంచుకున్నాడు. ఫిలాండర్ (3-33) బౌలింగ్‌లో ఒకే ఓవర్లో మూడు బౌండరీలు సాధించి తన ఉద్దేశాన్ని చెప్పకనే చెప్పాడు. మోర్నీ మోర్కెల్ (2-57) తనను పరీక్షించడానికి వేసిన షార్ట్ బంతిని పాండ్య తలపై నుంచి బౌండరీ దాటించాడు. అది అతనికి నాలుగో బౌండరీ. పాండ్య మిడాఫ్‌లోకి బంతిని బౌండరీ దాటించి 46 బంతుల్లో టెస్టుల్లో రెండో అర్ధసెంచరీ పూర్తిచేసుకు న్నాడు. రెండో రోజు మూడు వికెట్లు పడగొట్టిన రబాడ (3-34)ను సైతం పాండ్య విడిచి పెట్టలేదు. అతని బౌలింగ్‌లోనూ థర్డ్ మ్యాన్ దిశగా కళ్లు చెదిరే బౌండరీ సాధించాడు. మరో వైపు భువీ గోడలా నిలబడడంతో పాండ్యకు దూకుడు సాధ్యమైంది. భువీ తొలి పరుగు చేయడానికి 34 బంతులు ఆడాడు. రబాడ బౌలింగ్‌లో కవర్ డ్రైవ్‌తో బౌండరీ సాధించాడు. వీరిద్దరు పేసర్లను అలవోకగా ఎదుర్కొంటూ క్రీజులో పాతుకుపోవడంతో ఈ జోడీని విడదీయడానికి కెప్టెన్ డు ప్లెసిస్.. స్పిన్నర్ మహరాజ్‌ను ప్రవేశపెట్టాడు. కానీ అతను ఓ ఓవర్లో ఏకంగా 12 పరుగులు సమర్పించుకున్నాడు. మహరాజ్ ఓవర్లో పాండ్య ఓ సిక్స్, ఫోర్ సాధించాడు. ఆ ఓవర్లో పాండ్యకు 73 పరుగుల వద్ద మరోసారి డి కాక్ ద్వారా జీవనదానం లభించింది. 67వ ఓవర్లో భువీ ఔటైన కొద్ది సేపటికే పాండ్య సెంచరీ పూర్తి కాకుండానే రబాడ బౌలింగ్లో 9వ వికెట్‌గా వెనుదిరిగాడు. అప్పటికి భారత్ స్కోరు 199-9. పాండ్య, కుమార్ ఔటవ్వడంతో బారత్ శిబిరంలో ఇన్నింగ్స్‌పై ఆశలు సన్నగిల్లాయి. అందుకు తగినట్టే మరో 10 పరుగులకే టీమ్ ఇండియా కథ ముగిసింది. తొలి టెస్టు ఆడుతున్న బుమ్రా 2 పరుగు లకే వెనుదిరిగాడు. 209 పరుగులకు ఆలౌట్ కావడంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు భారత్ 77 పరుగులు వెనుక బడింది.

పుజారా పోరాటం: ఉదయం ఓవర్‌నైట్ స్కోరు 28-3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగిం చిన భారత్.. మరో 30 పరుగులకు రోహిత్ (11) వికెట్‌ను కోల్పోయింది. రోహితీ 59 బంతులాడినా 11 పరుగులే చేశాడు. మరో వైపు పుజారా దక్షిణాఫ్రికా బౌలర్లను ప్రతిఘ టించాడు. 92 బంతులెదుర్కొని 26 పరుగులు సాధించాడు. 76 పరుగుల వద్ద ఫిలాండర్ బౌలింగ్‌లో ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. అనంతరం పాండ్య కంటే ముందొచ్చిన అశ్విన్ (12) ఎక్కువ సేపు నిలవలేదు. సాహను స్టెయిన్ డకౌట్ చేశాడు. ఫిలాండర్, రబాడ మూడేసి వికెట్లు తీశారు.



పాండ్య 93

స్కోరు బోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1, ధావన్ (సి అండ్ బి) స్టెయిన్ 16, పుజారా (సి) డు ప్లెసిస్ (బి) ఫిలాండర్ 26, కోహ్లి (సి) డి కాక్ (బి) మోర్కెల్ 5, రోహిత్ (ఎల్బీ) (బి) రబాడ 11, అశ్విన్ (సి) డి కాక్ (బి) ఫిలాండర్ 12, పాండ్య (సి) డి కాక్ (బి) రబాడ 93, సాహా (ఎల్బీ) (బి) ,స్టెయిన్ 0, భువనేశ్వర్ (సి) డి కాక్ (బి) మోర్కెల్ 25, షమి నాటౌట్ 4, బుమ్రా (సి) ఎల్గర్ (బి) రబాడ 2, ఎక్స్‌ట్రాలు 14, మొత్తం (73.4 ఓవర్లలో ఆలౌట్) 209,

వికెట్ల పతనం: 1-16 (విజయ్), 2-18 (ధావన్), 3-27 (కోహ్లి), 4-57 (రోహిత్), 5-76 (పుజారా), 6-81 (అశ్విన్), 7-92 (సాహా), 8-191 (భువనేశ్వర్), 9-199 (పాండ్య), 10-209 (బుమ్రా).

బౌలింగ్: ఫిలాండర్ 14.3-8-33-3, స్టెయిన్ 17.3-6-51-2, మోర్కెల్ 19-6-57-2, రబాడ 16.4-4-34-3, మహరాజ్ 6-0-20-0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మర్‌క్రమ్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్య 34, ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్య 25, రబాడ బ్యాటింగ్ 2, ఆమ్లా బ్యాటింగ్ 4, ఎక్స్‌ట్రాలు 0, మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 65, **వికెట్ల పతనం:** 1-52 (మర్‌క్రమ్), 2-59 (ఎల్గర్)

బౌలింగ్: కుమార్ 6-3-16-0, బుమ్రా 4-0-14-0, షమి 5-1-15-0, పాండ్య 4-0-17-2, అశ్విన్ 1-0-3-0.

ఖవాజా సెంచరీ

సిడ్నీ: యాషెస్ సిరీస్‌లో చివరి టెస్టు దాదాపు ఆస్ట్రేలియా చేతుల్లోకి వెళ్లిపోయింది. ఉస్మాన్ ఖవాజా (171, 381 బంతుల్లో, 18 ఫోర్లు, 1 సిక్స్) భారీ సెంచరీ నమోదు చేయడంతో శనివారం మూడో రోజు ఆఖరుకు ఆసీస్ 4 వికెట్లకు 479 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇప్పటికే ఇంగ్లండ్‌పై 133 పరుగుల ఆధిక్యం సంపాదించి మ్యాచ్‌పై పట్టు బిగించింది. ఖవాజా.. యాషెస్‌లో తొలి శతకం సాధించాడు.

మార్ష్ సోదరులు షాన్ (98 బ్యాటింగ్, 207 బంతుల్లో, 10 ఫోర్లు), మిచెల్ (63 బ్యాటింగ్, 87 బంతుల్లో, 9 ఫోర్లు, 2 సిక్స్) అర్ధసెంచరీలు సాధించి ఇంకా క్రీజులో ఉన్నారు. ఉదయం ఓవర్‌నైట్ స్కోరు 193-2తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. మూడో రోజు రెండే రెండు వికెట్లు కోల్పోయింది. ఓవర్ నైట్ స్కోరు 44 పరుగులతో క్రీజులోకి అడుగుపెట్టిన కెప్టెన్ స్మిత్ (83, 158 బంతుల్లో, 5 ఫోర్లు) అర్ధసెంచరీ పూర్తి చేసుకొని సెంచరీ దిశగా సాగిపోతున్న తరుణంలో స్పిన్నర్ అలీ అతణ్ని ఔట్ చేశాడు. అలీ బౌలింగ్లో అతనికే క్యాచ్ ఇచ్చి స్మిత్ వెనుదిరిగాడు. ఖవాజాతో కలిసి స్మిత్ మూడో వికెట్‌కు 188 పరుగులు జోడించాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన షాన్ మార్ష్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 101 పరుగు జత చేసి ఖవాజా వెనుదిరిగాడు. తర్వాత షాన్, మిచెల్ కలిసి ఐదో వికెట్‌కు అజేయంగా 104 పరుగులు జోడించారు.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 346, **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** బాన్‌క్రాఫ్ట్ (బి) బ్రాడ్ 0, వార్నర్ (సి) బెయిర్‌స్టో (బి) అండర్సన్ 56, ఖవాజా (స్టంప్డ్) బెయిర్‌స్టో (బి) క్రేన్ 171, స్మిత్ (సి అండ్ బి) అలీ 83, షాన్ మార్ష్ బ్యాటింగ్ 98, మిచెల్ మార్ష్ బ్యాటింగ్ 63, ఎక్స్‌ట్రాలు 8, మొత్తం (157 ఓవర్లలో 4 వికెట్లకు) 479.

వికెట్ల పతనం: 1-1, 2-86, 3-274, 4-375,

బౌలింగ్: అండర్సన్ 30-11-52-1, బ్రాడ్ 23-2-70-1, అలీ 37-9-125-1, కుర్రాన్ 20-ృ2-71-0, క్రేన్ 39-3-135-1, రూట్ 8-3-21-0.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.



మెహరీన్

నిన్న తుపాకీ నేడు సినీ షూటింగ్!

టాలీవుడ్‌లో భవిష్యత్ నాదేనంటూ గర్వంగా ప్రకటిస్తోంది అందాల భామ మెహరీన్. ఆమె ఇలా చెప్పుకునేంత ధైర్యన్నిచ్చాయి వరుస విజయాలు. నాని సరసన కృష్ణగాడి వీర ప్రేమగాథ చిత్రంతో తెరంగేట్రం చేసిందీ పంజాబీ సుందరి. 2016లో ఒక్క చిత్రమూ లేని మెహరీన్ తరువాతి ఏడాదంతా స్టార్ హీరోల సరసన నటించి పేరు తెచ్చుకుంది. ప్రేక్షకులను ఆకట్టుకుని అగ్ర నాయికగా ఎదిగింది. శర్వానంద్‌తో నటించిన మహానుభావుడు, రవితేజ సరసన చేసిన రాజా ది గ్రేట్ బాక్సాఫీస్ హిట్స్‌గా మారాయి. మెహరీన్ దశ తిరిగి... కావాల్సినన్ని అవకాశాలు చేతికొచ్చాయి. దీంతో చెప్పరాని సంతోషంలో ఉందీ సుందరి. ఇంతకంటే ఎక్కువగా ఇంకేం కోరుకోను అంటోంది. ప్రస్తుతం తనకు దక్కిన గుర్తింపు నటిగా తన బాధ్యతను మరింత పెంచిందని చెబుతోంది. తీరిక లేకుండా ఉండటమే ఎక్కువ ఆనందాన్ని ఇస్తోందని, పని లేకుంటే నేను లేను... అంటోన్న మెహరీన్...నట ప్రయాణం, వ్యక్తిగత విశేషాలు ఆంధ్రప్రభ లైఫ్ పాఠకులకోసం-

పంజాబీ కుటుంబంలో పుట్టిన నేను మగరాయుడిలా పెరిగాను. చేతులకు గోరింటాకు, గోర్లకు రంగు వేసుకోవడం ఎప్పుడూ తెలియదు. సాహసవంతమైన ఆటలు ఆడేదాన్ని. ఇంట్లో ప్రతి ఒక్కరు ఏదో ఒక క్రీడ నేర్చుకోవాలనే షరతు ఉండేది. చాలా మంది అమ్మాయిలు దూరంగా ఉండే షూటింగ్ క్రీడను నేను ఎంపిక చేసుకున్నాను. మంచి తుపాకి కొని సాధన చేసేదాన్ని. అలా జాతీయస్థాయి పోటీల దాకా వెళ్లాను. ప్రధాన టోర్నమెంట్ జరిగే సమయానికి పరీక్షలు రావడం వల్ల షూటింగ్ క్రీడకు దూరమయ్యాను.

ఆ భయం లేదు...

షూటింగ్ క్రీడ తర్వాత నా ఆసక్తి మోడలింగ్ సినిమాల పైకి మళ్లింది. తెలుగులో కొత్త నాయిక కోసం చూస్తున్నారని తెలుసుకుని ఆడిషన్‌కు వెళ్లాను. అలా కృష్ణగాడి వీర ప్రేమగాథలో అవకాశం వచ్చింది. అమెరికాలో చాలా ఏళ్లు ఉన్నాను కాబట్టి నా అలవాట్లు, వేష ధారణలో పాశ్చాత్య ధోరణి కనిపించేది. కానీ తొలి చిత్రంలో వచ్చిన పాత్ర పల్లెటూరి అమ్మాయి, లంగా వోణి వేసుకుంటుంది, కోపమెక్కువ, అనుకున్నది సాధించాలనుకుంటుంది. ఇలా నేను పెరిగిన వాతావరణానికి పూర్తి భిన్నమైన పాత్ర తొలి చిత్రంలో చేశాను. ఈ క్యారెక్టర్ చేస్తున్నప్పుడు...దీని ప్రభావం రాబోయే సినిమాలపై పడుతుందా అనే సందేహం ఎప్పుడూ కలగలేదు. ఎందుకంటే నటన అంటేనే ప్రతిసారీ కొత్తగా కనిపించడం. ఒక్క తరహాకు పరిమితం చేస్తారని భయపడితే పరిశ్రమలో ఏదీ సాధించలేం.

2017 నా సంవత్సరంగా మారింది...

తొలి సినిమా విడుదలయి ఘన విజయం సాధించింది. ఆ తర్వాత తెలుగు, తమిళంలో కొన్ని కథలు విన్నాను. ఇంతలో బాలీవుడ్ నుంచి ఫిల్లూరి అనే చిత్రంలో అవకాశం వచ్చింది. అనుష్క శర్మ ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమా నాకు బాలీవుడ్‌లో చాలా గుర్తింపు తీసుకొచ్చింది. ఇప్పటికీ ముంబై వెళితే ఫిల్లూరి నటిగానే గుర్తుపడతారు. తొలి సినిమా విజయం తర్వాత సినిమాలు ఒప్పుకునేందుకు తొందరపడలేదు. నాకు నచ్చి, కథ, పాత్ర బాగుంటుంది అని నమ్మిన చిత్రాలే ఒప్పుకున్నాను. అలా ఒక ఏడాదంతా నా సినిమాలేవీ రాలేదు. అప్పుడు కొంత కంగారు పడ్డాను. సినిమాలు అంగీకరించినా...అవి ప్రారంభం కావడానికి ఆలస్యమవుతూ వచ్చింది. ఆ కొరత గతేడాది తీరిపోయింది. ప్రతి రెండు వారాలకు నా సినిమా ఒకటి తెరపైకి వచ్చింది. అలా 2017 పూర్తిగా నాదే అయ్యింది.

ఇప్పుడు ప్రతి ఉదయం ఉత్సాహమే...

నటిగా మారడం నా జీవితాన్ని మార్చేసింది. ఏ పనిలోనైనా ఏకాగ్రతగా ఉండటం, సమయాన్ని మరింత ఉపయోగించుకోవడం నేర్చుకున్నాను. నన్ను ఎప్పుడైతే ప్రేక్షకులు గుర్తించడం మొదలుపెట్టారో...అప్పటినుంచి నటిగా నా బాధ్యత పెరిగింది. చేసే పాత్రల్లో, ఎంచుకునే సినిమాల్లో ఇంకా శ్రద్ధ తీసుకోవడం మొదలుపెట్టాను. నాకు తీరికగా ఉండటం నచ్చదు. ఎప్పుడూ పనిచేస్తుండాలి. ఒకేసారి ఎక్కువ సినిమాలు చేయడాన్ని, ఒక చిత్రం నుంచి మరో చిత్రానికి ప్రయాణించడాన్ని ఆస్వాదిస్తాను. ఎప్పుడైనా తీరిక దొరికితే కుటుంబ సభ్యులతో, స్నేహితులతో గడుపుతుంటాను. ప్రయాణాలు చేయడం బాగా ఇష్టపడతాను. నటిగా మారిన తర్వాతే ప్రతి ఉదయం ఎంతో ఉత్సాహంగా, ఆసక్తిగా నిద్రలేస్తున్నాను.

కాజల్‌లా ఉండటం సంతోషమే కానీ...

నేను కాజల్‌లా ఉంటానని చెప్పడం సంతోషంగా అనిపిస్తుంటుంది. దశాబ్దానికి పైగా దక్షిణాది ప్రేక్షకులను అలరిస్తోంది కాజల్. ఆమెలా నేనూ ఎదిగితే అంతకన్నా కావాల్సింది ఏముంది. కాజల్ ఇప్పటికీ తన సత్తా చూపిస్తోంది. ఇక నుంచి నేనూ నా సామర్థ్యాన్ని చూపిస్తాను (నవ్వుతూ). ముఖ కవళికలు ఒకలా ఉన్నంత మాత్రాన నా అవకాశాలు ఆమెకు, ఆమె సినిమాలు నాకు ఇవ్వరు. ఎవరి ప్రతిభ వారికి ఉంటుంది. నేను చేసిన పాత్రలు కాజల్ చేయలేదు. ఆమెలా నేను నటించలేను.

అవి చెప్పను...

ప్రస్తుతానికి ఎవరి ప్రేమలోనూ పడలేదు. నా ప్రేమంతా సినిమాల మీదే. పెళ్లి చేసుకునే వయసు వచ్చిందని అనుకోను. నాకు కావాల్సిన వాడు బాగా నవ్వించాలి. ముఖ్యంగా నన్ను భరించగలగాలి. ఎందుకంటే నేను చాలా అల్లరి పిల్లను. నా పనులకు విసిగిపోకుండా ఉండాలి. మహిళలను గౌరవించే ప్రతి అబ్బాయి మంచివాడే అని నా అభిప్రాయం. కాబోయే వాడిలో కోరుకునే లక్షణాలు చాలా ఉన్నాయి. అవి చెప్పకూడదు.



ఆ సినిమాలో ఉపాధ్యాయురాలిగా...

2017లో బాలీవుడ్‌తో సహా దక్షిణాది సినిమాలు మర్చిపోలేని జ్ఞాపకాలను అందించాయి. ప్రస్తుతం గోపీచంద్ సరసన ఓ చిత్రంలో నటిస్తున్నాను. ఇందులో ఉపాధ్యాయురాలి పాత్రలో కనిపించబోతున్నాను. సామాజిక సేవలో భాగమయ్యే యువతి పాత్ర ఇది. కథానాయకుడితో కలిసి సామాజిక కార్యక్రమాలు చేస్తుంటాను. ప్రేక్షకులను ఆలోచింపజేసే చిత్రమవుతుంది. ఇప్పటిదాకా నేను నటించిన కామెడీ, రొమాంటిక్, హాస్య తరహా పాత్రలకు భిన్నంగా ఉంటుంది.

దక్షిణాదికే ప్రాధాన్యత

తెలుగు, తమిళం, హిందీలో సినిమాలు చేశాను. వీటిలో టాలీవుడ్ నాకు అమ్మ లాంటిది. మెహరీన్ అనే నాయిక పుట్టింది తెలుగులోనే. చాలా మంది నాయికలు దక్షిణాదిని మైదానంలా చూస్తారు. ఇక్కడ సాధన చేసి బాలీవుడ్‌కి వెళ్దామని అనుకుంటారు. కానీ నేను ఫిల్లూరి చిత్రంలో నటించాక దక్షిణాదికే ప్రాధాన్యమిచ్చాను.

✍ రమేష్ గోపిశెట్టి

మెహరీన్ మాటల్లో హీరోలు..



నాని : నా తొలి చిత్ర కథానాయకుడిగా నాని అంటే నాకెప్పుడూ ప్రత్యేకమే. మొదటి సినిమా చిత్రీకరణ సమయంలో ఎంతో ప్రోత్సహించారు. ప్రతిభావంతమైన నటుడు.



రవితేజ : నేను ఎక్కువగా అభిమానించే కథానాయకుడు. దివ్యాంగుడి పాత్రలోనూ ప్రేక్షకులు అతన్ని చూసేందుకు ఆసక్తి చూపించారు. ఆయనతో నటించిన రాజా ది గ్రేట్ నాకు మంచి విజయాన్నిచ్చింది.




శర్వానంద్ : నాకు మంచి స్నేహితుడు. మేము ఎప్పుడు కలిసినా సరదాగా ఉంటాం. బాగా కలిసిపోతాం.


సల్మాన్ ఖాన్: నా అభిమాన కథానాయకుడు , నిజం చెప్పాలంటే నా అభిమాన తారల జాబితా చాలా పెద్దది..

రంగవల్లి

15 చుక్కలు
15 వరుసలు




దామరాజు రస్మిత
ఎ ఎస్ రావు నగర్
హైదరాబాద్



14 చుక్కలు
6 వరుసలు
6 వచ్చే వరకు

మద్దుల పద్మావతి
కొత్తపేట, తెనాలి




19 చుక్కలు
1 వచ్చేవరకు

మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ,
8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

గుడిపాటి నాగలలిత
ఇ.సి.ఐ.ఎల్
హైదరాబాద్



16 చుక్కలు
4 వరుసలు
4 వచ్చే వరకు

యోగా టైమ్

రెండు ఆసనాలు..మెండు ఫలితాలు!



గాయత్రి
యోగా ట్రైనర్

సుప్త ఉదరాకర్షణాసనం

రెండు కాళ్లను చాచి ప్రశాంతంగా పడుకోవాలి. తరవాత రెండు చేతులూ భుజాలకు ఇరుపక్కలా విశాలంగా చాపాలి. ఇప్పుడు రెండు మోకాళ్లు. పాదాలను కలిపి ఉంచి...మోకాళ్ల వద్ద వంచుతూ నడుము కింది భాగం నుండి శరీరాన్ని కుడివైపుకి తిప్పుతూ... రెండుకాళ్లు కుడివైపున ఒకదానిపై ఒకటి వచ్చేలా చేస్తూ నేలకు ఆనించాలి. ఇలా చేస్తున్నపుడు శ్వాసను వదలాలి. ఈ స్థితిలో తలను ఎడమవైపుకి తిప్పి ఉంచాలి. అలా ఉండగలిగినంతసేపు ఉండి...శ్వాస తీసుకుంటూ కాళ్లను ఎత్తి...ఇప్పుడు ఎడమవైపుకి వంచాలి. తలను కుడివైపుకి తిప్పాలి. ఇలా పదిసార్లు చేయాలి.

శవ ఉదరాకర్షణాసనం

ముందుగా రెండుకాళ్లనూ చాచి వెల్లకిలా హాయిగా పడుకోవాలి. చేతులను మోచేతుల వద్ద మడిచి...ఒక చేతి వేళ్లను మరొక చేతి వేళ్లతో పట్టుకుని తలకింద పెట్టుకోవాలి. రెండు మోచేతులను నేలకు ఆనేలా ఉంచాలి. ఇప్పుడు కుడి మోకాలిని మడిచి...చాచి ఉన్న ఎడమ మోకాలి వద్ద కుడి పాదం ఉండేలా వంచాలి. ఇప్పుడు కుడి మోకాలు నేలకు తాకుతున్నట్టుగా ఉంటుంది. ఈ స్థితిలో తల కుడివైపుకి తిప్పి ఉంచి ఎడమచేత్తో కుడి మోకాలిని పట్టుకోవాలి. శ్వాస సాధారణ స్థితిలో ఉండాలి. తరువాత కుడికాలుని నిటారుగా ఉంచి... ఎడమ మోకాలిని కూడా వంచుతూ...ఇలాగే చేయాలి. కాలుని కిందికి దించేటప్పుడు శ్వాసని వదులుతూ...కాలుని పైకెత్తేటప్పుడు శ్వాసని తీసుకుంటూ ఉండాలి. మొదట ఒకటి లేదా రెండు సార్లు చేస్తూ...ఆ తరువాత పెంచుకుంటూ పోవాలి.



మోడల్ :స్నేహిత

ఉపయోగాలు

ఈ రెండు ఆసనాలు పొట్టకండరాలను గట్టిపరుస్తాయి. పొట్టలోపలి అవయవాలకు మేలు చేస్తాయి. ఆకలిని పెంచుతాయి. జీర్ణశక్తి పెరుగుతుంది. నిద్రబాగా పడుతుంది. ఎక్కువ సమయం కూర్చోవటం వలన కలిగే అలసట, కండరాలు బిగదీసుకుపోవటం లాంటి సమస్యలు తగ్గుతాయి.

చింతన

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు, దూరప్రయాణాలు అనుకూలం. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయ ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

వృశ్చిక రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. . గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఉపకరిస్తాయి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభవ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: రుణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.

8.1.2018 సోమవారం

మేష రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. వ్యాపార కార్యాలలో ఆనందకర సంఘటనలు చోటుచేసుకొంటాయి. గృహవిషయాల్లో చిరు ఇబ్బందులు ఏర్పడతాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. కోర్టు వ్యవహారాల్లో ప్రత్యర్థులు బలపడతారు. ఆదాయంలో అనువైన మార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు అనుకూలం. ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆర్థిక లావాదేవీలు ఉపకరిస్తాయి. ప్రయాణాల ద్వారా ప్రయోజనాలు పొందుతారు. శారీరక రుగ్మతలు ఉంటాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగ వ్యవహారాల్లో చిరుసమస్యలను ఎదుర్కొంటారు. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యపరీక్షలు ఉపకరిస్తాయి. గృహవిషయాలు అనుకూలం. కుటుంబ వ్యవహారాల్లో, ఆరోగ్యంలో శ్రద్ధ తప్పని సరి. కోర్టు వ్యవహారాల్లో విజయాలు సాధించగలుగుతారు. ఆర్థిక విషయాల్లో సమస్యలను అధిగమించగలుగుతారు.

కర్కాటక రాశి: గృహ సంబంధిత కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. వ్యాపార లావాదేవీలు కలసి వస్తాయి. దూరప్రయాణాలు లాభిస్తాయి. ఆనందకర పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. శత్రుభీతిపోతుంది. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించ గలుగుతారు.

కన్యా రాశి: ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహాన్ని కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు, సంభాషణలు అనుకూలం. వ్యాపార విస్తరణలు కలసి వస్తాయి. స్వతంత్ర నిర్ణయాలు లాభిస్తాయి. స్థిరాస్తి ప్రతికూల పరిస్థితులు ఇంకా కొనసాగుతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ తప్పనిసరి. వ్యాపారంలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి: వాహన కొనుగోళ్లు వంటివి లాభిస్తాయి. విద్యాప్రయత్నాలు అనుకూలం. విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. వ్యయం పెరుగుతుంది. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. గృహవిషయాల్లో ప్రోత్సాహం ఉంటుంది. విద్యావిషయాల్లో మెరుగైన పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి. వ్యాపార, ఉద్యోగ ప్రతిబంధకాలు తొలగిపోతాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో అనుకూల పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: వ్యాపార నిర్ణయాలలో ప్రతికూలత ఉంటుంది. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని పొరపాట్ల ద్వారా విమర్శలు కొనసాగుతాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు ప్రయత్నంతో సాధ్యం.

మకర రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక లావాదేవీలు కలసి వస్తాయి. ఆరోగ్య రక్షణ ఉంటుంది. వ్యాపార ప్రతిబంధకాలు తొలగిపోతాయి. ఆర్థిక అసహన పరిస్థితులు కనుమరుగవుతాయి. గృహ విషయాల్లో శుభ ప్రయత్నాలు లాభిస్తాయి. పొరపాట్లు అనుకూలంగా మార తాయి. ఆదాయం సులభతరం.

కుంభ రాశి: నూతన వాహనకొనుగోళ్ళు సంతృప్తిని కలిగిస్తాయి. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. సంతోషవార్తలు వింటారు. స్త్రీలకు శుభపరిణామాలు ఉంటాయి. ఆకస్మిక ఆరోగ్య ఆందోళన ఉంటుంది. విజయాలు అన్ని రంగాల వారికి దగ్గరవుతాయి. ప్రత్యర్థుల ద్వారా చిరుసమస్యలు ఉంటాయి. స్థిరాస్తి విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


మీన రాశి: మానసిక ధైర్యం పెరుగుతుంది. ఉద్యోగ వ్యవహారాల్లో ప్రోత్సాహం ఉంటుంది. ఆలోచన సంపత్తి పెరుగుతుంది. ఆరోగ్య అనుకూలత ఉంటుంది. చిరుసమస్యలు ఆర్థికంగా కొనసాగుతాయి. విద్యా విషయాల్లో ఆటంకాలు ఉన్నా నెట్టుకురాగలుగుతారు. కోర్టు వ్యవ హారాల్లో ఆందోళనలు ఉంటాయి. ముఖ్యమైన పనులు విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

జీవితం పూర్వనిర్దేశితమే

కాలం ఎవరికోసమూ ఆగదు మన శక్తుల్ని ఎలా నిర్వహించుకుంటాం. ఏ దిశలో వాటిని కేంద్రీకరిస్తాం. మనం వాటిని వృద్ధి చేసుకుంటామా, తరిగించుకుంటామా- అంతా మన చేతుల్లోనే ఉంటుంది. కాని మన జీవితంలో అత్యంత ప్రధానమైన భాగం కాలం, ఇది మూడోది. ఇది ఎల్లప్పుడూ సాగుతూనే ఉంటుంది. మీరు దాన్ని వేగవంతం చేయలేరు. మెల్లగా నడిపించలేరు. మీరు మీ శక్తిని నిలువ చేసుకోవచ్చు. వృధా చేయవచ్చు. పెంచుకోవచ్చు. చాలా పెద్దదిగా చేసుకోవచ్చు. అల్పంగా కూడా చేసుకోవచ్చు. కాని కాలం మాత్రం జరిగిపోతూనే ఉంటుంది.



సద్గురుబోధ

మనిషి పుట్టినప్పుడు అతనిలో ఒక నిర్దిష్టమైన సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేసి ఉంటుంది. ఈ సాఫ్ట్‌వేర్ కాలం, శక్తి, సమాచారాల కలయిక. అది అతనితో పాటు కొనసాగుతుంది. జీవితంలోని వివిధ అంశాలను ఈ మూడూ కలిసి నిర్ణయిస్తాయి. ఒక మనిషి ఎంతకాలం జీవిస్తాడో, ఎలా జీవిస్తాడో కూడా ఈ మూడూ నిర్దేశిస్తాయి. సమాచారం కచ్చితంగా ముందు నిర్ణయింపబడిందే. అంటే మీరు కొత్త సమాచారం తీసుకోలేరని అర్థం కాదు. మీలో ఎటువంటి సమాచారం ఉన్నదో, దాన్ని బట్టి అది మిమ్మల్ని కొన్ని రకాల విషయాల వైపు లాగడమో, మరోవైపు నెట్టడమో జరుగుతుంది. అయితే మీరివ్వాళ, ఇప్పుడు కొత్త సమాచారం పోగు చేసుకోవడాన్ని ఇది ఆపదు.

ఈ మొత్తం సమాచార రాశినంతా కలిపి సంచిత కర్మ అంటారు. ఈ సమాచార స్వభావం ప్రకారం, జీవితంలోని వివిధ అంశాలకు శక్తిని కేటాయించడం జరుగుతుంది. ఒకవేళ మీ కర్మ సమాచారం గనక శారీరికత వైపు మొగ్గు చూపితే, మీలోని శక్తి సహజంగానే మీ శరీర నిర్మాణం వైపు కేటాయించుకుంటుంది. ఈ సమాచారం మీ మేధా ప్రక్రియ వైపు మొగ్గుచూపితే, దానికి తగినట్లు శక్తి తనను ఆ కార్యకలాపం వైపు కేటాయించుకుంటుంది. అది ఆధ్యాత్మిక కోణం వైపు మొగ్గుచూపితే, శక్తి కూడా తనను ఆ వైపే కేటాయించుకుంటుంది. ఈ కేటాయింపు సహజ ధోరణిలో జరుగుతుంది. కాని ఎవరైనా దీన్ని మరో విధంగా కేటాయించుకోలేరని అనలేము. అలా చేయవచ్చు. కాని పూర్వ నిర్దిష్ట రీతిలోనే మీరు వెళ్లినట్లయితే మీ జీవితం కూడా మళ్లీ అదేవిధంగా జరుగుతుంది. మీరు మీ ధోరణులకు 100శాతం బానిసలైతే మీ జీవితం పూర్వ నిశ్చితమే. ఏం జరుగుతుందో మనం తేలికగా ఊహించవచ్చు.

కాలం ఎవరికోసమూ ఆగదు

మన శక్తుల్ని ఎలా నిర్వహించుకుంటాం. ఏ దిశలో వాటిని కేంద్రీకరిస్తాం. మనం వాటిని వృద్ధి చేసుకుంటామా, తరిగించుకుంటామా- అంతా మన చేతుల్లోనే ఉంటుంది. కాని మన జీవితంలో అత్యంత ప్రధానమైన భాగం కాలం, ఇది మూడోది. ఇది ఎల్లప్పుడూ సాగుతూనే ఉంటుంది. మీరు దాన్ని వేగవంతం చేయలేరు. మెల్లగా నడిపించలేరు. మీరు మీ శక్తిని నిలువచేసుకోవచ్చు. వృధా చేయవచ్చు. పెంచుకోవచ్చు. చాలా పెద్దదిగా చేసుకోవచ్చు. అల్పంగా కూడా చేసుకోవచ్చు. కాని కాలం మాత్రం జరిగిపోతూనే ఉంటుంది.

కాలానికి సంబంధించి దాని మేధస్సు దానికుంటుంది. ఒక వ్యక్తి వ్యవస్థలో, అందుబాటులో ఉన్న శక్తి కేటాయింపు, కర్మ సమాచారాన్ని బట్టి అది ప్రవహిస్తూ ఉంటుంది. ఈ విషయంలో మనమేమీ చేయలేమా అంటే...? చేయగలం. కాని అది తక్కిన రెండు జీవనాంశాల కంటే కష్టం. తక్కిన రెండింటినీ నిర్వహించడం తేలిక. మనిషి జీవితంలో అవి వ్యక్తమవుతాయి. శక్తిని సృజించడం, దాన్ని మీ ఇష్టమొచ్చిన రీతిలో ఉపయోగించడం, మీ ధోరణులు మీ ఆలోచనా సరళిని మీ భావోద్వేగాలను, కార్యకలాపాలను నిర్ణయించడానికి అనుమతించడం, కాలాన్ని చేతిలో పెట్టుకోవడం కంటే చాలా తేలిక. చివరికి ఆదియోగి కూడా నిర్దిష్ట స్థితులలోనే కాలాన్ని తన ఆధీనంలో పెట్టుకున్నాడు. ఆయన అటువంటి స్థితులలో ఉన్నప్పుడు ఆయన్ని కాలభైరవుడంటాం.

ఒక వ్యక్తి ఆయుః ప్రమాణాన్ని, జీవన మరణాలను కాలం నిర్దేశిస్తుంది. జీవితం, మరణం రెండూ కాలం పరిధిలోనే ఉంటాయి. కాలంపై ఆధిపత్యం సంపాదించినవాడికి తన జీవితం, మరణంపై కూడా అధికారం ఉంటుంది. తన జీవన్మరణాలని తానే నిర్ణయించుకోగలడు. అదే తన శక్తులమీద ఆధిపత్యం ఉన్న వ్యక్తి, తన జీవిత స్వభావాన్నీ, జీవన విధానాన్నీ నిర్ణయించుకోగలడు. తన జీవితం మీద అతనికి సంపూర్ణాధికారం ఉంటుంది, కాని మరణం మీద ఉండదు.

తన సమాచారం మీద, లేదా ఆ సమాచారం ఏర్పరచిన ధోరణుల మీద అధికారం ఉన్నవాడు లేదా తాను మోస్తున్న కర్మ సమాచారం నుండి విముక్తుడైన వాడు తన జీవిత ప్రమాణాలపై ఆధిపత్యం సంపాదించగలడు. తాను లోపల ఆనందంతో ఉండాలా లేక దుఃఖంతో ఉండాలా అనేది తనే నిర్ణయించుకోగలడు. ఈ మూడు అంశాలూ కలిపితే జీవితం. మీరిప్పుడు ఈ మూడింటి సమాహారమే. తనలోని ఈ మూడు కోణాలనూ అర్థం చేసుకున్నవాడు, తాను కాలం, శక్తి, సమాచారాల సమాహారమని గ్రహించినవాడు ఈ మూడింటినీ స్పృహతో నడిపినట్లయితే అతడు అన్ని విధాలా విముక్తుడు. వంద శాతం విముక్తుడు. అదే ముక్తి.

- సద్గురు జగ్గీవాసుదేవ్



అహల్యా శాప విముక్తి

శాపానికి గురైన ఇంద్రుడు దేవగణాలను చూసి, 'నేను దేవకార్యార్థమై గౌతమునికి కోపం తెప్పించాను. అతనికి తపోభంగం కలిగించాను, అందువల్ల శాపానికి గురయ్యాను' అన్నాడు. నాకు అవి ప్రాప్తించేలా మీరు ప్రయత్నించండి' అన్నాడు. దేవతలు పితృదేవతల వద్దకు వెళ్ళి యజ్ఞంలో మానవులు సమర్పించిన మేకపోతు వృషణాలను ఇమ్మన్నారు. వారు ప్రసన్నులై మేకపోతు వృషణా లను ఇంద్రునికి అతికించారు అని విశ్వామిత్రుడు తెలిపాడు. అనంతరం 'నీ పవిత్ర పాదస్పర్శతో ఈ ఆశ్రమాన్ని పావనం చేయవయ్యా!' అన్నాడు. రాముడు ఆశ్రమంలో ప్రవేశించాడు. ఆయన పాద ధూళి సోకి భస్మ శాయిని అయిన అహల్య శాప విముక్తి పొందింది. రామలక్ష్మణులు అహల్య పాదాలకు నమస్కరించారు. అహల్య ఆదరాభిమానాలతో వారికి ఆతిథ్యం ఇచ్చింది. పవిత్రురాలయింది. ఆశ్రమం పూర్వ శోభను సంతరించుకుంది. గౌతముడు ప్రత్యక్షమయ్యాడు. అహల్యా గౌతములు ఆశ్రమంలో ప్రత్యక్షం కావడం వల్ల వృక్షాలన్నీ పుష్పఫలభరితాలు అయ్యాయి. దేవతలు పుష్ప వృష్టికురిపించారు. అహల్య ఇచ్చిన ఆతిథ్యాన్ని భక్తితో స్వీకరించారు. గౌతముని పూజలు అందుకున్నారు. శివధనుస్సును చూడగోరి ఇక్కడకు వచ్చారు అన్నాడు విశ్వామిత్రుడు.

మిథిలా నగర ప్రవేశం

విశ్వామిత్ర, రామలక్ష్మణులు అహల్యా గౌత ములను వీడ్కొని ప్రయాణించి మిథిలా నగరంలో ప్రవేశించారు. వారు నివాసయోగ్యమైన ఒక ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని విడిది చేశారు. విశ్వామిత్రుని రాక జనకునికి తెలిసింది. జనకుడు తన పురోహితుడు శతానందుడు (అహల్యా గౌతముల తనయుడు) మొదలైన వారితో వెళ్లి వారిని యజ్ఞశాలకు తోడ్కొని వచ్చాడు. జనకుడు మహర్షులను యథోచితంగా పూజించాడు. ప్రీతిపూర్వకంగా అతిథి సత్కారాలను జరిపాడు. విశ్వామిత్రుని రాక వలన తన రాజ్యం పావనం అయిందని, తాను సంకల్పించిన యాగఫలం తనకు సిద్ధించిందని జనకుడు సంతోషాన్ని వ్యక్తం చేశాడు. 'ఇక పన్నెండు రోజులకు యజ్ఞం పరిసమాప్తం అవుతుంది. హవిర్భాగాలు స్వీకరించడానికి రాబోయే దేవతలను మీరు చూడగలరు' అన్నాడు జనకుడు. అనంతరం సూర్య చంద్రులవలె తేజో విరాజమానులైన రామచంద్రులను చూసి వారి వివరాలు తెలుసుకొన గోరాడు. 'ఈ బాలురు వీరాధివీరులు. దశరథుని పుత్ర రత్నాలు. రామలక్ష్మణులు. సిద్ధాశ్రమంలో రాక్షస సంహారం చేసి నేను సంకల్పించిన యాగం నిర్విఘ్నంగా సమాప్తమయ్యేట్లు నాకు సహకరించారు. మార్గమధ్యంలో విశాల నగరాన్ని సందర్శించారు. రాముడు అహల్యకు శాప విముక్తి కలిగించాడు.

విశ్వామిత్రుని మాటలు విని అహల్యాగౌతముల కుమారుడు శతానందుడు



సంక్షిప్త రామాయణం

పరమానందాన్ని పొందాడు. తల్లి అహల్య శాప విముక్తిని, తండ్రి గౌతముడు మరల ఆశ్రమానికి చేరుకున్న సమాచారాన్ని, తల్లిదండ్రుల కలయికను గూర్చి విన్న శతానందుడు కృతజ్ఞతాపూర్వకంగా రాముని వైపు చూశాడు. భక్తితో విశ్వామిత్రుని చర్యను ప్రశంసించాడు. 'సమయానుగుణంగా నా కర్తవ్యాన్ని నిర్వహించాను' అన్నాడు విశ్వామిత్రుడు. తరువాత శతానందుడు విశ్వామిత్రుని కార్యదీక్షా దక్షతల్ని, సర్వోన్నతమైన వ్యక్తిత్వాన్ని, తపోనిష్ఠను గూర్చి ఇలా తెలిపాడు.

రామా! విశ్వామిత్రుని యాగ రక్షణ చేసిన నీవు ధన్యుడవు. నీవంటి పుణ్యాత్ముడు ముల్లోకాలలో మరొకడు లేడు. విశ్వామిత్రుడు కుశిక వంశంలో జన్మించిన రత్నం. ఇతడు నిరుపమాన శౌర్యపరాక్రమ సంపన్నుడు. భూమండలాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించాడు. ఒక అక్షౌహిణి సైన్యంతో భూమండలం అంతా దిగ్విజయ యాత్ర చేసి ఒకనాడు వసిష్ఠుని ఆశ్రమం చేరాడు. వసిష్ఠుని ఆశ్రమ ప్రశాంతత చూసి విశ్వామిత్రుడు ఆశ్చర్యపోయాడు. పుష్పఫలభరిత వృక్షాలతో, పరస్పర జాతి వైరం మరచి సహ జీవనం సాగిస్తున్న మృగాలతో చెంగు చెంగున గంతులు వేస్తూ నిర్భయంగా క్రీడిస్తున్న లేళ్ళతో శుక పిక శారికాది పక్షుల మధుర కూజితాలతో వసిష్ఠుని ఆశ్రమం చూడముచ్చటగా ఉంది. నిరాహారులు, వాయు భక్షకులు, ఆకులు మాత్రమే తినేవారు, కందమూల ఫలాలు మాత్రమే తినేవారు, జితేంద్రియులు అయిన మహర్షులు, బ్రహ్మర్షులు, దేవర్షులతో అది అపర బ్రహ్మ లోకం వలె ప్రకాశిస్తోంది.

కె.ఓబులేశు
9052847742



భగవద్గీత

అన్నీ నాపైనే ఆధారపడి ఉన్నాయి

అధ్యాయం7

శ్లోకం 7:

మత్తః పరతరం నాన్యత్
కించిదస్తి ధనంజయ।
మయి సర్వమిదం ప్రోతం
సూత్రే మణిగణా ఇవ ॥

తాత్పర్యం

ఓ ధనంజయా ! నా కన్న శ్రేష్ఠమైన సత్యము వేరొక్కటి లేదు. దారమునందు ముత్యములు కూర్చబడినట్లు సమస్తమూ నా పైనే ఆధారపడియున్నది.


భాష్యం

పరమ సత్యము నిరాకారమా లేదా సాకారమా అనే వాదన తరచు వస్తూ ఉంటుంది. అయితే భగవద్గీత అడుగడుగునా పరమ సత్యము, దేవాదిదేవుడు, ఒక వ్యక్తి యని అతడు శ్రీకృష్ణుడేనని తెలియజేయటమైనది. ప్రత్యేకించి ఈ శ్లోకములో అదే విషయము నొక్కి వక్కాణించడమైనది. బ్రహ్మ సంహితలో సైతమూ బ్రహ్మదేవుడు, గోవిందుడే సర్వ కారణములకూ కారణమని వేరే వాదనకు తావివ్వలేదు. కొందరు శ్వేతాశ్వతర ఉపనిషత్తు (3.10) శ్లోకము నందు 'అరూపం' అని చెప్పబడినదని వాదిస్తారు. అయితే దానికి ముందు రెండు శ్లోకములలో పురుషునిగా వర్ణించటం దీనికి సరైన అవగాహనను ఇస్తుంది. అనగా భగవంతుని రూపము భౌతికము కాదని, దివ్య మంగళ స్వరూపము అని దాని అర్థము. కాబట్టి పరమ సత్యము, ఒక వ్యక్తి అని, దేవాదిదేవునిగా తన భౌతిక ఆధ్యాత్మిక శక్తులచే సర్వత్రా విస్తరించి ఉన్నాడని అవగతమవుతుంది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఏసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | iOS iTunes

కింపురుష వర్షము-అధిదేవత



ధర్మం-మర్మం

కింపురుష వర్షమున శ్రీమన్నారాయణుడు సీతాభిరాముడైన శ్రీరాముని రూపంలో అధివసించి హనుమంతుడు మొదలగు పరమ భాగవతోత్తములతో కింపురుషులతో కలిసి సేవించ బడుతుంటారు.

ఓం నమో భగవతే ఉత్తమ శ్లోకాయ నమః
ఆర్యలక్షణ శీలవ్రతాయ నమః
ఉపశిక్షితాత్మనే ఉపాసితలోకాయ నమః
సాధువాద నికషణాయ నమో
బ్రహ్మణ్య దేవాయ మహాపురుషాయ మహారాజాయ నమః॥

మనలో కామ, క్రోధ, లోభ, మోహ, మదమత్సరం అనే అరిషడ్వర్గాలు ఉన్నాయి. వీటిని నవవిధ భక్తులతో నివారించుకొనుట సాధ్యము కాదు. అందువలన ఈ మంత్రాన్ని యధావిధిగా భక్తిశ్రద్ధలతో భాగవతం మూలం నుంచి గ్రహించి తప్పులు లేకుండా జపించాలి. ఈ శ్రీరామ మంత్రాన్ని ఏ అపచా రములు, అనాచారములు అశ్రద్ధ, అనాదరము లేకుండా పఠించాలి. ఈ శ్రీరామ మంత్రాన్ని జపించు వారు ప్రలోభాలకు లోనవకుండా నియమనిష్ఠలతో సకల లోక కళ్యాణ వాంఛ కలిగివుండాలి. ఈ మంత్రము జపించు వారికి కృతజ్ఞత, లోకజ్ఞత, ప్రియముగా మాట్లాడుట, అధర్మాన్ని సహించకుండుట మొదలగు గుణాలు అలవడతాయి.

మంత్ర జప విధానం

ప్రాతఃకాలముననే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రములు ధరించి లలాటమున తిలకమును దిద్దుకుని పూజామందిరంలో దీపారాధన చేసి తమ నిత్య కృత్యములైన సంధ్యావందనాది కార్యక్రమాలను ముగించుకుని నిశ్చలమైన, పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి.



- డా॥ కందాడై రామానుజాచార్య



కళకు పరిశీలనే పునాది

సంస్కృతి



మానవునిలో పరిశీలనల వలన అతనిలోని అంతః చైతన్యం దేదీప్యం అవుతుంది. అది కట్టిపడేస్తుంది. హృదయం ద్రవిస్తుంది. మెదడు ప్రకంపనలు సృష్టిస్తుంది. అపుడది కళారూపంగా వెలుపలికి వస్తుంది. దీన్ని చూసిన చూపరులలో ఇదే భావం కలుగుతుంది. అతడు కళను ఆస్వాదించగలుగుతాడు. అతడూ కళాకారుడైతే అతని ద్వారా ఇదే చైతన్యం వ్యక్తమవుతుంది.

మన దైనందిన జీవితంలో మనుగడ కోసం, కొన్ని శక్తులను వాడుకుంటుంటాం. మన దృష్టి, వాక్కు, స్పర్శ, ఘ్రాహణ శక్తి, రుచి, వీటితో మన జీవనాన్ని సాగిస్తుంటాం. మనిషి నాగరికునిగా మారుతున్న కొద్దీ తన జీవన కార్యాలు సాధించుకోవడానికి తన శక్తులను మరింత పెంచుకోవడానికి కృషి చేస్తుంటాడు.

కళ అన్నది అనేక విషయాల కలయిక. కళ అన్నది ఒక మానసిక, వ్యక్తిగత అనుభవం. ఈ కళ అన్నది పరిశీలన ద్వారా మరింత ముందుకు సాగగలదు. ఏ కళకైన పరిశీలన అన్నది ప్రాథమికాంశం. మన జీవనానికే పరిశీలన పరమావధిగా చెప్పవచ్చు. మన పరిశీలనల వలన మనలో కలిగే ఆలోచనలు, ఆవేశాలు, భావాలు, అనుభవాలు అన్నీ కూడా కళారూపాలుగా వ్యక్తమవుతున్నాయి. కళ అన్నది మానవునిలో భావాలను రాజేయడానికి ఉపకరించే ఒక సాధనం. పరిశీలనతో ఇది మరింత రాటు తేలుతుంది. మానవునిలో పరిశీలనల వలన అతనిలోని అంతః చైతన్యం దేదీప్యం అవుతుంది. అది కట్టిపడేస్తుంది. హృదయం ద్రవిస్తుంది. మెదడు ప్రకంపనలు సృష్టిస్తుంది. అపుడది కళారూపంగా వెలుపలికి వస్తుంది. దీన్ని చూసిన చూపరులలో ఇదే భావం కలుగుతుంది. అతడు కళను ఆస్వాదించగలుగుతాడు. అతడూ కళాకారుడైతే అతని ద్వారా ఇదే చైతన్యం వ్యక్తమవుతుంది. అతడు కళాపోషకుడు అయినప్పుడు అతని హృదయం ద్రవించి ఆనంద భాష్పాల రూపంలో అతనిలోని కళాజీవి మేల్కొంటాడు.

''కళ'' వల్ల మనలను, మనచుట్టూ గల వ్యక్తులను, పరిసరాలను మరింత చైతన్యవంతంగా మార్చుకోవచ్చు. మనలోనున్న సౌందర్య ప్రతిభ సృజనాత్మక అంశాలకు దారితీస్తుంది. దీనికి కావాల్సినది ''పరిశీలన''.


ఫ్రెడ్రిక్ ఫ్రాంక్ అనే విమర్శకుడు చెబుతూ ''ఈ సమాజంలోని ప్రతి ఒక్కటి కూడా మనకందిన ఒక బహుమతి, అది అంతా మనం చూడడంలోనే ఉంది'' అంటాడు. మనం చూడడం అన్నది కేవలం విషయంగా అనిపించవచ్చు కానీ, ఇదే మనలో భావాలకు, ఆలోచనలకు, ఆవేశాలకు, ప్రతిస్పందనలకు దోహదపడుతుంది. ఇక్కడ ఒక విషయం చెప్పబడుతుంది. ''చూడటం'' అంటే కేవలం కళ్లు తెరచి చూడడమని అనుకోరాదు. మరింతగా చెబితే ''పరిశీలన''గా అనుకుందాం.

మామూలు వ్యక్తులు కూడా కళాకారులు కావచ్చు. కళాకారులు, కథకులు, సాహిత్యకారులు వంటి వారందరూ మంచి పరిశీలనాపరులై ఉంటారు. వారెప్పుడూ తమ చుట్టూ ఉన్న వస్తువులు, మనుషులను, పరిసరాలను, పరిశీలిస్తూనే ఉంటారు. మంచి పరిశీలకులు కావాలంటే నాణ్యతగా పరిశీలనలు జరపాలి. మనం తీసుకున్న ఏ రంగమైనా నాణ్యతా పరిశీలనలు మంచి ఫలితాలను ఇస్తుంది. చూసిన విషయాన్ని తార్కికంగా, క్రమపద్ధతిలో, అర్థవంతంగా ప్రదర్శించగలగాలి. బయటున్న ప్రపంచాన్ని మన అంతరంగంలోకి తీసుకుపోయి కావాల్సినది తీసుకుని మిగిలినది వదలివేయాలి. మనం గ్రహించిన దానిని కళగా రూపొందించాలి. ఇది కొంత సాధనతో, అభ్యాసంతో, అనుభవంతో సాధ్యపడుతుంది.

మనం ఏదైతే కళారూపాన్ని కూర్చామో, అది తప్పక మన అభ్యాస, అనుభవాల నుండే వచ్చి ఉంటుంది. అలాకాక అనుకరణలతో వచ్చినవి అనతికాలంలోనే అంతమవడం కూడా చూస్తూనే ఉంటాం. కొన్ని సామాన్య పరిశీలనల గురించి చెప్పుకుందాం. రాయి ఎంత పెద్దగా ఉంది. ఎంత చిన్నగా ఉంది అన్న విషయంలో దాని పరిమాణం చెప్పబడుతుంది. ఒకరాయి విసరాలనుకున్నప్పుడు దాని ఆకారం, పరిమాణం బట్టి అంచనావేస్తాం. విసరాలనుకున్నప్పుడు ''దూరం'' అన్నది చెప్పబడుతుంది. మనం చూస్తున్న దాన్ని బట్టి ఒక వస్తువు ఆకార, పరిమాణాలుంటాయి. మన చేతిలో రాయి చిన్నదిగానే

అప్పుడు ఒక్క కళ్లు మాత్రమే కాక, మెదడు, హృదయం కూడా ఇందులో పాలుపంచుకుంటాయి. జెఫ్ బెర్నర్ చెబుతూ-''విషయాన్ని పరిశీలనగా కాక కేవలం చూడటం వల్ల ఎక్కువ లాభం పొందలేం. పరిశీలనగా చూడగలిగినప్పుడే అది అర్థమయ్యేట్టు ఉంటుంది. దాన్ని మరో మారు మననం చేసుకుంటే సరిపోతుంది'' అంటారు.

ఈ పరిశీలనా శక్తి వల్లనే



ఉంటుంది. కొంచెం దూరాన గల రాయి పెద్దదిగానే ఉంటుంది. కానీ దూరాన ఉన్న కొండ మాత్రం చిన్నదిగానే కనబడుతుంది. కారణం మనమున్న దూరం.

ఈ దూరం దగ్గర అన్న విషయాలు చిత్రకళా రంగాన్ని పునీతం చేశాయి. వాటిలో వచ్చిన అభివృద్ధి నేడు చిత్ర కళారంగాన్ని మరింత రంగులమయం చేసింది. మరెన్నో కళలు, శాస్త్రాలకు పునాది అయింది. ఈ దూరం, దగ్గర అన్న విషయాలన్నీ చిత్రకళలో ''దృష్టిప్రక్రమత'' లేక పెర్‌స్పెక్టివ్ అంటారు'' రెండు అయతనాల ఉపరితలం పైన మూడవ అయతనంగా లోతును చూపడం'' దీన్నే పెర్‌స్పెక్టివ్ అంటారు. అంతవరకూ ఉన్న మనకళా దృష్టి ఈ విషయం ప్రదేశంతో విప్లవాత్మక మార్పుతో, రెట్టించిన వేగంతో దూసుకెళ్లగలిగింది.


విట్రూవియస్ అనే శిల్ప శాస్త్రకారుని ప్రకారం ''అగతార్కస్ అనే చిత్రకారుడు మొదటి పర్‌స్పెక్టివ్‌ను'' చూపగలిగాడు. క్రీ.పూ. 5వ శతాబ్ది నాటి ఈస్కలస్ నాటక రచనలో ప్రస్తావించాడు. దీన్ని ఆధారం చేసుకుని అనగ్జగోరస్, డెమోక్రిటస్ అనే తత్త్వవేత్తలు పురోగామి, తిరోగామి వస్తువులు సమతలంపై కనబడే తీరు గురించి, ఇంకా చిత్రకారుని దృష్టి కేంద్రం నుంచి స్థితి బిందువు మధ్య పయనించు రేఖల గురించి తెలిపారు. మధ్యయుగాలలో మరీ ముఖ్యంగా సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో ఈ అంశంపై విశేష కృషి కనిపిస్తుంది. క్రీ.శ. 1413లో ప్రసిద్ధ ఇటాలియన్ చిత్రకారుడు, వాస్తు శిల్ప బ్రూనెలిషి చిత్రం ''బాప్టిస్టి ఇన్ ఫ్లోరెన్స్''లో ప్రాథమిక పెర్‌స్పెక్టివ్ లక్షణాలున్నాయి. 1435లో అతని సహచర చిత్రకారుడు ఎనోస్కీ పెర్‌స్పెక్టివ్ చిత్ర లక్షణాలు ఎన్నో ఉన్నాయి. నేటికి ఇదొక గొప్ప విషయంగా చెప్పబడుతుంది. ఇలా పెర్‌స్పెక్టివ్ వృద్ధి చెందడాన్ని ఏనోస్కీ కళ శాస్త్రంగా వృద్ధి చెందింది అంటాడు.

ఆల్ బర్టీ తయారుచేసిన ''ఆల్‌బర్టీ విండో'' అన్న విధానంతో చుట్టు చెక్క చట్రంలో నిలువు, అడ్డు ఊచలుంటాయి. దీని నుంచి మనం చిత్రించాల్సిన వస్తువును చూస్తాము. అదేవిధంగా కాన్వాస్‌పై నిలువు, అడ్డువరుసలతో గీతలు గీయబడి ఉంటాయి. వీటినే ''గ్రిడ్'' అంటారు. అలా ఈ విధానంగా, ఈ పరికరాలు వాడి చిత్రాన్ని ఖచ్చితత్వంతో గీయడానికి అవకాశం ఉంటుంది. ఇదే పద్ధతిలో జొనాథన్ కారీ, డేవిడ్ హాకనీలు ఈ మధ్యకాలంలో ''ఆల్‌బర్టీ విండో'' విధానంలో ఫోటోగ్రఫీలో కృషి చేస్తున్నారు.

బ్రూనెలిషి ''పెయింటింగ్‌కు, అద్దంకు మధ్య ఉన్న దూరం'' విధానంలో చిత్రాలు గీయడం తెల్పాడు. పెయింటింగ్ నఖలు, అద్దం ఒకే రంధ్రం గుండా చూస్తూ చిత్రం, ప్రతిబింబం అద్దంపై పడుతుంది. దీన్ని పరిశీలించి చిత్రం చిత్రించడం, దీనివలన సరైన కొలతలతో చిత్రం గీయవచ్చునని భావించాడు.

అయొనార్డో డావిన్సీ తన అభిప్రాయం చెబుతూ- ''పెర్‌స్పెక్టివ్ అన్నది గ్లాసు ముక్క నుండీ చూసి గానీ, అడ్డు నిలువు వరుస గీతలతో గీచే విధానాల వల్ల గానీ, మరింత ఎక్కువ ఖచ్చితత్వంతో గీయగలరు. కానీ పరిశీలనలోనే వాటి దూరాలు, ఆకారాల నిష్పత్తులు అంచనా వేయగలగడం మంచిది'' అంటాడు. చిత్రాన్ని గీస్తున్న పెన్సిల్‌తోనే మన ముందున్న వస్తువు పొడవు, వెడల్పులు కొలవమనే విధానం, ప్రవేశపెట్టబడింది.

పెనఫ్కోస్కే చెబుతూ-''పెర్‌స్పెక్టివ్ అన్నది మనుషులకు, వస్తువులకు మధ్య గల



దూరం'' అంటూ చమత్కరిస్తారు. పెర్‌స్పెక్టివ్ విధానాన్ని ఫ్రాన్‌సెస్కా పావరో ఉచ్చెల్లో, ఆల్ బ్రెక్ట్‌డ్యూరర్, మొదలైన చిత్రకారులు తమదైన శైలిలో ఆవిష్కరణలు చేశారు.

పెర్‌స్పెక్టివ్‌ను ''దృష్టిప్రక్రమత'' అంటారని చెప్పుకున్నాం. ఇది సమాంతర దృష్టి ప్రక్రమత, కోణీయ దృష్టిప్రక్రమత, తిర్యక్ దృష్టిప్రక్రమత అని మూడు విధాలు 18వ శతాబ్ది నుండి కళావేత్తలు యాంత్రికంగా ఈ ప్రక్రమతను వాడడాన్ని నిరసిస్తూ మరికొన్ని కొత్త పదాలు తెరపై తెచ్చారు. దీంతో స్వేచ్ఛా చిత్రణ ప్రారంభమైంది.

ఎల్.ఆర్. వెంకట రమణ

జనపదాలలో విప్రవినోదులు

తెలుగు రాష్ట్రాలలో ఎక్కడో చెదురుమదురుగా విప్రవినోదం ప్రచారంలో ఉందని చెప్పలేం కాని 1600నుండి 1700సంవత్సరాలలో ఈ వినోదాలు వ్యాప్తిలో ఉన్నాయి అంటే అది విజయనగరసామ్రాజ్యం కాలం. ఈ కళ ఆనాటిదని చెప్పవచ్చు. విప్రులనగా బ్రాహ్మణులు. వారు వినోదం చేయడం వలన విప్రవినోదమని పేరు వచ్చింది.

బ్రాహ్మణులలో ఒక తెగ బ్రాహ్మణులు, దేవతోపాసన వలననో, మంత్ర తంత్రాల వలననో, ఒక విచిత్రమైన గారడీలు చేస్తూ ఉంటారు.

అష్టావధాన్ని కూడా చేస్తూ ఉంటారు. ఆంధ్రదేశంలో ఈ వినోదం చేసేవారు అక్కడక్కడా వున్నారు. గుంటుపల్లి ముత్తరాలనే విప్రవినోది గోలకొండ సుల్తానుల తుదికాలంలో వున్నట్లు సురవరం ప్రతాపరెడ్డిగారు తెలిపారు.

చాటువు

సంతత మారగించు నెడ సజ్జనకోటుల
పూజ సేయు శ్రీమంతుడు గుంటుపల్లి
కులమంత్రి శిఖామణి ముత్త మంత్రి దౌ
బంతియె బంతిగాక కడువంద గులా
ముల బంతు లెల్ల దూల్ బంతులు దుక్కి
టెడ్ల యెడ బంతులు విప్రవినోది
గారడీ బంతులు మమ్ము ధరాతలంబునన్

అని వర్ణించాడు. ఈ విధంగా ఆ కాలంలో విప్రవినోదాలు జరుగుతుండేవి. విప్రవినోదం చేసేవారు ఆంధ్రదేశమంతటా వున్నట్లు మనకు ఆధారాలున్నాయి.



మాణిక్యాలపురం విప్రవినోదులు

తెలంగాణాలో ఈ విప్రవినోదులు కరీంనగర్ జిల్లా మాణిక్యాలపురంలో ఉన్నట్లు సమాచారం. వీరి వృత్తి విప్రులను యాచించడమే. వీరి ప్రదర్శనం కూడ ఇంద్రజాలమే. వీరి దళసభ్యులు నలుగురుంటారు. వీరి ప్రదర్శనం విపుల ఇండ్లలోనూ, విశాల బహిరంగ స్థలాల్లోనూ కూడా ప్రదర్శిస్తారు. వీరి ప్రదర్శన సామాగ్రి అయిదు శాలువలు, ఒక కొయ్య అలమారా, ఒక తాళపత్ర గ్రంథం, ఎండు జతల తాళాలు, ప్రదర్శనం విశాల ప్రదేశంలో ఒక చిన్న పందిరిలో జరుగుతుంది. పందిరి చుట్టూ కాలువలు కడతారు. ఆ తెరల మధ్య ఖాళీ అలమారా ఉంచుతారు. ఇరువురు వ్యక్తులు చెరో ప్రక్క చేరి తాళాలతో భజన చేస్తారు. ఇంతలో ప్రేక్షకులు గుమికూడతారు. తెరలన్నీ ఎత్తి ఖాళీ అలమారా చూపిస్తారు. తరువాత దళసభ్యుడు ప్రాచీన తాటాకుల గ్రంథంలో తెర మధ్యకు వెళతాడు. ఒక పావుగంట వరకూ ఆయన బయటకు రాడు. ఈలోగా భజన జరుగుతూనే ఉంటుంది. లోపల ఏం జరుగుతూందో అనే ఆసక్తి ప్రేక్షకులలో రేకెత్తిస్తుంది.

ఇంతలో తెరను తొలగిస్తారు. అదివరకు ఖాళీగా వున్న అలమారాలో దేవతా విగ్రహాలు, దీపారాధన కుందులూ, పుష్పాలూ, ఫలాలూ, పిండివంటలూ, గంట శంఖం వివిధ పూజాపాత్రలు అనేక రకాల పిండివంటలు ప్రత్యక్షమౌతాయి. అలాగే ఒక మామిడిటెంకను పాతిపెట్టి పదినిమిషాల్లో అడుగు ఎత్తున పెరిగిన మామిడి మొక్కను చూపిస్తారు. ఈ ప్రదర్శనం ప్రేక్షకులను ఆశ్చర్య చకితుల్ని చేస్తుంది. ప్రదర్శనానికి ముందే అలమారాలను పరీక్షించవచ్చు. అంతేకాక వీరు ఇంటింటికి తిరుగునప్పుడు విగ్రహాలను, కప్పలను, చిలకలను, విభూతిని, అరచేతిలో సృష్టించి ఇంద్రజాల మహేంద్ర జాల విద్యను ప్రదర్శిస్తారు.

రాయలసీమ విప్రవినోదులు

రాయలసీమ విప్రవినోదులు, జాతర్ల లోనూ, తిరునాళ్ల లోనూ, గుడారాలను నిర్మిస్తారు. ఈ గుడారాల్లో రామాయణం మొదలైన కథలను అత్యద్భుతంగా చిత్రిస్తారు. వీరు గొప్ప మాట కారులు, హాస్య ప్రియులు, చెప్పింది చెప్ప కుండా చెపుతారు. ప్రేక్షకులను తమ హాస్య ప్రసంగాలతో ఆనందంలో ముంచెత్తుతారు. వీరు భలే తమాషాలు చేసి, ప్రేక్షకులను ఆనందపరుస్తారు. వీరు ముందు పేరు అడిగి తెలుసుకుంటారు. దూరంగా వుండే తమ జట్టు వారికి అర్థమయ్యే రీతిలో పద్యాల ద్వారా, సైగలు ద్వారా, మన పేరును తెలియచేస్తారు. వారు అక్కడ నుంచే మన పేరులను వారితోనే చెప్పించి చుట్టూ మూగిన ప్రేక్షకులను ఆశ్చర్య చకితుల్ని చేస్తారు. వీరు రాయలసీమ ప్రాంతాల్లో ఒకప్పుడు విరివిగా ప్రదర్శనలిచ్చేవారు. ఈనాడు వీరి జాడ వున్నట్లు ఆధారాలు లేవు.

విప్రవినోదుల రోప్ ట్రిక్

విప్రవినోదులు ఆరోజుల్లో రోప్ ట్రిక్‌ను చేసేవారు. అంటే ఒక త్రాడును ఆకాశంలో ఎగరేస్తే అది అలాగే నిలబడితే, దానిమీద మనిషి ఎక్కి అంతర్థానమయ్యేవాడట.

- ఉన్నం వెంకటేశ్వర్లు
8919479134

రసవత్తరమైన నాటకం సతీసావిత్రి

సతీసావిత్రి నాటకం మైలవరం రాజాగారి సృష్టి. శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రిగారు ఆయన 1889-1954 ప్రాంతంలో జీవించారు. ఈ నాటకాన్ని మైలవరం కంపెనీవారు బెజవాడలో భారీ సెట్టింగులతో వ్యయప్రయాసలతో గొప్పగా ప్రదర్శించారు. ఇందులో యముడు సత్యవంతుడు, సావిత్రి, ప్రధానపాత్రలు.

యముడుగా గురజనాయుడుగారు, వేమూరి గగ్గయ్యగారు, తరువాత గగ్గయ్యగారి కుమారుడు రామయ్యగారు, వేమూరి సీతారామశాస్త్రిగారు మొదలైనవారు నటించేవారు. సత్యవంతుడిగా యడవల్లి సూర్యనారాయణగారు, సి.ఎస్.ఆర్.గారు నిడుముక్కుల సుబ్బారావుగారు మొదలైనవారు నటించేవారు. సావిత్రిగా ఉప్పులూరి సంజీవరావుగారు ఆ పాత్రకు ప్రాణం పోశారు. ఆయన ఆడకంఠం అచ్చెరువొందించేది. ఆయన సావిత్రి పాత్ర వేయటం కోసమే పుట్టారనిపిస్తుంది.

నేను ఒక తడవ నా చిన్నతనంలో మా బంధువు రమ్మంటే ఆయన వెంట సంజీవరావుగారింట సత్యనారాయణపురం విజయవాడకు వెళ్లాను. నేను బైట కూచున్నాను. మా బంధువు లోపలికి వెళ్లాడు. ఎవరో ఆడవాళ్లు మాట్లాడుతున్నారనుకున్నాను చాలాసేపు. తీరా లోపలికి వెళ్లి చూస్తే అది ఉప్పులూరివారే. సారంగధరుడు లాగా సత్యవంతుడు కూడా సి.ఎస్.ఆర్.గొప్పగా నటించేవాడని సురభి రామారావుగారు నాతో ఒక తడవ అన్నారు.





ఏమైనా సినిమా దాకా వచ్చేసరికి ఆ అవకాశం యముడుగా వేమూరి గగ్గయ్యగారికి సత్యవంతుడు నిడముక్కల సుబ్బారావుగారికి వచ్చింది. ఆరోజుల్లో గగ్గయ్యగారి 'ధిక్కారమును సైతునా' అనే పాట ఎంతో పేరు తెచ్చుకున్నది. సంగీతం పాపట్ల కాంతయ్యగారు సమకూర్చేవారు. ప్రేక్షకులకు అడ్డురాకుండా మైలవరం కంపెనీవారు ఒక గొయ్యి తవ్వించి అందులో ఆర్కెస్ట్రా పెట్టేవారు. దాన్ని హార్మోనిష్టు గొయ్యి అన్నారు. బెజవాడ మైలవరం నాటకం చూడటానికి హైదరాబాదు, సికిందరాబాద్ మొదలైన దూరప్రాంతాల నుంచి కూడా ప్రేక్షకులు ఆసక్తితో వచ్చేవారు. ఇక చుట్టుప్రక్కలవాళ్లు నడిచి బండ్లు కట్టుకొని రావటంలో ఆశ్చర్యం లేదు. యడవల్లి వారు ''పోయెన య్యొ సతిననుబాసి'' అనే పాట శకుంతలలోను, సతీసావిత్రిలోను పాడేవారు. సతీసావిత్రి నాటకాన్ని ఏలూరి మోతినారాయణరావుగారు ప్రదర్శించేవారు. కొద్ది మార్పులతో ప్రచురించిన నాటకం అది. నేను 1950 బెజవాడ చెట్ల బజారు (గోపాలరెడ్డిరోడ్)లో సీతారామ సమాజం వాళ్లు వేయిస్తే చూశాను. గగ్గయ్యగారు యముడు, టి. రామకృష్ణశాస్త్రిగారు నారదుడు ఎస్.పి.లక్ష్మణస్వామి (తెనాలి రామకృష్ణఫేమ్) పువ్వుల అనసూయ సావిత్రి వేయగా చూశాను. అద్భుతంగా ఉంది. 197లో రవీంద్రభారతీలో వేమూరి సీతారామశాస్త్రిగారు యముడుగా, రాధారాణి సావిత్రిగా నేను సత్యవంతుడుగా సావిత్రి నాటకాన్ని ప్రదర్శించాం. తరువాత రామయ్యగారు యముడుగా, విమలకుమారి సావిత్రిగా నేను సత్యవంతుడుగా త్యాగరాయగానసభలో వేశాము. రసవత్తరమైన నాటకం సావిత్రి.

- అయ్యదేవర పురుషోత్తమరావు
9290448444

నిండు దుస్తుల్లో కూడా గ్లామర్ ఉంటుంది


అనుపమ పరమేశ్వరన్

టాలీవుడ్ తెరపై మాలీవుడ్ (మళయాల) భామల హవా నడుస్తోంది. వారికి మంచి మంచి అవకాశాలు వస్తున్నాయి. గ్లామర్, అభినయం రెండు ప్రదర్శించే వారిలో అనుపమ పరమేశ్వరన్ ఒకరు. శతమానంభవతి, ఉన్నది ఒకటే జిందగి చిత్రాలు అనుపమ కెరీర్‌ను మరింత వేగం చేశాయి. ఉన్నత విద్యనభ్యసించిన ఆమెకు కెరీర్‌పరంగా కొన్ని నిర్ధిష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఒకవైపు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూనే మరోవైపు ఇష్టంలేని పాత్రలను సున్నితంగా తిరస్కరిస్తోంది. ఇటీవల ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నుండి పిలుపు వచ్చింది. మంచి పారితోషికం ఆఫర్ చేశారట. కానీ నటించేందుకు నిరాకరించింది. కారణం ఏమంటే ఇప్పటికంటే ఇంకా ఎక్కువ గ్లామర్‌తో కనిపించాలి అని షరతు విధించారు. నేను కేవలం గ్లామర్‌కే పరిమితమా? అనిపించింది అందుకే చేయడానికి నిరాకరించాను అని చెప్పింది అనుపమ. సినిమారంగంలో గ్లామర్ పాత్రలు చేయనంటే కుదరదు. కానీ గ్లామర్ అంటే కురచ దుస్తులు ధరించడం కాదనేది నా అభిప్రాయం. నిండు డ్రస్‌లు వేసుకుని కూడా గ్లామర్‌గా కనిపించవచ్చు. అలాగే మరో సినిమాలో నా పాత్ర చనిపోతుంది అని చెప్పారు. అది నాకు నచ్చలేదు. అందుకే చేయలేదు. నాది మధ్యతరగతి కుటుంబం. కుటుంబసభ్యులంతా చూసి ఆనందించే సినిమాలే చేస్తాను అని స్పష్టం చేసింది.

తను భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించనని చెప్పింది. అలా ఆలోచించడం అంటే సమయాన్ని వృధా చేయడమే అనేది నా అభిప్రాయం. రోజు చేస్తున్న పనిని ఆస్వాదించాలి. అంతేకానీ ఎలా ఉంటుందో తెలియని రోజుల గురించి ఆలోచించడం అనవసరం. కెరీర్‌పరంగా కానీ మరేదైనా కానీ ఇంతవరకు ప్లాన్ చేసుకోలేదు. దాని గురించి ఆలోచించడం లేదు అని అనుపమ తెలిపింది. ఇక ఖాళీగా ఉంటే ఏం చేస్తుంటారు? అని అడుగుతుంటారు. నిజానికి నాకు ఖాళీ సమయం చాలా తక్కువ. మా ఇంట్లో విస్కి అనే డాగ్ ఉంది. దానితోనే కాలక్షేపం చేస్తుంటాను. పాటలు వింటూ ఉంటాను. వీలుంటే సాంకేతిక అంశాల గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తాను అని చెప్పింది. వ్యాయామం గురించి చెబుతూ పరిమితంగానే చేస్తాను. ఆర్టిస్టు అయ్యాక తిండి విషయంలో కొంత జాగ్రత్తగా ఉంటున్నాను అని అనుపమ తెలిపింది.



అండగా నిలబడే గ్యాంగ్

-సూర్య

సూర్య, కీర్తి సురేష్ జంటగా నటించిన తమిళ చిత్రం తాన సేంద్ర కూట్టమ్..తెలుగులో గ్యాంగ్ పేరుతో అనువాదమవుతోంది. ఈ చిత్రానికి విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించారు. యూవీ క్రియేషన్స్ తెలుగులో సూర్య సినిమాను విడుదల చేస్తోంది. సంక్రాంతి పోటీలో చేరిన గ్యాంగ్..జనవరి 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. పాటలను విడుదల చేసిన అనంతరం సూర్య మాట్లాడుతూ....తాన సేంద్ర కూట్టమ్‌కు తెలుగులో గ్యాంగ్ అంటూ యూవీ క్రియేషన్స్ చాలా మంచి పేరు పెట్టారు. అందరికీ త్వరగా తెలిసిపోయే టైటిల్ ఇది. మన జీవితంలో ప్రతి దశలోనూ ఓ గ్యాంగ్ వెంట ఉంటుంది. పాఠశాల, కళాశాలలో చదువుకుంటున్నప్పుడు, ఉద్యోగాలు చేస్తున్నప్పుడు మనవాళ్లైన మనుషులు ఒకరికొకరు అండగా ఉంటారు. జీవితంలో చాలా కీలకమైనదీ గ్యాంగ్. అరవింద్‌గారు నాకు ఎప్పటి నుంచో మిత్రులు. కొత్తగా మా జట్టులో యూవీ క్రియేషన్స్ వంశీ ప్రమోద్ కలిశారు. దర్శకులు విఘ్నేష్ శివన్ ఈ చిత్రంలో నన్ను కొత్తగా చూపించారు. ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందించే సినిమా అవుతుంది. రమ్య కృష్ణ ప్రత్యేక పాత్రలో నటించారు. కీర్తి సురేష్ తో పనిచేయడం సంతోషంగా ఉంది. తెలుగులో ఈ సినిమాకు నేను డబ్బింగ్ చెప్పుకున్నాను. అన్నారు. కీర్తి సురేష్ మాట్లాడుతూ...నాకు ఈ సినిమా అవకాశం ఎంతో ప్రత్యేకమైంది. సూర్య గారితో నటించడం గొప్ప అనుభవం. రమ్యకృష్ణగారు సహ నటి కావడంతో ఎంతో నేర్చుకున్నాను. కథను చెప్పడంలో దర్శకుడి పనితనం మీకు భిన్నమైన అనుభవాన్ని అందిస్తుంది. అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ....గజినీ సినిమా నుంచి సూర్య గారితో నాకు మంచి అనుబంధం ఉంది. మేమిద్దరం కలిసి సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాం. కానీ కుదరడం లేదు. త్వరలో మా కాంబినేషన్ సినిమా వస్తుంది. అన్నారు. దర్శకులు మారుతి మాట్లాడుతూ....గ్యాంగ్‌తో మరో అద్భుతమైన చిత్రాన్ని సూర్య మన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. సంక్రాంతి పండక్కి అగ్ర కథానాయకుల చిత్రాలతో పాటు సూర్య సినిమా వస్తోంది. విఘ్నేష్ శివన్ నాన్ రౌడీ దాన్ చూశాను. చాలా కొత్తగా అనిపించింది. ఆయన చిత్రాల్లో హాస్యం బాగుంటుంది. అనిరుధ్ ఈ చిత్రానికి మంచి సంగీతాన్ని అందించారు. సంక్రాంతికి ఆయనవి రెండు సినిమాలు వస్తున్నాయి. సూర్య తెలుగు నేర్చుకుని డబ్బింగ్ చెప్పడం గొప్ప విషయం. అన్నారు. దర్శకులు విఘ్నేష్ శివన్ మాట్లాడుతూ...తెలుగు ప్రేక్షకులు సినిమా ప్రేమికులు. బాగున్న చిత్రం ఎవరిదైనా ఆదరిస్తారు. మనమంతా జనవరి 10న పవర్‌స్టార్ అజ్ఞాతవాసి చూస్తున్నాం. అలాగే 12న సూర్య గ్యాంగ్ చూడబోతున్నాం. అన్నారు.

జయ దర్శకత్వంలో బి.ఎ.రాజు కొత్త చిత్రం

జయ బి. దర్శకత్వంలో లోగడ ప్రేమలో పావని కల్యాణ్, చంటిగాడు, గుండమ్మ గారి మనవడు, లవ్‌లీ, వైశాఖం వంటి చక్కటి చిత్రాలను నిర్మించి, అభిరుచి గల నిర్మాతగా పేరు తెచ్చుకున్న బి.ఎ.రాజు ఆదివారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్.జె. సినిమాస్ పతాకంపై మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత బి.ఎ.రాజు మాట్లాడుతూ, ప్రేమలో పావని కల్యాణ్ చిత్రం ద్వారా నిర్మాతగా మారి పదిహేను సంవత్సరాలు పూర్తయింది. మా బేనర్‌లో నిర్మించిన చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. తాజాగా మా ఆర్.జె. సినిమాస్ బేనర్‌లో జయ దర్శకత్వంలో నిర్మించబోయే చిత్రానికి సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. జూన్‌లో ఈ సినిమాను మొదలుపెడతాం. మేము నడుపుతున్న సూపర్‌హిట్ మేగజైన్ 24వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది అని అన్నారు.


బి.ఎ.రాజు

గృహిణిగా విలక్షణ పాత్రలో

నేనేదనుకుంటే అది చెప్పడం నాకు అలవాటు...తర్వాత సంగతి తర్వాత అనే డైలాగ్‌ను చూస్తే ఆ పాత్రకు ఉన్న ప్రాధాన్యం ఎలాంటిదో ఇట్టే అర్థమైపోతుంది. ఇప్పటివరకు గ్లామర్ పాత్రలే కాదు ఎన్నో విభిన్నమైన పాత్రలను పోషించిన శ్రియ గృహిణి పాత్రలలో కూడా మెప్పించారు. తాజాగా ఆమె నటిస్తున్న చిత్రం గాయత్రి. ఇందులో మధ్యతరగతి గృహిణిగా మరో విలక్షణ పాత్రలో నటిస్తున్న ఆమె ఈ స్టిల్‌లో చక్కటి చీరకట్టుతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నారు. శ్రీ లక్ష్మీప్రసన్న పిక్చర్స్ పతాకంపై మోహన్‌బాబు ప్రధాన పాత్రలో, విష్ణు మంచు, శ్రియ జంటగా మదన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నూతన సంవత్సరం మొదటి రోజున విషు, శ్రియలు ఆదర్శ దంపతులుగా కనిపించే పోస్టర్ విడుదల కాగా తాజాగా చిత్రబృందం శ్రియ పోస్టర్‌ను విడుదలచేసింది. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో నిఖిల విమల్, బ్రహ్మానందం తదితరులు నటిస్తుండగా, కథ, మాటలు: డైమండ్ రత్నబాబు, సంగీతం: ఎస్.ఎస్.తమన్, ఛాయాగ్రహణం: సర్వేష్ మురారి. ఆర్ట్: చిన్న, ఎడిటింగ్: ఎం.ఆర్.వర్మ, ఫైట్స్: కనల్ కణ్ణన్.


శ్రియ

హాస్య ప్రధానంగా ఆచారి అమెరికా యాత్ర


విష్ణు మంచు,

హీరో విష్ణు మంచు, దర్శకుడు జి.నాగేశ్వర్‌రెడ్డి కలయికలో దేనికైనా రెడీ, ఈడోరకం..ఆడోరకం వంటి చిత్రాలొచ్చిన సంగతి తెలిసిందే. మళ్లీ వారిద్దరి కలయికలో రూపుదిద్దుకుంటున్న ఆచారి అమెరికా యాత్ర చిత్రం ఈ నెల 26న విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కాగా ఈ చిత్రం టీజర్‌ను ఆదివారం విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం తెలియజేస్తూ...అమెరికా, మలేషియా, హైదరాబాద్‌లలో ఈ చిత్రం షూటింగ్ జరుపుకుందని, అందరినీ అలరింపజేసే హాస్యంతో చిత్రం చాలాబాగా వచ్చిందని చెప్పారు. ఈ చిత్రంలో విష్ణు సరసన ప్రజ్ఞ జైస్వాల్ నటిస్తుండగా, బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో తనికెళ్ళ భరణి, కోట శ్రీనివాసరావు, పోసాని, పృథ్వీ, ప్రవీణ్, విద్యుల్లేఖ, రామన్, ప్రభాస్ శ్రీను, ప్రదీప్ రావా, ఠాకూర్ అనూప్‌సింగ్, సురేఖవాణి తదితరులు తారాగణం.ఈ చిత్రానికి రచన: మల్లాది వెంకటకృష్ణమూర్తి, మాటలు: డార్లింగ్ స్వామి, ఛాయాగ్రహణం: సిద్ధార్థ్, సంగీతం: ఎస్.ఎస్.థమన్, ఎడిటింగ్: వర్మ, యాక్షన్: కనల్‌కణ్ణన్, ఆర్ట్: కిరణ్, సమర్పణ: ఎం.ఎల్.కుమార్‌చౌదరి, నిర్మాతలు: కీర్తిచౌదరి, కిట్టు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: జి.నాగేశ్వర్‌రెడ్డి.

హృతిక్ సూపర్30

విద్యావేత్త ఆనంద్ కుమార్ జీవిత కథలో నటించబోతున్నారు బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్. వికాస్ బాల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ పాత్ర గురించి తెలుసుకునే స్వయంగా ఆనంద్‌కుమార్ వద్దే శిక్షణ తీసుకుంటున్నారు హృతిక్. పాట్నా నగరానికి చెందిన ఆనంద్...సూపర్ 30 అనే కార్యక్రమం ద్వారా అత్యంత ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ఎంపిక చేసి వాళ్లకు ఐఐటీ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి దాకా సూపర్ 30 ద్వారా ఎందరో పేద విద్యార్థులు ఐఐటీలో


హృతిక్ రోషన్


ప్రవేశం పొందారు. ప్రపంచంలో ఎందరినో ఆలోచింపజేసింది ఆనంద్ కుమార్ కృషి. సమాజం పట్ల ఆయనకున్న సేవాదృక్పథం ఇప్పుడు బాలీవుడ్‌ను ఆకర్షించింది. త్వరలో ఆనంద్ కుమార్ జీవిత కథ తెరపైకి రాబోతోంది. ఈ కథలో భాగమవడంపై హృతిక్ స్పందిస్తూ....మన జీవితాల్లో అత్యంత గొప్ప విషయం సేవ. సమాజానికి, మన తోటి మనుషులకు సాయం చేయడం అనేది అత్యుత్తమం. నా పిల్లలకు ఇదే విషయాన్ని చెప్పాలని ప్రయత్నిస్తుంటాను. రేపు నేను వాళ్లకు ఇవ్వబోయే అసలైన ఆస్తి సేవా దృక్పథమే అనుకుంటాను. ఈ సామాజికసేవ మన చుట్టూ సానుకూల వాతావరణాన్ని ఏర్పరుస్తుంది. తద్వారా ప్రపంచాన్ని మార్చే శక్తినిస్తుంది. అన్నారు. ప్రస్తుతం ఈ చిత్రంతో పాటు హృతిక్ సూపర్‌హీరో ఫిల్మ్ సిరీస్ క్రిష్ 4లో నటిస్తున్నారు.

అదితి మళ్లీ వచ్చేసింది


అదితీరావ్

చెలియా.. అదితీరావ్ హైదరీ గు ర్తుందా..లేకుంటే గుర్తు చేసేందుకు మళ్లీ తెలుగు తె రకొస్తోంది. ఈ బాలీవుడ్ నాయిక దక్షిణాది చి్మ త్రాలతో కెరీర్ ప్రారంభించింది. మలయాళ, తమిళ సినిమాలు చేసిన తర్వాత బాలీవుడ్ వెళ్లి అక్కడ పేరున్న నాయిక అయ్యింది. పలు విజయవంతమైన చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం పద్మావతి, ఔర్ దేవదాస్ అనే భారీ సినిమాల్లో నటిస్తోంది. ఇంతలో అదితీ గాలి టాలీవుడ్ మీద సోకుతోంది. సుధీర్‌బాబు కొత్త సినిమాలో నాయికగా ఎంపికైన ఈ హాట్ భామ...త్వరలో వెంకటేష్ సరసన కూడా ఓ చిత్రంలో నటించనున్నట్లు సమాచారం. ఈ రెండు సినిమాలు పూర్తయేలోపు ఆమెకు మరిన్ని అవకాశాలూ రావొచ్చు. దీంతో ఆమె బాలీవుడ్‌తో దక్షిణాది భాషల నాయిక అయ్యింది. ఈ విషయంపై అదితీ స్పందిస్తూ....చిత్రాల ఎంపికలో భాషా బేధాలు చూడనంది, భావోద్వేగాల కలయిక అయిన చలన చిత్రాలకు ఏ తేడాలు ఉండకూడదని చెప్పింది. అదితీ మాట్లాడుతూ...సినిమా కథలు మనిషి భావోద్వేగాలను చూపిస్తాయి. ఈ ఫీలింగ్స్‌కు భాషా బేధాలు ఉండవు. సంతోషాలకు, బాధలకు మనుషులంతా ఒకేలా స్పందిస్తారు. నేను ఎంచుకునే చిత్రాలకూ హద్దులు చూడను. భాష, ప్రాంతం లాంటి తేడాలు నన్ను నటించకుండా అడ్డుకోవడం ఇష్టముండదు. గొప్ప గొప్ప దర్శకులతో పనిచేయాలని ఉంది. అని చెప్పింది.

థ్రిల్‌కు గురిచేసే స్ట్రీట్ లైట్స్


మమ్ముట్టి

మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి నటించిన తాజా చిత్రం స్ట్రీట్ లైట్స్. శ్యామ్‌దత్ సైనుద్దీన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ప్లే హౌస్ మోషన్ పిక్చర్స్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. కాగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసిన సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, విభిన్నమైన కథల్ని ఎంచుకునే మమ్ముట్టి ఈసారి కూడా ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేసే ఈ చిత్ర కథాంశాన్ని ఎంచుకున్నారు.

క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని తమిళ, మ లయాళ భాషలతో పాటు తెలుగులోనూ వి డుదల చేయనున్నాం. లోగడ మమ్ముట్టి న టించిన చాలా చిత్రాలు తెలుగులో పెద్ద వి జయాలు సాధించాయి. ప్రత్యేకం గా ఆ యనకు తెలుగులో వీ రాభిమానులున్నారు. అందుకే ఈ చి త్రాన్ని తెలుగులో భారీగా విడుదల చేసేందుక ు సన్నాహాలు చేస్తున్నాం. తెలుగు టీ జర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ద ర్శకుడు ఆవిష్కరించిన కథ, కథనాలు ప్రే క్షకు లను ఎంతగానో ఆకట్టుకుంటాయి. అలాగే మమ్ముట్టి కెరీర్‌లోనూ ఓ మైలురాయి చి త్రంగా నిలిచిపోతుంది అని అన్నారు. ఈ చి త్రంలోని ఇతర పాత్రల్లో స్టంట్ శివ, మొట్ట రా జేంద్ర, పాండిరాజన్, మ నోబాల, బ్లాక్‌పాండి, శ్రీరామ్, పృథ్వీ, పాండిరాజ్, సంపత్‌రామ్, రోనీ, మాస్టర్ ఆశిష్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాదత్ సైనుద్దీన్, సంగీతం: ఆదర్శ్ అబ్రహాం, ఆర్ట్: సాబురామ్, స్టంట్స్: శివ, ఎడిటింగ్: మనోజ్.